ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిటర్లకు ఊరట

అత్యవసర వైద్య కారణాలతో విత్‌డ్రా కోరిన వారికి 100 శాతం సొమ్ము చెల్లించాల్సిందే

ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ స్పష్టీకరణ

2025 జనవరి 1 నుంచి అమల్లోకి

11

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 14-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 137 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.24 తదుపరి దశమి; నక్షత్రం: అనూరాధ మ. 12.13 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: సా. 5.58-7.37; దుర్ముహూర్తం: ఉ. 11.54-12.44; అమృతఘడియలు: తె. 3.50 నుంచి 5.29 వరకు; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పదవుల బొనాంజా!

ఎల్లుండి ఢిల్లీకి సీఎం రేవంత్.. పీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో చర్చ

సామాజిక సమీకరణలు చూసుకుని.. టీపీసీసీ చీఫ్, కార్యనిర్వాహక అధ్యక్షులు, ప్రచార కమిటీ చైర్మన్ నియామకం

4 మంత్రిపదవులు, ఉప సభాపతి, చీఫ్‌విప్‌పైనా నిర్ణయం

బీసీ కమిషన్ సహా పలు కార్పొరేషన్ పదవుల భర్తీకి చాన్స్

బీసీ కమిషన్ చైర్మన్‌గా వీహెచ్, నిరంజన్ పేర్ల పరిశీలన

రైతు, విద్యా కమిషన్లకు కోదండరెడ్డి, ఆకునూరి మురళి పేర్లు

19 లేదా 20న పదవుల భర్తీపై ప్రకటనకు అవకాశం!



నేడు కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ షురూ

కోకాపేటలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్

దక్షిణ కొరియా నుంచి వచ్చిన అనంతరం కార్యక్రమానికి..

10 లక్షల చదరపు అడుగుల్లో కార్యకలాపాలు

15 వేల ఉద్యోగాలు.. హైదరాబాద్‌లో ఐదోది..

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్‌లో పదవుల భర్తీకి వేళయింది. దీనిపై అధిష్ఠానంతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం (16న) ఢిల్లీకి వెళ్లనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయి టీపీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణపైన చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే బీసీ, రైతు, విద్యా కమిషన్లు సహా పలు కమిషన్లు, కార్పొరేషన్ల చైర్మన్ పోస్టుల భర్తీకి సంబంధించి అధిష్ఠానంతో ఆమోదముద్ర వేయించుకోనున్నట్లు తెలుస్తోంది. మొత్తం అన్నీ కలిపి 20 నుంచి 30 దాకా పదవుల భర్తీకి అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ చర్చల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా పాల్గొననున్నట్లు తెలుస్తోంది. అనంతరం 19న లేదా 20వ తేదీన ఒక ప్రకటన వెలువడే అవకాశం ఉందని.. లేదా పదిహేను రోజులలోపే ప్రకటించవచ్చని విశ్వసనీయ సమాచారం. ఈ పదవుల భర్తీలో సామాజికవర్గ సమీకరణలే ప్రముఖ పాత్ర పోషిస్తాయని అంటున్నారు. టీపీసీసీ చీఫ్ పోస్టుకు ప్రస్తుతం ప్రధానంగా బీసీ సామాజిక వర్గం నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎస్టీల నుంచి ఎంపీ బలరాంనాయక్ పోటీ పడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ రేసులో ఉన్నారు. తుదినిర్ణయం అధిష్ఠానానిదే అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీపీసీసీ చీఫ్‌తో పాటు.. నాలుగు కార్యనిర్వాహక

మిగతా 13వ పేజీలో...

ఎస్సీ వర్గీకరణపై అందరితో చర్చించాకే నిర్ణయం!

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

12

సెబి చీఫ్, అదానీపై 22న కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం

ఈడీ కార్యాలయాల ఘెరావ్

షేర్‌మార్కెట్ స్కాంలో మోదీకి పూర్తి పాత్ర

కులగణనపైనా విస్తృతంగా ప్రజల్లోకి: ఖర్గే



సిరిసిల్లలోని గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

అధ్వాన హాస్టళ్లు

అపరిశుభ్రమైన వంటగదులు.. అసహ్యంగా మరుగుదొడ్లు

ఆహార మెనూ, రక్షిత మంచి నీటి సరఫరా.. ఏవీ లేవు

కోడిగుడ్లు, పాలు పంపిణీ ఫైళ్లకు మాత్రమే పరిమితం

సరుకుల కొనుగోళ్లలో పలు అవకతవకలు, అక్రమాలు

విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చేసి చూపిస్తున్న వైనం

వారానికోసారి లేదా నెలకోసారి మాత్రమే వార్డెన్ల రాక

రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో ఏసీబీ తనిఖీల్లో వెలుగులోకి

సర్కారుకు నివేదిక, మెరుగైన చర్యలకు సిఫారసులు: ఏసీబీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో చాలావరకూ అపరిశుభ్రంగా ఉన్నాయని, విద్యార్థులు ఉంటున్న గదుల్లో తగినంత గాలి, వెలుతురు ఉండట్లేదని, వారికి రక్షిత తాగునీరు ఇవ్వట్లేదని.. వంటగదులు మురికిగా, మరుగుదొడ్లు దారుణంగా ఉన్నాయని.. నిబంధనల ప్రకారం విద్యార్థులకు రోజూ ఇవ్వాల్సిన కోడిగుడ్లు, పాలు ఇవ్వకపోగా, గడువు ముగిసిన (ఎక్స్‌పైర్డ్) ఆహార పదార్థాలను ఇస్తున్నారని అవినీతి నిరోధక సంస్థ (ఏసీబీ) తనిఖీల్లో

మిగతా 12వ పేజీలో...



గురుకులాల ప్రక్షాళన

ప్రతి నెలా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఏ విద్యార్థి నేలపై పడుకోవడానికి వీల్లేదు

మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకో రోజు సందర్శించాలి: డిప్యూటీ సీఎం భట్టి

12

విద్యార్థులకు పోషకాహారం అందించండి

ప్రిన్సిపాళ్లను ఆదేశించిన మంత్రి పొన్నం

మంత్రి తుమ్మల కంటతడి

హరీశ్ విమర్శలతో మనస్తాపం

ప్రజల కోసం పని చేస్తా.. పబ్లిసిటీ కోసం కాదు

'సీతారామ' ప్రారంభానికి మీరూ రండి

ప్రజాస్వామ్యంలో నీది నాది ఏదీ లేదు.. అంతా ప్రజలదే

మీ తప్పిదాలను మాకు అంటగట్టొద్దు: తుమ్మల

సీతారామ.. 2026 ఆగస్టు 15కల్లా పూర్తి

బీఆర్ఎస్ హయాంలో 39% పనులే పూర్తయ్యాయి

రేపు సీఎం చేతుల మీదుగా 3 పంప్‌హౌస్‌లు..

రాజీవ్ లింక్ కెనాల్ ప్రారంభం: మంత్రి ఉత్తమ్

ఖమ్మంతో పెట్టుకోవద్దు.. ఎంత తక్కువ గోక్కుంటే అంత మంచిది: మంత్రి పొంగులేటి



మీడియాతో మాట్లాడుతున్న తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ హయాంలో పూర్తయిన సీతారామ ప్రాజెక్టుకు.. ఇప్పుడు రిబ్బన్ కట్ చేసేందుకు కాంగ్రెస్ నేతలు ఉవ్విళ్లూరుతున్నారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలతో తుమ్మల మనస్తాపానికి గురయ్యారు. ప్రజాస్వామ్యంలో నీది.. నాది అంటూ ఏదీ ఉండదని, అంతా ప్రజల కష్టం, రక్తం, చెమటతో కట్టే పన్నులతోనే పనులు చేస్తాం తప్ప.. సొంత డబ్బుతో ఎవరూ పనిచేయరని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించే బాధ్యత అధికారంలో ఉండే ప్రభుత్వానికే ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇది తెలుసుకోకుండా హరీశ్‌రావు తనపై విమర్శలు చేయడం తగదన్నారు. మంగళవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల విలేకరుల

మిగతా 13వ పేజీలో...

13

రూ.3000 కోట్ల అప్పు

ఆర్బీఐ ఈ వేలం ద్వారా సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం



పర్యాటక హోటళ్లు ప్రైవేట్‌కు!

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉన్న హోటళ్లలో నాసిరకంగా సదుపాయాలు

వాటిని మెరుగుపరిస్తే టూరిస్టుల సంఖ్య పెరుగుతుందన్న యోచనలో సర్కారు

సుమారు 35 ఆస్తులను లీజుకు ఇవ్వడంపై కసరత్తు.. ఆందోళనలో సంస్థ ఉద్యోగులు

ఇప్పటికే లీజుకిచ్చిన వాటిల్లో రూ.400 కోట్లకు చేరుకున్న అద్దె బకాయిలు

రాజకీయ సిఫారసులతో లీజు దక్కించుకొని సొమ్ము చెల్లించని బడాబాబులు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల వద్ద నిర్మించిన హోటళ్లు, రెస్టారెంట్లు, స్థలాలను ప్రైవేటు సంస్థలకు లీజుకిచ్చేందుకు రంగం సిద్ధమైంది. పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన సుమారు 35 ఆస్తులను లీజుకు ఇవ్వనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. పర్యాటక ప్రాంతాల్లో విశాలమైన ప్రదేశాల్లో, వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్మించిన ఈ వసతి సదుపాయాల నిర్వహణ అనుకున్నంత మెరుగ్గా లేదని.. సర్కారు భావిస్తోంది. పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యత, మనోహర దృశ్యాల దృష్ట్యా వస్తున్న సందర్శకులు.. అక్కడున్న వసతి కూడా బాగుందని భావిస్తే ఆ విషయం విస్తృత ప్రచారంలోకి వచ్చే అవకాశాలున్నాయి. అది రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్యను కూడా పెంచేందుకు ఉపకరిస్తుంది. ఇదే ఉద్దేశంతో పర్యాటక సంస్థ నడుపుతున్న పలు ఆస్తులను ప్రైవేటు సంస్థలకు లీజుకిచ్చేందుకు సర్కారు రంగం సిద్ధం చేసింది.

సర్కారు లీజుకు ఇవ్వాలని చూస్తున్న 35 హోటళ్లు, రెస్టారెంట్లు, స్థలాల్లో హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని నీరా కేఫ్, గోల్కొండ సమీపంలోని తారామతి బారాదరిలోని ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్, ఫంక్షన్ హాళ్లు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్దనున్న హోటల్ సిద్ధార్థ, సావనీర్ షాపులు, కాటేజీలు,

మిగతా 14వ పేజీలో...



స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టండి

టెల్కోలకు ట్రాయ్ ఆదేశాలు

'డు నాట్ డిస్టర్బ్' ఆప్షన్‌తో పరిష్కారం!

2

122 మంది తెలంగాణ ఉద్యోగుల రిలీవ్

ఉత్తర్వులు జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

13

ఏసీబీ వలలో అదనపు కలెక్టర్



నిషేధిత జాబితా నుంచి 14 గుంటల భూమి తొలగించేందుకు 8 లక్షల డిమాండ్

డబ్బు తీసుకోవాల్సిందిగా సీనియర్ అసిస్టెంట్‌ను పురమాయించిన భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ నిర్వాకం.. రెడ్‌హ్యాండెడ్‌గా అసిస్టెంట్ పట్టివేత

ఆపై అదనపు కలెక్టర్‌ను చాకచక్యంగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఆయన నివాసంలో సోదాలు.. రూ.16 లక్షలు, ఆస్తి పత్రాల జప్తు?

14

నగదుతో పట్టుబడిన రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, అధికారి మదన్ మోహన్‌రెడ్డి

40% మందికి రుణాలు మాఫీ కాలేదు!

రూ.2 లక్షలు ఒకే సారి మాఫీ చేస్తామని ఇప్పటికీ చేయలే

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు

రైతు సమస్యలపై రచ్చబండ నిర్వహిస్తామని వెల్లడి



3

కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతోనే సుంకిశాల ప్రమాదం

అయినా ప్రభుత్వం దానిని వెనకేసుకొస్తోంది

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

12



పేదల సొంతింటి కలను సాకారం చేద్దాం

రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

3

2018 సర్వేలో నాటి ప్రభుత్వం భాగస్వామి కాలేదు

కేంద్రానికి రాష్ట్రం నుంచి ఇళ్ల జాబితాను పంపలేదు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో కేసీఆర్ మభ్యపెట్టారు

మీరు ప్రత్యేక శ్రద్ధతో జాబితా పంపండి: కిషన్‌రెడ్డి

ప్రాణత్యాగాల ఫలితం

సుప్రీంకోర్టు తీర్పు ద్వారా మాదిగ జాతి గెలిచింది

30 ఏళ్ల పోరాటం ఫలించింది: మందకృష్ణ

తీర్పు తరువాత తొలిసారి హైదరాబాద్‌కు..

ఎమ్మార్పీఎస్ శ్రేణుల ఘన స్వాగతం

నగరంలో భారీ విజయోత్సవ ర్యాలీ

కవాడిగూడ/బర్కత్‌పుర/రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన వారి కంటే తమ శ్రమ గొప్పది కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణ కోసం తెల్లబండ్ల రవి మొట్టమొదల ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. బిడ్డల ప్రాణ త్యాగాలకు నేడు ఫలితం దక్కిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం ఢిల్లీ నుంచి తొలిసారి హైదరాబాద్‌కు చేరుకున్న మందకృష్ణ మాదిగకు జంట నగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి క్లాక్‌టవర్, ప్యాట్నీ, బైబిల్ హౌస్, ట్యాంక్‌బండ్ మీదుగా బషీర్‌బాగ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కళాకారుల నృత్యాలు, డప్పుల చప్పుళ్లతో విజయోత్సవ ర్యాలీ హోరెత్తింది. క్లాక్‌టవర్ వద్ద భారీ గజమాలతో మందకృష్ణ మాదిగను సత్కరించారు. ఎమ్మార్పీఎస్ శ్రేణులు దారి పొడవునా బాణసంచా



బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన మందకృష్ణ

కాల్చుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ర్యాలీ.. రాణిగంజ్ ట్యాంక్‌బండ్ మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నాక.. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి మందకృష్ణ మాదిగ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరిగి అక్కడి నుంచి ప్రారంభమైన ర్యాలీ బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్దకు చేరుకుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో మందకృష్ణ

మిగతా 12వ పేజీలో...

చట్టబద్ధమైన తల్లి ఎవరు?

అండం ఇచ్చిందొకరు.. కడుపున మోసిందొకరు

- సరగసీ ఖర్చును భరించిన మహిళ మరొకరు
- అండ/వీర్య దాతకు.. బిడ్డపై చట్టపరమైన హక్కులు ఉండవని తేల్చిన బాంబే హైకోర్టు


ముంబయి, ఆగస్టు 13: అండ/వీర్య దాతకు.. పుట్టే బిడ్డపై ఎలాంటి చట్టపరమైన హక్కులూ ఉండవని, ఆ బిడ్డకు తాము బయలాజికల్ పేరెంట్స్ అని చెప్పుకోజాలరని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. మహారాష్ట్రకు చెందిన ఒక మహిళ (42) పెళ్లయి చాలాకాలమైనా బిడ్డలు లేకపోవడంతో.. అద్దె గర్భం ద్వారా పిల్లలను పొందాలని భావించింది. తన చెల్లి అండం, తన భర్త వీర్యంతో సరగసీ విధానంలో 2019 ఆగస్టులో ఇద్దరు కవల ఆడపిల్లలను పొందింది. అయితే.. అదే ఏడాది ఏప్రిల్‌లోనే ఆమె చెల్లెలు భర్త, కుమార్తె రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. 2021 మార్చిలో.. భర్త ఆమెకు విడాకులిచ్చి ఆమె చెల్లెలితో, ఇద్దరు కవలలతో కలిసి వేరే ఫ్లాట్‌లో నివసించడం ప్రారంభించాడు. రెండేళ్ల పాటు మాతృత్వ మాధుర్యాన్ని అనుభవించిన ఆ మహిళ.. ఆ పిల్లలను చూసే అవకాశం కూడా తనకు కల్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు, కోర్టును ఆశ్రయించింది. తనకు ఉన్న 'విజిటేషన్ రైట్స్' (వెళ్లి పిల్లలను చూసుకునే హక్కు.')ను కాపాడాలని కోరింది. కింది కోర్టు ఆమె వినతిని తిరస్కరించగా.. ఆమె బాంబే హైకోర్టులో అప్పీలు చేసింది. అయితే.. 'అండ దానం' చేసినందున తానే అసలైన (బయలాజికల్) తల్లినని ఆమె చెల్లెలు కోర్టులో వాదించింది. ఆమె భర్త కూడా ఆమెనే బలపరిచాడు. అయితే.. అండం ఆమెదే అయినా, ఆమె స్వచ్ఛంద దాత అని.. ఆ బిడ్డలను కడుపున మోసింది ఆమె కాదు కాబట్టి చట్ట ప్రకారం ఆమెను తల్లిగా పరిగణించకూడదని పిటిషనర్ తరఫు లాయర్ వాదించారు. వాదనలు విన్న జస్టిస్ జాదవ్.. మంగళవారం తీర్పునిచ్చారు. సరగసీ ద్వారా ఆ పిల్లలు పుట్టింది 2018లో కాబట్టి.. 2021 నాటి సరగసీ (నియంత్రణ) చట్టం ఈ కేసులో వర్తించదని.. 2005లో భారత వైద్య పరిశోధన మండలి మార్గదర్శకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. వాటి ప్రకారం 'వీర్యదాత'గానీ, 'అండదాత'గానీ ఎన్నటికీ శిశువులపై చట్టపరమైన హక్కును ప్రకటించుకోలేరని తేల్చిచెప్పారు. అండం ఇచ్చిన తల్లి 'జెనెటిక్ మదర్' మాత్రమే అవుతుందని స్పష్టం చేశారు. ప్రతి వారాంతంలో మూడు గంటల పాటు పిల్లలతో గడిపేందుకు ఆ తల్లికి (పిటిషన్ వేసిన మహిళకు) అవకాశం ఇవ్వాలని ఆదేశించారు.

నేను ఓడిపోతే.. వెనిజువెలాకు వెళ్లిపోతా!



వాషింగ్టన్, ఆగస్టు 13: అధ్యక్ష ఎన్నికల్లో ఒక వేళ ఏదైనా జరిగి తాను ఓడిపోతే వెనిజువెలాకు వెళ్లిపోతానని, అప్పుడు అమెరికా కంటే అదే సురక్షిత ప్రాంతమని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు ఆయన 'ఎక్స్'లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసలను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తాను తిరిగి అధ్యక్షుడినైతే... అమెరికా చరిత్రలో జరగనన్ని బహిష్కరణలు జరుగుతాయని హెచ్చరించారు. దేశంలో లక్షల సంఖ్యలో అక్రమ వలసదారులున్నారని వారందరిని బహిష్కరిస్తామన్నారు. బైడెన్ కంటే కమలా హ్యారిస్ మరింత అసమర్థురాలని వ్యాఖ్యానించారు. ఆమె గెలిస్తే అమెరికా నాశనమవుతుందన్నారు.

లోకం తీరు



నా తండ్రికి ఘోర అవమానం జరిగింది



న్యూఢిల్లీ, ఆగస్టు 13: తన తండ్రితోపాటు బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘోర అవమానం జరిగిందని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా అన్నారు. తనకు న్యాయం కావాలని ఆమె డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై మంగళవారం తొలిసారి స్పందించారు. అమెరికాలో నివాసం ఉంటున్న తన కుమారుడి ఎక్స్ ఖాతా ద్వారా బంగ్లాదేశ్ ప్రజలకు ఆమె సందేశం పంపించారు. ఆగస్టు 15న బంగ్లాదేశ్ జాతిపిత, బంగబంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ వర్ధంతి సందర్భంగా ఆ రోజు దేశవ్యాప్తంగా సంతాప దినంగా పాటించాలని, బంగబంధు భవన్‌లో పూలమాలలు సమర్పించి ప్రార్థించాలని కోరారు. వేలాది మంది చావుతో పాటు దేశంలో విధ్వంసానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని హసీనా కోరారు.

ఉక్రెయిన్ ఆధీనంలోకి 28 రష్యా పట్టణాలు

కీవ్/మాస్కో, ఆగస్టు 13: ఉక్రెయిన్ సైన్యం దూకుడు పెంచింది. కుర్స్క్ ప్రాంత సరిహద్దు గుండా రష్యాలోకి 12 కిలోమీటర్ల మేర చొచ్చుకెళ్లింది. అక్కడ 28 పట్టణాలు, గ్రామాలను తమ ఆధీనంలోకి తీసుకొంది. దీంతో ఆ ప్రాంతం నుంచి 1.80 లక్షల మంది ఇళ్లు, ఆస్తులను వదిలి తరలిపోయారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత రష్యా ఎదుర్కొంటున్న అతిపెద్ద విదేశీ దాడి ఇది. కాగా, రష్యాలోని వెయ్యి చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామని ఉక్రెయిన్ మిలిటరీ చీఫ్ అలెక్జాండర్ సిర్స్కీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల అధికారులు, సైనిక ఉన్నతాధికారులతో రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. నిర్వాసితులను ఆదుకుంటామన్నారు.

వక్ఫ్ బిల్లు జేపీసీ చైర్మన్‌గా జగదాంబికా పాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: వక్ఫ్ బిల్లు పరిశీలనకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి చైర్‌పర్సన్‌గా లోక్‌సభ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత జగదాంబికా పాల్ నియమితులయ్యారు. వక్ఫ్ బోర్డు అపరిమిత అధికారాలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో ప్రభుత్వం ఈ బిల్లును పున:పరిశీలన జరిపేందుకు 31 మంది సభ్యులతో జేపీసీని నియమించింది. ఇందులో 21 మంది లోక్‌సభ సభ్యులు 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఈ జేపీసీకి చైర్‌పర్సన్‌గా లోకసభ సీనియర్ ఎంపీ జగదాంబిక పాల్‌ను నియమిస్తూ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం నిర్ణయం తీసుకున్నారు.

ఈ నెల 17న బీజేపీ పదాధికారుల సమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 13: బీజేపీ జాతీయ పదాదికారుల సమావేశం ఈ నెల 17న నిర్వహించనున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, జనరల్ సెక్రటరీలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం, జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడం వంటి అంశాలపై అక్కడ చర్చించనున్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసిన తర్వాతే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ జరుగనున్నట్లు తెలుస్తోంది. దానికి ఇంకా సమయం పట్టనుండటంతో ముందు వర్కింగ్ ప్రెసిడెంట్‌ను నియమించనున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డాను సైతం 2019లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ నియమించింది. ఆ తర్వాతే ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

'గౌరవ్' బాంబు తొలి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, ఆగస్టు 13: సుదూరంలో ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థ్యం కలిగిన 'గౌరవ్' గ్లైడ్ బాంబును డీఆర్‌డీవో తొలిసారి ఓ యుద్ధ విమానం నుంచి మంగళవారం విజయవంతంగా ప్రయోగించింది. భారత వాయుసేనకు చెందిన సుఖోయ్ ఎస్‌యూ-30 ఎంకే-1 ఫైటర్ జెట్‌ను ఈ ప్రయోగం కోసం వినియోగించింది. గ్లైడ్ బాంబులను యుద్ధ విమానాల నుంచి ప్రయోగిస్తుంటారు. నిర్దిష్ట లక్ష్యానికి కొంత దూరం నుంచి గ్లైడ్ బాంబులను యుద్ధ విమానాలు జార విడుస్తాయి. అనంతరం జీపీఎస్ లేదా ఆ తరహా సాంకేతికతతో ఈ బాంబులు నిర్దేశిత లక్ష్యాలను కొడతాయి. అయితే, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో హైదరాబాద్‌లోని ఆర్‌సీఐ(రీసెర్చ్ సెంటర్ ఇమారత్)లో అభివృద్ధి చేసిన వెయ్యి కిలోల శ్రేణి గ్లైడ్ బాంబు గౌరవ్‌ను ఒడిసా తీరంలో ప్రయోగించారు.

ఎంపీఏటీజీ క్షిపణి పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ, ఆగస్టు 13: స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ (ఎంపీఏటీజీఎం)ను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఈ తేలికపాటి ట్యాంకు విధ్వంసక ఆయుధ వ్యవస్థను రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో మంగళవారం పరీక్షించినట్లు సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. రాత్రివేళల్లో సైతం ప్రయోగించడానికి వీలుగా దీన్ని రూపొందించారు. 15 కిలోల కంటే తక్కువ బరువు ఉండే ఈ క్షిపణిని బలగాలు మోసుకెళ్లడం సులభం. భుజంపై నుంచి శత్రుదేశాల ట్యాంకులు, ఆయుధాలను తరలించే వాహనాలపైకి ప్రయోగించవచ్చు.

ఉప్పు... చక్కెరలో మైక్రోప్లాస్టిక్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: భారతీయ ఉప్పు, చక్కెర బ్రాండ్లు అన్నీ మైక్రోప్లాస్టిక్స్‌ను కలిగి ఉన్నాయని మంగళవారం ప్రచురితమైన ఓ అధ్యయనం పేర్కొంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా, ప్యాకింగ్ చేసినవి, చేయనివి.. ఇలా అన్నింట్లోనూ ఇవి ప్రమాదకర స్థాయిలో ఉన్నాయని స్పష్టం చేసింది. పర్యావరణ పరిశోధన సంస్థ టాక్సిక్స్ లింక్ 'మైక్రోప్లాస్టిక్స్ ఇన్ సాల్ట్ అండ్ షుగర్' పేరిట ఈ అధ్యయనం నిర్వహించింది. దీనిలో భాగంగా టేబుల్ సాల్ట్, రాతి ఉప్పు, సముద్రపు ఉప్పు, స్థానిక ముడి ఉప్పు సహా 10 రకాల ఉప్పులతో పాటు ఆన్‌లైన్‌లో, స్థానిక మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఐదు రకాల చక్కెర నమూనాలను పరీక్షించారు.

రూ.60వేల కోట్లతో 6 జలాంతర్గాములు

ముంబై, ఆగస్టు 13: అత్యాధునిక సాంకేతికతతో ఆరు జలాంతర్గాములను రూ.60వేల కోట్లతో నిర్మించడానికి ప్రభుత్వ యాజమాన్యంలోని మజగావ్ డాక్ లిమిటెడ్ (ఎండీఎల్)కు భారత నౌకాదళం ఆమోదం తెలిపింది. ప్రాజెక్ట్ 75 ఇండియా కింద జలాంతర్గాముల ట్రయల్స్ పూర్తయిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో పెరుగుతున్న చైనా, పాక్‌ల ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ఈ ఒప్పందం భారత్‌కు అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం జర్మనీకి చెందిన థైస్సెన్ క్రుప్ భాగస్వామ్యంతో ఎండీఎల్.. లార్సెన్ అండ్ టుబ్రో, నవంతియాతో పోటీ పడింది.

అంగారకుని గర్భంలో మహా సముద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 13: అంగారక గ్రహం గర్భంలో భారీ ఎత్తున నీటి నిల్వలతో ఓ మహా సముద్రం ఉన్నట్టు నాసా శాస్త్రవేత్తలు గుర్తించారు. అంగారకునిపై నీటి జాడలను శాస్త్రవేత్తలు ఇది వరకే కనిపెట్టారు. అయితే, ఘనీభవించిన స్థితిలో ఉన్నవాటిని గుర్తించారు. కానీ, ఇప్పుడు తొలిసారిగా నీటి నిల్వలు ద్రవ రూపంలో ఉన్నట్టు కనుగొన్నారు. నాసాకు చెందిన మార్స్ ఇన్‌సైట్ ల్యాండర్ 2018-22 మధ్యలో అంగారకుని గర్భం లోపల ఏర్పడిన 1319 ప్రకంపనలను గుర్తించి పంపిన సమాచారాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు నీటి నిల్వలు ఉన్నట్టు నిర్ధారించారు. అంగారకుని ఉపరితలం నుంచి దాదాపు 20 కిలోమీటర్ల లోతులో నీళ్లు ఉన్నట్టు పేర్కొన్నారు.

సెబీ చీఫ్, అదానీపై..

22న దేశవ్యాప్త ఉద్యమం

ఈడీ కార్యాలయాల ఘెరావ్.. షేర్‌మార్కెట్ స్కాంలో మోదీ పాత్ర: కాంగ్రెస్

- కులగణనపైనా విస్తృతంగా ప్రజల్లోకి
- పీసీసీ, ఏఐసీసీ నేతలతో ఖర్గే భేటీ
- అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అదానీతో వ్యాపార సంబంధాలు ఉన్నట్లు హిండెన్‌బర్గ్ ఆరోపించిన దరిమిలా.. సెబీ చీఫ్ మాధురి పురీ బుచ్ రాజీనామా చేయాలని.. అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) వేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఈ నెల 22వ తేదీన దేశవ్యాప్తంగా ప్రజాచైతన్య ఉద్యమం ధర్నాలు చేపట్టనుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారమిక్కడ ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, రాష్ట్రాల ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. అగ్ర నేత రాహుల్ గాంధీ సహా 56 మంది నేతలు హాజరయ్యారు. మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్, జమ్మూకశ్మీరు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఆ సందర్భంగా దేశవ్యాప్త ఉద్యమానికి నిర్ణయం తీసుకున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన నిర్వహించాలన్న అంశంపై కూడా ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఆర్థిక, సామాజిక రాజకీయ న్యాయానికి సంబంధించి రాజ్యాంగంలో పేర్కొన్న అధికరణలను గౌరవించాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. 'దేశంలో జరుగుతున్న అతి పెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణంపై విస్తృతంగా చర్చించాం. అదానీ, సెబీ సంబంధాలపై హిండెన్‌బర్గ్ నివేదికలో వెల్లడించిన అంశాలపై చర్చలు జరిపాం. ఫైనాన్షియల్ మార్కెట్‌ను నియంత్రించాల్సిన సెబీయే రాజీపడింది. ఈ కుంభకోణంలో ప్రధానమంత్రి పాత్ర పూర్తిగా ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఆగస్టు 22న దేశవ్యాప్తంగా ఉద్యమించడంలో భాగంగా రాష్ట్రాల్లో ఈడీ కార్యాలయాలను కాంగ్రెస్ కార్యకర్తలు ఘెరావ్ చేస్తారు. సెబీ చైర్‌పర్సన్‌ను తొలగించాలి. విశ్వసనీయత కోల్పోయిన వ్యక్తి ఆ పదవిలో ఉండడానికి వీల్లేదు. జేపీసీ ద్వారా ఈ మెగా కుంభకోణంపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం' అని వివరించారు. కులగణన, రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్ అంశాలపై ఉద్యమ కార్యాచరణను త్వరలో నిర్ణయిస్తామని.. జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు విస్తృత స్థాయిలో జనంలోకి వెళ్తామని అన్నారు. వయనాడ్ ఉత్పాతాన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలని సమావేశం డిమాండ్ చేసిందన్నారు. వయనాడ్ మృతులకు సంతాపం తెలిపిందని చెప్పారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, పూజాస్థలాలపై దాడులు జరగకుండా నిలిపివేసేందుకు మోదీ ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్, జమ్మూకశ్మీరుల్లో ఎన్నికల సన్నద్ధతపై చర్చించామని, అవసరమైన చోట్ల పొత్తులు పెట్టుకుంటామని వేణుగోపాల్ చెప్పారు.



పీసీసీ అధ్యక్షులతో సమావేశంలో ఖర్గే, రాహుల్

సెబీ చీఫ్ రాజీనామా కోరాలి: ఖర్గే

'సెబీకి, అదానీకి మధ్య సంబంధాలపై దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. వీటిపై లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. స్టాక్ మార్కెట్లో చిన్న మదుపరుల డబ్బును గందరగోళంలో పడేయకూడదు. మోదీ ప్రభుత్వం తక్షణమే సెబీ చైర్‌పర్సన్ రాజీనామాను కోరాలి. దీనిపై జేపీసీని ఏర్పాటుచేయాలి' అని ఖర్గే 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. నిరుద్యోగం, హద్దుల్లేని ద్రవ్యోల్బణంపై ప్రజల్లోకి వెళ్లాలని.. దేశమంతా ప్రచారం చేయాలని పార్టీ నేతలకు పిలుపిచ్చారు. మోదీ ప్రభుత్వ జమానాలో రాజ్యాంగంపై దాడి కొనసాగుతోందన్నారు. కులగణన అనేది ప్రజల డిమాండ్ అని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌పై పోరాటం కొనసాగుతుందన్నారు. సైన్యంలో 'అగ్నిపథ్' స్కీంను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతపై ధ్వజమెత్తారు. రైళ్లు రోజూ పట్టాలు తప్పడం రివాజైందన్నారు. వాతావరణ సంబంధ ప్రకృతి విపత్తులు, మౌలిక వసతుల ధ్వంసం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.

స్పామ్ కాల్స్‌కు

చెక్ పెట్టండి

- టెల్కోలకు ట్రాయ్ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: స్పామ్ కాల్స్‌కు వెంటనే చెక్ పెట్టాలని ట్రాయ్ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రమోషనల్, మార్కెటింగ్‌కు రిజిస్టర్ చేసుకోని సంస్థలు చేసే కాల్స్, కంప్యూటర్ జనరేటెడ్ కాల్స్‌ను వెంటనే నిలిపివేయాలని సూచించింది. తక్షణమే ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అన్‌రిజిస్టర్డ్ టెలీ మార్కెటర్ల నుంచి వస్తున్న కాల్స్‌పై ట్రాయ్‌కి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ట్రాయ్ ఆయా అన్ రిజిస్టర్డ్ టెలీమార్కెటర్ల డేటాను సమర్పించాలంటూ టెల్కోలకు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఈతరహా కాల్స్ చేస్తే రెండేళ్ల పాటు యాక్సెస్‌ను నిలిపివేస్తామని హెచ్చరించింది. ఆ సంస్థను రెండేళ్ల వరకు బ్లాక్ లిస్ట్‌లో పెడతామని పేర్కొంది.

డీఎన్డీతో పరిష్కారం

వినియోగదారులు తమకు వచ్చే స్పామ్ కాల్స్‌పై సాధారణంగా ఆయా టెలికాం ఆపరేటర్లు సూచించే నంబరుకు ఫిర్యాదు చేయడం తెలిసిందే.! అంతే కాదు.. 'డు నాట్ డిస్టర్బ్' సేవల కోసం ఏయే సంస్థలకు యాక్సెస్ ఇవ్వాలి? ఏయే సంస్థలను బ్లాక్ చేయాలి? అనేవి సామాన్యులు తెలుసుకోవడం కష్టమే. అన్ని సంస్థలను డీఎన్డీలో పెడితే.. బ్యాంకు నుంచి వచ్చే ఎస్ఎంఎస్‌లు కూడా నిలిచిపోతాయి. అయితే.. ట్రాయ్ అందుబాటులోకి తీసుకువచ్చిన 'డీఅండ్‌డీ' యాప్ ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. ఇందులో స్పామ్ కాల్స్‌పై ఫిర్యాదు చేయడం మొదలు.. డీఅండ్‌డీలో ఫీచర్ల వారీగా యాక్టివేట్, డీయాక్టివేట్ చేసుకునే వెసులుబాటు ఉంది. గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్, ట్రాయ్ వెబ్‌సైట్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



ఢాకేశ్వరి ఆలయంలో మహమ్మద్ యూనస్

హిందువులతో యూనుస్ భేటీ


ఢాకా, ఆగస్టు 13: షేక్‌హసీనా పదవీచ్యుతి నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో దాడులకు గురవుతున్న మైనారిటీ హిందువులతో ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ మంగళవారం సమావేశమయ్యారు. రాజధాని ఢాకాలోని ప్రఖ్యాత ఢాకేశ్వరి ఆలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దేశ పౌరులందరికీ సమానమైన హక్కులు ఉంటాయి. దయచేసి ప్రభుత్వంతో సహకరించండి. ఓపికతో ఉండండి' అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మనల్ని మనం మనుష్యులుగానే తప్ప ముస్లింలుగా, హిందువులుగా, బౌద్ధులుగా చూసుకోవద్దని పిలుపునిచ్చారు. వ్యవస్థల పతనం కారణంగానే అన్ని సమస్యలు తలెత్తుతుంటాయని, కాబట్టి, వ్యవస్థలను సరిచేయటమే ప్రస్తుత పరిష్కారమని యూనస్ తెలిపారు. ఈ సమావేశంలో మహానగర్ సార్వజనీన్ పూజా కమిటీ, బంగ్లాదేశ్ పూజా ఉద్జాపన్ పరిషత్, హిందూ-బుద్ధిస్ట్-క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గత రెండు వారాల్లో బంగ్లాదేశ్‌లోని 52 జిల్లాల్లో మైనారిటీలపై ముఖ్యంగా హిందువులపై 278 దాడి ఘటనలు జరిగాయి. ఇదిలా ఉండగా, షేక్‌హసీనాపై ఢాకాలో హత్య అభియోగం నమోదైంది. గత నెలలో పోలీసు కాల్పుల్లో ఓ వ్యక్తి చనిపోవడంపై అతని సంబంధీకులు షేక్ హసీనాతోపాటు మరో ఆరుగురిపై (వీరిలో ఇద్దరు మాజీ మంత్రులు, మాజీ పోలీసు అధిపతి) పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు, బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోలేదని అమెరికా స్పష్టం చేసింది. ఈ మేరకు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ విలేకర్లకు స్పష్టం చేశారు.

హత్యాచారం కేసు సీబీఐకి!

దస్త్రాలన్నింటినీ నేడు కేంద్ర సంస్థకు అప్పగించాలి

- కోల్‌కతా పోలీసులకు హైకోర్టు ఆదేశం
- 5 రోజులైనా కేసులో పురోగతి లేదని ధ్వజం

కోల్‌కతా, ఆగస్టు 13: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలి హత్యాచార కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలి(31)పై అత్యాచారం చేసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో కలకత్తా హైకోర్టు మంగళవారం.. కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని కోల్‌కతా పోలీసులను ఆదేశించింది. కేసుకు సంబంధించిన అన్ని దస్త్రాలను బుధవారం ఉదయం 10 గంటల్లోపు సీబీఐకి అందజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. సెమినార్ హాల్‌లో జూనియర్ వైద్యురాలిపై అత్యంత పాశవిక దాడి జరుగుతుంటే ఆస్పత్రిలో ఉన్నవారికి తెలియకపోవడం, యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. అసహజ మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ప్రభుత్వ న్యాయవాది తెలపగా.. వైద్యురాలిని దారుణంగా హతమార్చితే వెంటనే హత్య కేసుగా ఎందుకు నమోదు చేయలేదని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. వైద్యురాలి మృతదేహం ఏమీ రోడ్డు పక్కన దొరకలేదని, ఆస్పత్రి సూపరింటెండెంట్ లేదా వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎందుకు ఫిర్యాదు చేయలేదని నిలదీశారు. ఈ కేసు దర్యాప్తు కోర్టు పర్యవేక్షణలో జరిగేలా చూడాలని కోరుతూ మృతురాలి తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. అలాగే కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటన్నింటినీ విచారించిన హైకోర్టు ధర్మాసనం.. పోలీసుల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కోల్‌కతా పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు జరుపుతున్నారని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా.. ఘటన జరిగి ఐదు రోజులైనా కోల్‌కతా పోలీసుల దర్యాప్తులో గుర్తించదగిన పురోగతి కనిపించలేదని వ్యాఖ్యానించింది. వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్‌పై కోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించి, దీర్ఘకాలిక సెలవుపై పంపాల్సిందిగా ఆదేశించింది. దేశవ్యాప్తంగా డాక్టర్లు చేపడుతున్న నిరసనలపై స్పందిస్తూ.. ప్రజల ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత వైద్యులపై ఉన్నందున, ఆందోళనలను విరమించాలని సూచించింది. కాగా, జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు విధులు బహిష్కరించారు. తక్షణమే తగిన న్యాయం చేయాలని, హంతకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలనూ నిలిపివేశారు. దీంతో ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడింది.



వారాణసీలో ఓ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం రోగుల ఎదురుచూపు

వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు

కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) దేశంలోని వైద్య కళాశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది. వైద్య విద్యార్థులు.. ముఖ్యంగా విద్యార్థినులు క్యాజువాలిటీ, ఓపీ విభాగాలు, తమ క్వార్టర్స్(హాస్టల్స్)కు వెళ్లే మార్గాల్లో భద్రత కల్పించాలని సూచించింది. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో లైటింగ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. "సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి, అక్కడ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలి. భద్రత కోసంమహిళా సిబ్బందిని కూడా నియమించాలి" అని కోరింది. మరోవైపు, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో ఐఎంఏ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఐఎంఏ చీఫ్ డాక్టర్ ఆర్వీ అశోకన్ మాట్లాడుతూ.. వైద్య కళాశాలల్లో హింసకు వ్యతిరేకంగా కేంద్ర చట్టం, ఎన్ఎంసీ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు.

ప్రత్యేక చట్టాల కేసుల్లోనూ బెయిల్

- అసాధారణ పరిస్థితుల్లోనే జైలుకు పంపాలి: సుప్రీం



న్యూఢిల్లీ, ఆగస్టు 13: 'బెయిల్ ఇవ్వడమనేది ఓ నిబంధన..జైలుకు పంపడమనేది ఓ అసాధారణ సందర్భం..ప్రత్యేక చట్టాలకూ ఇది వర్తిస్తుంది' అని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద అరెస్టయిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిష్ ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. "అర్హత ఉన్న కేసుల్లోనూ కోర్టులు బెయిల్ నిరాకరిస్తూ పోతే రాజ్యాంగం గ్యారెంటీ ఉన్న ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతుంది. ప్రాసిక్యూషన్ చేసిన ఆరోపణలు ఎంత తీవ్రమైనవైనా కావొచ్చు..బెయిల్‌పై చట్టం ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సిన విధి కోర్టులది.." అని స్పష్టం చేసింది. 'ఉపా' చట్టం ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న బిహార్‌కు చెందిన జలాలుద్దీన్ ఖాన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. తన ఇంటి పైఅంతస్తును నిషేధిత పీఎఫ్ఐ సంస్థకు చెందిన సభ్యులకు అద్దెకు ఇచ్చారంటూ ఎన్ఐఏ జలాలుద్దీన్‌పై కేసు పెట్టింది. 2022 జులైలో ప్రధాని మోదీ జరిపే పర్యటనలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ సమాచారం అందుకున్న బిహార్ పోలీసులు జలాలుద్దీన్ ఇంట్లో సోదాలు జరిపారు. అనంతరం ఎన్ఐఏ కేసు దర్యాప్తును చేపట్టింది. ఇలాంటి కేసుల్లోనూ నిందితులకు బెయిల్ ఇవ్వవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

బాబా రాందేవ్‌పై కోర్టు ధిక్కరణ కేసు మూసివేత

న్యూఢిల్లీ, ఆగస్టు 13: యోగా గురు బాబా రాందేవ్, ఆయన సహాయకుడు, పతంజలి ఆయుర్వేద సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణ, పతంజలి సంస్థపై దాఖలయిన కోర్టు ధిక్కరణ కేసును మూసివేస్తున్నట్టు మంగళవారం సుప్రీంకోర్టు ప్రకటించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చారన్న కేసులో వారు సమర్పించిన క్షమాపణలను ఆమోదించినట్టు తెలిపింది. వారిచ్చిన లిఖితపూర్వక హామీలను పరిగణనలోకి తీసుకొని కేసును క్లోజ్ చేసిందని వారి తరఫు న్యాయవాది గౌతమ్ తాలూక్‌దార్ చెప్పారు. ఈ కేసులో ధర్మాసనం మే 14న తీర్పును వాయిదా వేసింది. తాజాగా నిర్ణయాన్ని వెల్లడించింది. ఆధునిక వైద్యానికి, కరోనా వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారంటూ బాబా రాందేవ్‌పై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ జరుగుతున్న క్రమంలోనే ఔషధాల సామర్థ్యంపై తప్పుడు ప్రకటనలు ఇవ్వబోమంటూ పతంజలి సంస్థ 2023 నవంబరు 21న కోర్టుకు లిఖితపూర్వకంగా అఫిడవిట్ సమర్పించింది. దీన్ని ఉల్లంఘించి మళ్లీ ప్రకటనలు ఇచ్చారంటూ ఫిర్యాదు అందడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 24న సుప్రీంకోర్టు.. పతంజలి సంస్థకు నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే రాందేవ్, బాలకృష్ణలతో పాటు పతంజలి సంస్థ అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పింది.

150 కోట్ల ఇండియా!

న్యూఢిల్లీ, ఆగస్టు 13: వంద కోట్ల భారత్ కాదు. ఇప్పుడిక 150 కోట్ల ఇండియా. ఇలా పిలుచుకోవాల్సిందే. అయితే, ఇందుకోసం మరో పుష్కర కాలం ఆగితే చాలు. అప్పటికి మన దేశ జనాభా 150 కోట్లు దాటేయనుంది. అలాగే మహిళా సంఖ్య కూడా స్వల్పంగా పెరగనుంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2036 నాటికి భారత దేశ జనాభా 152.2 కోట్లకు చేరనుంది. అలాగే, మహిళల సంఖ్య కూడా 48.5 శాతం (2011) నుంచి 48.8 శాతానికి పెరగనుంది. భారత్‌లో మహిళలు, పురుషులు-2023 పేరిట విడుదల చేసిన ఈ నివేదికలో 2011-2036 మధ్య కాలంలో 15 ఏళ్లలోపు వ్యక్తుల సంఖ్య బాగా తగ్గిపోనుంది. అదే సమయంలో 60 ఏళ్లు ఆపై వయసు గల వారి సంఖ్య పెరుగనుంది. ఇక మహిళలు-పురుషుల నిష్పత్తిలో కూడా 2011 లెక్కల ప్రకారం ప్రతి వెయ్యిమంది పురుషులకు 943 మంది స్త్రీలు ఉంటే 2036 నాటికి అది 952కు చేరనుంది.

విమానాశ్రయం కిటకిట..!



జనం రద్దీతో కిటకిటలాడుతున్న ఇది ఏ బస్ స్టేషనో, రైల్వే స్టేషనో కాదు.. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం. ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తున్న విద్యార్థులు వారిని సాగనంపేందుకు వచ్చే వారి తల్లిదండ్రులు, బంధువులతో మంగళవారం ఇలా రద్దీగా మారింది. దీంతో ఎయిర్‌పోర్టు నుంచి ప్రధాన రహదారి వరకూ ట్రాఫిక్ జామ్ అయింది.

\- శంషాబాద్ రూరల్, ఆంధ్రజ్యోతి

ఏడాదిలో 300 రోబోటిక్ సర్జరీలు



» అరుదైన ఘనత సాధించిన నిమ్స్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఒక్క ఏడాదిలోనే 300 రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స(ఆర్ఏఎస్)లను పూర్తిచేసి నిమ్స్ అరుదైన ఘనతను సాధించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయిని చేరుకున్న ఆస్పత్రిగా నిలిచింది. యూరాలజీ, గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ సర్జరీ, సర్జికల్ అంకాలజీ విభాగాలలో అనేక క్లిష్టమైన శస్త్ర చికిత్సల్ని ఆర్ఏఎస్ ద్వారా చేశారు. ఈ సాంకేతికత కారణంగా ఆస్పత్రిలో రోగి గడిపే సమయం గణనీయంగా తగ్గిందని, డాక్టర్లు ప్రతిరోజూ ఎక్కువ కేసులకు హాజరుకాగలుగుతున్నారని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఈ అధునాతన చికిత్సా విధానాలను అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహాయ సహకారాలున్నాయన్నారు. కాగా, ప్రోస్టేట్ క్యాన్సర్ సర్జరీలు, పాక్షిక నెఫ్రెక్టమీ, రాడికల్ నెఫ్రెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, పైలోప్లాస్టీ, యూరిటెరల్ రీఇంప్లాంటేషన్, రాడికల్ కోలిసిస్టెక్టమీ, లార్జ్ డిఫెక్ట్ వెంట్రల్ హెర్నియా, తదితర సర్జరీలు ఆర్ఏఎస్ ద్వారా చేపట్టారు.



జాతీయ రహదారిపై భోజనాలు చేస్తున్న దిలావర్‌పూర్ గ్రామస్థులు

ఇథనాల్ పరిశ్రమ వద్దే వద్దు

» నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ గ్రామస్థుల ఆందోళన

దిలావర్‌పూర్, ఆగస్టు 13: గ్రామ శివారులో చేపట్టిన ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌వాసులు ఆందోళన చేపట్టారు. మంగళవారం దిలావర్‌పూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. షాపులు, హోటళ్లు, వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు బంద్ పాటించారు. ఈ సందర్భంగా 61వ నెంబరు జాతీయ రహదారిపై గ్రామస్థులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు పైనే భోజనం చేశారు. అనంతరం పలువురు దిలావర్‌పూర్ గ్రామస్థులు మాట్లాడుతూ, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఇథనాల్ పరిశ్రమ నిర్మిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

గుప్త నిధుల కోసం తవ్వుతుండగా రాయిపడి ఒకరి మృతి

» రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం

» పాలమూరు జిల్లాలో ఘటన.. 8 మంది అరెస్టు

కొడంగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం కొందరు తవ్వకాలు జరుపుతుండగా పై నుంచి పెద్ద రాయి పడటంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. దీన్ని మిగతావారంతా కలిసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి దొరికిపోయారు. మహబూబ్‌నగర్ జిల్లా సల్కర్‌పేట గుట్టల్లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీధర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ యాదాద్రి భువనగిరి ప్రాంతాల్లో ఐదేళ్ల క్రితం గుప్త నిధుల తవ్వకాలు ప్రారంభించాడు. భువనగిరి, నల్లగొండ తవ్వకాలు జరిపినా నిధులు దొరక్కపోవడంతో ఏడాదిన్నర క్రితం మహబూబ్‌నగర్ జిల్లా సల్కర్‌పేట గుట్టల్లో గుప్త నిధుల కోసం ఓ 8మంది సహకారంతో ఏడాదిన్నరగా తవ్వకాలు జరుపుతున్నాడు. పనులు కొనసాగుతుండగా ప్రమాదవశాత్తు పై నుంచి రాయి తవ్వకాలకు సహకరిస్తున్నవారిలో సత్యయ్య అనే వ్యక్తిపై పడటంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై నుంచి పడి చనిపోయినట్లుగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని, బైక్‌ను బొంరాస్‌పేట్ మండలం నాందర్‌పూర్ శివారులో కల్వర్టు దగ్గర పడేశారు. సత్యప్ప కుమారుడు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన పోలీసులు, మృతి వెనుక మిస్టరీని ఛేదించారు. గుప్తనిధుల తవ్వకాలకు పాల్పడిన సత్యనారాయణ, సైదులు, వెంకటేశ్, షకీల్, శర్మ, శంకరయ్య, సుందరరత్నం, నాగరాజును అరెస్టు చేశారు.

హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలపాలి

» ముక్కలైన నగరం అస్తిత్వాన్ని కోల్పోతుంది

» వరంగల్ నగర ఏకీకరణపై చర్చలో వక్తలు

కాజీపేట, ఆగస్టు 13 : ముక్కలైన వరంగల్ నగరం అస్తిత్వాన్ని కోల్పోతుందని వరంగల్ మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు అన్నారు. హనుమకొండ, వరంగల్ కేంద్రంగా వరంగల్ జిల్లాగా ఉంటేనే పూర్తి స్థాయి అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమానగర్ బాలవికాసలో మంగళవారం 'వరంగల్ మహానగర ఏకీకరణ- పునర్నిర్మాణం' అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు మాట్లాడారు. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన ఎనుమాముల మార్కెట్, అజంజాహీ మిల్లు, ఎయిర్‌పోర్టుతో 1,200 ఏళ్ల చరిత్ర కలిగిన వరంగల్‌ను విడదీయడం బాధాకరమన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడం న్యాయమైన డిమాండ్ అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకే ఉమ్మడి జిల్లాలను ఇష్టానుసారంగా విభజించారని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మండిపడ్డారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడమే తమ ధ్యేయమని చర్చ నిర్వాహకుడు పింగళి సంపత్ రెడ్డి అన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తామని వక్తలు తెలిపారు.

వడ్డీ వ్యాపారి వేధింపులు.. మహిళ ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 13: వడ్డీ వ్యాపారి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. కామారెడ్డికి చెందిన లక్ష్మీబాయి (40) భవన నిర్మాణాలను చేపట్టి వాటిని విక్రయించే వ్యాపారం చేస్తోంది. తన వ్యాపారం నిమిత్తం కామారెడ్డికి చెందిన విశ్వనాథం అనే వ్యాపారి వద్ద ఇటీవల రూ. 32లక్షలు అప్పుగా తీసుకుంది. తీసుకున్న అప్పు కింద లక్ష్మీబాయి ఇంటితో పాటు మరో రెండు ప్లాట్లను విశ్వనాథం హామీ కింద రాయించుకున్నాడు. తీసుకున్న డబ్బును వడ్డీతో సహా చెల్లించనప్పటికీ విశ్వనాథం తన ఇంటితో పాటు ప్లాట్లను తిరిగి ఇవ్వడానికి మరో రూ. 56లక్షలు డిమాండ్ చేస్తున్నాడని, ప్రశ్నిస్తే రౌడీలను పెట్టి దాడులు చేయిస్తున్నాడని పేర్కొంటూ ఒక సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు లక్ష్మీబాయిని కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కర్ణాటక సీఎంపై గవర్నర్‌కు మరో ఫిర్యాదు

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో(ముడా) ఇంటి స్థలాల వివాదం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను వెంటాడుతోంది. దీనిపై మైసూరుకు చెందిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ పోస్టు ద్వారా పంపిన ఫిర్యాదును రాజ్‌భవన్ మంగళవారం స్వీకరించింది. ఈమేరకు తనకు సమాచారం వచ్చిందని స్నేహమయి కృష్ణ తెలిపారు. మైసూరు నగరాభివృద్ధి శాఖ ఫస్ట్‌గ్రేడ్ ఉద్యోగి కేసీ ఉమేశ్ ద్వారా సీఎం సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట రికార్డులు నమోదు చేయించుకున్నారని ఆయన ఆరోపించారు.

గనుల వేలంపై వీడని చిక్కుముడి

రాష్ట్రం ప్రతిపాదించిన బ్లాకులకు వేలం అనుమతి కోసం నిరీక్షణ

» స్పష్టతనివ్వని కేంద్రం.. సూర్యాపేటలోని 3 బ్లాకుల వేలానికి ఓకే

» రాష్ట్ర నిర్ణయంపై సందిగ్ధత.. మరో 9 బ్లాకుల వేలం ప్రతిపాదనలెప్పుడు?

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మేజర్ మినరల్స్‌కు సంబంధించిన గనుల వేలంపై పీటముడి పడింది. కొన్ని గనుల వేలానికి కేంద్రం అనుమతించినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆరేళ్లుగా ఎలాంటి స్పందనా లేదు. ఏదైనా మేజర్ మినరల్‌కి సంబంధించిన గనుల వేలం ప్రక్రియ చేపట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గనుల శాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంది. ఎంఎండీఆర్ (గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ) చట్టం-1957ను 2023లో సవరణ చేశారు. ఈ చట్టంలోని సెక్షన్ 10బి(2) ప్రకారం కేంద్రం నుంచి రాష్ట్రం అనుమతి పొందాల్సి ఉంది. ఈ చట్టం ద్వారా మైనింగ్ రంగంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. మైనింగ్‌కు సంబంధించి కార్యకలాపాలలో చట్టబద్ధత పారదర్శకత తీసుకొచ్చేలా సవరణలు చేశారు. మైనింగ్ ఖనిజాల వెలికితీత, వాణిజ్య కార్యకలాపాలు కేంద్రం అధీనంలో చేపట్టే వెసులుబాటు ఉంది. ఖనిజాల అన్వేషణ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం పోటీ బిడ్డింగ్ ద్వారా మంజూరు చేస్తుంది. ఖనిజాన్వేషణ అనుమతుల కోసం, వేలం విధానం, అందుకు సంబంధించిన నిబంధనలు, షరతులు, బిడ్డింగ్ పారామీటర్లు వంటి వివరాలను ఈ చట్టంలో చేసిన సవరణల ద్వారా కేంద్రం నిర్ణయిస్తుంది. ఏదైనా ఖనిజం వేలం వేయాలని నిర్ణయించినప్పుడు ఆరు నెలలలోపు రాష్ట్ర ప్రభుత్వం వేలం నిర్వహించాలనే నిబంధన సవరణ చేసిన చట్టంలో పొందుపరిచారు.

ఎందుకీ చిక్కు ముడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయలేమితో కొన్ని గనుల వేలానికి సంబంధించి ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇటీవల ఢిల్లీలో గనులు, ఖనిజాల రంగంలోని పరిశ్రమల నిర్వాహకులతో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. ఎంజీఎంఐ నిర్వహించిన జాతీయ సదస్సులో గనులు, ఖనిజాల రంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆయన చర్చించారు. ఈ రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి, దానిని పారదర్శకంగా, పోటీదాయకంగా మారుస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్రం, తెలంగాణ రాష్ట్రం మధ్య గనుల వేలంపాట విషయంలో నెలకున్న చిక్కుముడి వీడటం లేదు. ఇప్పటికే మూడు గనుల వేలానికి సంబంధించి 2018 నుంచి ఈ వ్యవహారంపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకుంది. ఈ ఏడాది జూన్ 30తో గనుల వేలానికి కేంద్రం ఇచ్చిన గడువు ముగిసింది. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం రెండు వైపులా దీనిపై ఎలాంటి వైఖరిని వెల్లడించడం లేదు.



మరో 9 గనుల విషయంలోనూ అదే జాప్యం

సూర్యాపేట జిల్లాలో 8 బ్లాకులు, నల్లగొండ జిల్లా పరిధిలో ఒక బ్లాకులో లైమ్‌స్టోన్ ఉన్నట్లు గుర్తించారు. దీనిపై అధికారులు 2024 ఫిబ్రవరి 3న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సవరణ చేసిన గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టంలోని సెక్షన్ 10బి(2) కింద కేంద్ర గనుల శాఖ నుంచి వేలానికి సంబంధించిన అనుమతులు పొందాలని కోరారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఫిబ్రవరి నుంచి ఏడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయి. అనుమతులు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లలేదు. ఈ అంశంపై రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఈ 9 బ్లాకుల వేలానికి అనుమతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉందన్నారు. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

వేలం కోసం నిరీక్షణ

రాష్ట్రంలో మేజర్ మినరల్స్ వేలానికి సంబంధించి సూర్యాపేట జిల్లాలోని పశువుల బోడు, సైదులనామ, సుల్తానాపూర్ బ్లాకుల కాంపోజిట్ వేలంపై రాష్ట్ర ప్రభుత్వం 2018లో కేంద్ర గనుల శాఖకు లేఖ రాసింది. 2021లో కేంద్రం వేలంపాటకు అనుమతి ఇచ్చింది. 2022 అక్టోబరు 10న, 24-1-2024న మరోసారి రాష్ట్ర మైనింగ్ శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి వేలం పాటకు అనుమతించాలంటూ ప్రతిపాదనలు పంపారు. కేంద్రం ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ దీనిపై ప్రభుత్వ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర గనుల శాఖ అధికారులు ప్రభుత్వ ఆదేశాల కోసం వేచిచూస్తున్నారు. ఎందుకు జాప్యం జరుగుతుందనే విషయంపై గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశామని.. తుది నిర్ణయం కోసం వేచి ఉన్నామని చెప్పారు. గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం ప్రకారం కేంద్రం వేలం పాటు పాడే అధికారం ఉందన్నారు.



ప్రయాణికుడి ప్రాణం కాపాడిన ఆర్టీసీ డ్రైవర్‌కు అభినందన


హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణంలో ఫిట్స్‌కు గురైన ఓ ప్రయాణికుడిని ఆస్పత్రికి తరలించి అతని ప్రాణాన్ని కాపాడిన ఆర్టీసీ డ్రైవర్‌ను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ అభినందించారు. వరంగల్-2 డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు సోమవారం హైదరాబాద్ నుంచి హన్మకొండకు వెళుతుండగా ఘటకేసర్ దాటిన తర్వాత సంతోష్ అనే ప్రయాణికునికి ఫిట్స్ వచ్చాయి. దీంతో తోటి ప్రయాణికులంతా కంగారు పడగా డ్రైవర్ బి.వెంకన్న బస్సును బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. డ్రైవర్ వెంకన్న తీసుకున్న ఈ చొరవ వల్ల సంతోష్‌కు సకాలంలో వైద్య సాయం అందింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్.. డ్రైవర్ వెంకన్నను మంగళవారం బస్‌భవన్‌కు పిలిపించి సత్కరించారు.

40 శాతం మందికి రుణాలు మాఫీ కాలేదు!

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 13: రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ కాలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఊళ్లలో 40 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని చెప్పారు. మంగళవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 64 లక్షల మంది రైతులు రుణాలు తీసుకోగా.. వారిలో 49 లక్షల మందే రుణమాఫీకి అర్హులని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీని ఒకేసారి చేస్తానని చెప్పి ఇప్పటికీ చేయలేదని ఆరోపించారు. రెండు విడతల్లో సుమారు 18 లక్షల మంది రైతులకు రూ.12 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. మూడో విడతలో ఇంకో 4 లక్షల మందికి మరో 3-4 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేస్తారని, అందరికీ చేయరని చెప్పారు. సోనియా గాంధీ జన్మదినం డిసెంబరు 9లోపు రుణాలకే వడ్డీ చెల్లిస్తామని, తదుపరి కాలానికి రైతులే చెల్లించాలనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రైతుల సమస్యపై బీజేపీ ఆధ్వర్యంలో గ్రామాల్లో రచ్చబండ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని ఈటల చెప్పారు. సమస్యలన్నీ తెలుసుకున్నాక రైతు ఉద్యమాన్ని లేవనెత్తి ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు.

ఇన్‌స్టా ప్రేమ.. యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడి బలవన్మరణం



శ్రీహరి (ఫైల్)

దుండిగల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతిని ప్రేమ పేరిట వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమయ్యాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన శ్రీహరి(21) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దోమడుగుకు చెందిన తేజస్విని(20) అనే బీఫార్మసీ విద్యార్థినికి శ్రీహరి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ప్రేమ, పెళ్లి పేరిట తేజస్వినిని వేధించాడు. ఈ వేధింపులు తాళలేక తేజస్విని ఈ నెల 8న తమ ఇంటి మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలిసి భయపడిన శ్రీహరి మరుసటి రోజు ఆగస్టు 9న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు శ్రీహరిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రాణాపాయం తప్పడంతో వైద్యులు శ్రీహరిని ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు మార్చారు. అయితే మంచినీళ్లు తాగి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి సోమవారం అర్ధరాత్రి ఆస్పత్రి జనరల్ వార్డు నుంచి వెళ్లిన శ్రీహరి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని బహదూర్‌పల్లిలోని ఓ సొసైటీలోని చెట్టుకు గుర్తు తెలియని యువకుడు ఉరివేసుకున్నాడని మంగళవారం ఉదయం పోలీసులకు అందింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్య చేసుకున్నది శ్రీహరి అని గుర్తించారు.

సీఎం రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదు

» నోరుజారిన ఎంపీ బలరాంనాయక్



మహబూబాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మరోసారి నోరుజారారు. సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పారు కానీ ఇంతవరకు చేయలేదంటూ మాట్లాడి వార్తల్లో నిలిచారు. రూ.2లక్షల రైతు రుణమాఫీని విడతల వారీగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తుది విడత కార్యక్రమాన్ని ఆగస్టు 15న నిర్వహించనుంది. అయితే, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన రుణమాఫీ అంశాన్ని ప్రస్తావించారు. దీంతో బలరాంనాయక్ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడటం ఏంటని అక్కడున్న వారంతా అయోమయానికి గురయ్యారు. సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న బలరాంనాయక్ టీపీసీసీ చీఫ్ రేసులోనూ ఉన్నారు. దీంతో ఆయన వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే, రూ.2 లక్షల రైతు రుణమాఫీని నాడు బీఆర్ఎస్ వాళ్లు చేయలేకపోయారని, నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేయబోతున్నారని చెప్పడంలో ఎంపీ బలరాం నాయక్ తడబడ్డారని కాంగ్రెస్ నేతలు సమర్థిస్తున్నారు. కాగా, బలరాంనాయక్ గతంలో కూడా ప్రసంగాల్లో నోరుజారిన ఘటనలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే తెలంగాణను ఆంధ్రలో కలుపుతామంటూ ఓసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బలరాం నాయక్ వెంటనే సర్దుకున్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేద్దాం

» గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకోసం అర్హులైన.. పేదల జాబితాను కేంద్రానికి పంపండి

» సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు అవసరం ఉన్న పేద కుటుంబాల జాబితాను వీలైనంత త్వరగా తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. ఈమేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ సొంతింటిని నిర్మించాలనే సంకల్పంతో 2016లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా సొంతిల్లు లేని కుటుంబాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 2024 మార్చి నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. మొదటి విడత గడువు ముగిసినా.. ఈ పథకాన్ని కొనసాగిస్తూ రెండో విడతలో భాగంగా 2024 నుంచి 2029 మధ్యకాలంలో మరో 2కోట్ల ఇళ్లు ఇవ్వాలని ఈ నెల 9న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామని పేర్కొన్నారు. 2018లో ఇల్లు అవసరం ఉన్నవారి కోసం కేంద్ర ప్రభుత్వ చేపట్టిన సర్వేలో పలు రాష్ట్రాలుపాల్గొని జాబితాలు అందజేశాయని, అందులో ఇళ్లు మంజూరు కానివారితోపాటు 2011లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కులగణన జాబితాలో.. ఇంతవరకు ఇళ్లు మంజూరు కానివారికి తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ రెండు జాబితాలు పూర్తయిన అనంతరం.. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు అవసరం ఉన్నవారికోసం ప్రత్యేకంగా సర్వే నిర్వహించి వారికి కూడా ఇళ్లను మంజూరు చేస్తామని వివరించారు. దేశంలోని అనేక రాష్ట్రాలు తమకు ఇళ్లు కావాలని కేంద్ర ప్రభుత్వానికి జాబితాను అందించాయని కిషన్‌రెడ్డి తెలిపారు. కానీ, తెలంగాణలో సొంతింటి అవసరం ఉన్న పేద కుటుంబాలు లక్షలాదిగా ఉన్నప్పటికీ.. 2018 సర్వేలో గత ప్రభుత్వం భాగం కాలేదని పేర్కొన్నారు. దాంతో ఇళ్ల కోసం ఎటువంటి జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపలేదన్నారు. "2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేద ప్రజలకు ఆశ చూపించి మభ్యపెట్టింది తప్ప.. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేదని అన్నారు. తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సాయం అందకుండా అన్యాయం చేసింది" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన ప్రతిపాదనలు వస్తే ఇళ్లను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని వారు చెప్పినట్లు వెల్లడించారు.

ఇయ్యాల ఉంటావు.. రేపు పోతావు

» నేను ఇక్కడే ఉంటా...

» వంద కేసులు పెట్టినా భయపడను

» హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై ఎమ్మెల్యే దానం మండిపాటు



హైదరాబాద్ సిటీ/హిమాయత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) 'ఇయ్యాల అధికారిగా ఉంటావు. రేపు వెళ్తావు. మేము ఇక్కడే పుట్టి పెరిగినవాళ్లం. ఇక్కడే ఉంటాం. రిటైర్‌గానే మీ ఊరికి వెళ్తావు. వంద కేసులు పెట్టినా నేను భయపడను. ప్రజల దగ్గరకు పోతాను. అధికారులపై ప్రివిలేజ్ మోషన్ (హక్కుల ఉల్లంఘన) నోటీసు ఇస్తా. నా నియోజకవర్గంలోకి పోవద్దని చెప్పడానికి వారికేం అధికారమున్నది. హద్దు మీరి ప్రవర్తిస్తే వాళ్లకు మంచిది కాదు.. మాకూ మంచిది కాదు' అంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నందగిరిహిల్స్‌లోని జీహెచ్ఎంసీ స్థలంలో ప్రహరీ కూల్చివేత ఘటనలో ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కేసు నమోదైంది. మంగళవారం హిమాయత్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన దానం నాగేందర్ ఈ కేసుపై స్పందించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై మండిపడ్డారు. ప్రహరీ కూల్చివేత ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయానికి రిపోర్టు పంపించానని తెలిపారు. ఏవీ రంగనాథ్ కాదు కదా.. తనవెవ్వరూ ఏం చేయలేరని వ్యాఖ్యానించారు. నాలాల ఆక్రమణ, ప్రభుత్వ స్థలాలు, పార్కుల కబ్జాలు చేస్తే చర్యలు తీసుకోవాలి కానీ.. ఎస్టీలు, పేదలు ఉండే బస్తీల్లో గుడిసెలు తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది కాకుండా ప్రైవేటు వాళ్ల దగ్గరుండి పార్కు ప్రహరీ కట్టిస్తున్నారని, దీని వెనక ఎవరున్నారో తేలాలన్నారు. గతంలో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడినప్పుడు 190 కేసులుండేనని,తనపై ఇంకో పది కేసులు పెట్టుకున్న భయపడనని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త ఆరంభం!

అనేక వారాలపాటు తీవ్ర హింస, రక్తపాతాన్ని చవిచూసిన బంగ్లాదేశ్ చల్లబడుతోంది. నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా గతవారం ప్రమాణం చేశారు. ప్రధాన మంత్రితో సమానమైన ఈ హోదాలో అయన ఉంటూ, మరో పదహారు మందితో కూడిన సలహామండలి పాలనలో ఆయనకు సహకరిస్తూండటంతో దేశం తిరిగి గాడినపడటం మొదలైంది. కోటా వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన నాహిద్ ఇస్లాం, ఆసిఫ్ మహ్మాద్‌తో పాటు మహిళా హక్కుల కార్యకర్త ఫరీద్ అక్తర్‌లతో పాటు, ఆర్థికవేత్తలు, పౌర సమాజ ప్రతినిధులు, ఒక సైనిక కమాండర్ ఇత్యాదులు ఇందులో ఉన్నారు. దాదాపు అన్నిరంగాలనుంచి ప్రాతినిధ్యం ఉన్నట్టు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సినీ, కళారంగాలకు చెందినవారు లేరని కొందరు నటీమణులు గుర్తుచేశారు. వ్యవస్థలన్నీ కుప్పకూలిన స్థితిలో ఈ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు ఒక కొత్త ఆరంభానికి పునాది.

రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా తాత్కాలిక ప్రభుత్వం నడుచుకుంటుందని యూనస్ హామీ ఇస్తున్నారు. దీర్ఘకాలం రగిలిన తన దేశం ఇంకా చల్లారలేదనీ, పలు అవాంఛనీయఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయనకు తెలియకపోదు. షేక్ హసీనా మీద ఉన్న ఆగ్రహం ఎవరిమీదకు అనవసరంగా మళ్ళుతున్నదో కూడా ఆయనకు అవగాహన ఉన్నది. ప్రధానంగా మైనారిటీల రక్షణకు సంబంధించి ఆయన పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ పరిస్థితులు పూర్తిగా నియంత్రణలోకి రాలేదు. రాజధాని ఢాకాలో హిందువులు పెద్ద సంఖ్యలో రోడ్ల మీదకు వచ్చి తమపైనా, దేవాలయాలపైనా జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ ఘటనలు తాత్కాలిక ఆగ్రహావేశాల్లో భాగమే తప్ప, నిర్దిష్టమైన వ్యూహాలు, కరడుగట్టిన వ్యతిరేకతలు లేవని అక్కడి నాయకులు అంటున్నారు. షేక్ హసీనాకు భారతదేశంతో ఉన్న దశాబ్దాల అనుబంధం, ఆఖరు ఘట్టంలోనూ భారత్ ఆమెకు అండగా నిలవడం ఇత్యాదివి కొందరికి ఏ మాత్రం గిట్టని విషయం మనకు తెలిసిందే. హిందువులకు భద్రత కల్పించండి అంటూ మహ్మద్ యూనస్‌కు భారత ప్రధాని నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారు. ఆ చెదురుమదురు ఘటనలు ఇక జరగవని అక్కడి నాయకులు హామీ ఇస్తున్నారు. హిందువులపై దాడుల్లో మతం కోణం లేదని, రాజకీయకోణం మాత్రమే ఉన్నది బీఎన్పీ నాయకుల వాదన.

న్యాయవ్యవస్థ, పోలీసు, మీడియా సైతం ఉద్యమకారుల ఆగ్రహాన్ని చవిచూడాల్సివచ్చింది. ఆయా వ్యవస్థలు, వ్యక్తుల అండదండలతోనే షేక్ హసీనా పదిహేనేళ్ళపాటు దేశాన్ని నిరవధికంగా, నిరంకుశంగా ఏలగలిగారనీ, ఆమె అదుపాజ్ఞల్లోకి పోయిన వ్యవస్థలను కూల్చడం, పునర్నిర్మించుకోడం దేశ భవిష్యత్తుకు అవసరమని వారు నమ్మారు. బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ ఒబైదుల్ హసన్, మరో ఐదుగురు న్యాయమూర్తులు మారుమాట్లాడకుండా రాజీనామాలు చేసిన దృశ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. హసీనా ప్రతీ తప్పునూ వెనకేసుకొస్తూ వీరంతా ఆమెకు రక్షణగా నిలిచారని విద్యార్థి ఉద్యమకారుల ఆగ్రహం. హసీనామీద కోపాన్ని వారు ఎక్కడెక్కడో ప్రదర్శిస్తున్నారు కానీ, పరిస్థితులు వేగంగా ఉపశమించకపోతే వారు ఎంతో ప్రేమగా ప్రతిష్ఠించుకున్న తాత్కాలిక ప్రభుత్వానికి అప్రదిష్ట తప్పదు.

ప్రజాభీష్టాన్ని నిర్ణయించేవి ఎన్నికలే. అవి స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరిగినప్పుడు మిగతా ప్రపంచం ఈ పరిణామాలన్నింటినీ నమ్ముతుంది. షేక్ హసీనా ఏలుబడిలో ఒక్క ఎన్నికకూడా సవ్యంగా సక్రమంగా జరగలేదని విమర్శలు ఉన్నందున తాత్కాలిక ప్రభుత్వం ఆధ్వర్యంలో మార్పు స్పష్టంగా కనిపించాలి. పార్లమెంట్ రద్దయిన మూడునెలల్లోగా ఎన్నికలు జరగాలని బంగ్లాదేశ్ రాజ్యాంగం నిర్దేశిస్తున్నప్పటికీ, అంతలోగా కచ్చితంగా జరుగుతాయని యూనస్ ప్రభుత్వం చెప్పడం లేదు. ప్రత్యేక పరిస్థితుల్లో గడువు పెంచుకొనే సౌలభ్యం ఉన్నదని బీఎన్పీ నాయకులు గుర్తుచేస్తున్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఆ పార్టీ అధినేత ఖలీదా జియా విదేశాల్లో చికిత్స చేయించుకొని వెనక్కువచ్చేవరకూ ఎన్నికలు ఉండకపోవచ్చునని కొందరి అనుమానం. ఎన్నికలు ఎప్పుడు ప్రకటిస్తే అప్పుడు షేక్ హసీనా బంగ్లాదేశ్‌లో అడుగుపెడతారని ఆమె కుమారుడు అంటున్నారు. ఈ నేపథ్యంలో, ప్రజలు ఎంతో నమ్మకంగా బాధ్యతలు అప్పగించిన మహ్మద్ యూనస్ తన విధిని సక్రమంగా, రాజ్యాంగ బద్ధంగా నిర్వహించాల్సి ఉంది. ఆయనను ముందుపెట్టి బీఎన్పీ, జమాత్-ఎ-ఇస్లామీ వంటివి వెనకనుంచి చక్రం తిప్పుతాయన్న విమర్శలు, విశ్లేషణల్లో నిజం లేదని రుజువుచేయాలి.

తరం మార్పులో తిరస్కృతుడైన నెహ్రూవాది

ఆకులు పండిపోయి నేలరాలడం, చెట్లు మళ్లీ చిగురించి నవ నవోన్మేషంగా మారడం ప్రకృతికి ఎంత సహజమో, మానవ సమాజానికి కూడా అంతే సహజం. మూడు రోజుల క్రితం మరణించిన 95 సంవత్సరాల మాజీ విదేశాంగ మంత్రి నట్వర్‌సింగ్ కొన్ని దశాబ్దాల కాంగ్రెస్ చరిత్ర, సంస్కృతికి ప్రతీకగా నిలిచారు. ఆయన మరణంతో కాంగ్రెస్‌ను పెనవేసుకున్న ఒక రాజకీయ సంస్కృతి కూడా అదృశ్యమైందని చెప్పవచ్చు. నిజానికి నట్వర్‌సింగ్‌తో కాంగ్రెస్ భవబంధం దాదాపు దశాబ్దన్నర క్రితమే సమసిపోయింది. ఎన్‌డి తివారి, పోతేదార్, శివశంకర్, కోట్ల విజయ భాస్కరరెడ్డి, పి.వి.నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, మోతీలాల్ వోరా, అర్జున్‌సింగ్, గాడ్గిల్ తదితరులతో పాటు నట్వర్‌సింగ్ కూడా చివరకు కాలగమనంలో కలిసిపోయారు. నిజానికి ఈ నేతల్లో చాలా మంది కంటే నట్వర్‌సింగ్ జూనియర్. రాచకుటుంబంలో పుట్టి, నెహ్రూ హయాంలో విదేశాంగ సర్వీసులో చేరి ఆయన చెల్లెలు కృష్ణహతీ సింగ్ పిల్లలతో పాటు కలిసి చదువుకున్నందువల్ల గాంధీ కుటుంబ కోటరీలో చేరగలిగిన నట్వర్‌సింగ్ పలువురు కాంగ్రెస్ నేతల మాదిరే ఆ కుటుంబ అంతరంగిక సభ్యులుగా మెలిగారు. ఇందిర మరణానంతరం రాజీవ్ గాంధీ హయాంలో రాజకీయాల్లో ప్రవేశించి పార్లమెంట్ సభ్యుడుగా తొలిసారి గెలిచిన నట్వర్‌సింగ్ నెహ్రూవియన్ ఆలోచనా విధానానికి చెందినవారు. ఇందిర హయాంలో విదేశాంగశాఖ అధికారిగా ఉండగానే ఆయన పద్మభూషణ్ పురస్కారాన్ని పొందారు. రాజీవ్ హయాంలో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాని నట్వర్‌సింగ్ ఆ సమయంలో విదేశాంగ విధానంలో జరిగిన తప్పులను నివారించలేకపోయారు. ఎంత మేధావి అయినా అధికారంలో ఉన్నవారికి సమీపంలో ఉండాలని నిర్ణయించుకున్న వారికి తమ అధినేతలు చేసే తప్పులను ఆ సమయంలో ప్రశ్నించే ధైర్యం ఉండదు. తమ అధినేతల కటాక్ష వీక్షణాలకు దూరమైన తర్వాత వారు చేసిన తప్పులను విమర్శిస్తే మాత్రం ప్రయోజనం ఏముంటుంది?

రాజీవ్ మరణానంతరం అర్జున్‌సింగ్‌తో పాటు ప్రధాన మంత్రి కావాలని ఆశించిన వారిలో నట్వర్‌సింగ్ ఒకరు. కాని ఆ అవకాశం పి.వి.కి దక్కడంతో అసమ్మతివాదులుగా మారిపోయారు. అర్జున్, తివారీ, షీలాదీక్షిత్‌లతో కలిసి సూరజ్‌కుండ్ ఏఐసిసి సదస్సులో నిరసన తెలిపారు. పి.వి.కి అడుగడుగునా కష్టాలు సృష్టించారు. 'మేము ఎన్ని కష్టాలు సృష్టించినా పి.వి. ప్రభుత్వం చెక్కుచెదరలేదు. అయిదు సంవత్సరాలు నిబ్బరంగా మైనారిటీ ప్రభుత్వాన్ని నిర్వహించారు. మా అందరికంటే ఆయనే తెలివైన నాయకుడని నిరూపించుకున్నారు' అని నట్వర్‌సింగ్ తన ఆత్మకథలో వాపోయారు. తర్వాత మరోసారి యూపీఏ హయాంలో కూడా విదేశాంగ మంత్రిగా అవకాశం వచ్చినప్పటికీ అప్పటికే విదేశాంగ విధానం అలీన లక్షణాలను కోల్పోయి, ఆర్థిక విధానాల ఆధిపత్యానికి లోనయ్యే క్రమం వేగవంతమైంది. ఆ క్రమంలోనే ఆయన నిష్క్రమణకు రంగం సిద్ధమైంది. ఇరాక్ నుంచి చమురు దిగుమతి చేసుకుని ఆహార సరఫరాలు చేసే పథకానికి సంబంధించి నట్వర్ సింగ్, ఆయన కుమారుడు లబ్ధిదారులు అన్న ఆరోపణలు రావడంతో 2006లో కాంగ్రెస్ ఆయనను బహిష్కరించింది. ఆ సమయంలో ఆయన మౌనంగా ఉండి, సోనియా శరణు వేడినా తర్వాతి కాలంలో కాంగ్రెస్ చేరదీసి ఉండేదేమో? కాని నెహ్రూ కుటుంబానికి, కాంగ్రెస్‌కు అంకితభావంతో



రాజీవ్ గాంధీ హయాంలో రాజకీయాల్లో ప్రవేశించిన నట్వర్ సింగ్ (1929–2024)

నెహ్రూవియన్ ఆలోచనా విధానానికి చెందినవారు. రాజీవ్ ప్రభుత్వంలో ఆయన విదేశాంగ మంత్రిగా పనిచేశారు. రాజారావు, నిరాద్ చౌదురి, ఆర్‌కే నారాయణ్, తక్కజి శివశంకర పిళ్లై లాంటి ఎందరో రచయితలతో సన్నిహిత సంబంధాలుండి, సాహిత్యంలో మంచి అభినివేశం ఉన్న నట్వర్‌సింగ్ మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మార్చుకోలేకపోయిన కాంగ్రెస్ నేతల్లో ఒకరు.

సేవ చేసిన తనకు పార్టీ అండగా నిలబడకపోవడంతో ఆయన మనసు గాయపడి కాంగ్రెస్‌ను ధిక్కరించారు. ఆయన కుమారుడు బీజేపీలో చేరాడు. నట్వర్ సైతం తన చరమదశలో నరేంద్రమోదీని కలిసి ప్రశంసల వర్షం కురిపించడం ఆయన వ్యక్తిత్వాన్ని మరింత పలచన చేసింది. చివరకు పూర్తిగా విస్మరణకు గురై, పలకరించేవారు కరువైన పరిస్థితుల్లో నట్వర్ దివంగతులయ్యారు. రాజారావు, నిరాద్ చౌదురి, ఆర్ కేనారాయణ్, తక్కజి శివశంకర పిళ్లై లాంటి ఎందరో రచయితలతో సన్నిహిత సంబంధాలుండి, సాహిత్యంలో మంచి అభినివేశం ఉన్న నట్వర్‌సింగ్ మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మార్చుకోలేక నిష్క్రమించిన అనేకమంది కాంగ్రెస్ నేతల్లో ఒకరని చెప్పక తప్పదు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

నట్వర్‌సింగ్ లాంటి వారిని వదుల్చుకోవడమే కాంగ్రెస్‌లో కాల పరిణామంలో వస్తున్న మార్పులకు నిదర్శనం అని భావించాల్సి ఉంటుంది. తనను తాను నెహ్రూవాదిగా చెప్పుకున్నప్పటికీ పీవీకి తాను ప్రవేశ పెట్టిన ఆర్థిక సంస్కరణలకూ నెహ్రూ విధానాలకు పొంతనలేదన్న విషయం తెలియనిది కాదు. ఆలోచనా విధానానికి వయసుకూ సంబంధం ఉండదని నిరూపించిన కొద్ది మంది నేతల్లో పీవీ ఒకరు. అందుకే తాను చేయదలుచుకున్న మార్పుల చట్రానికి అనుగుణంగా లేని వ్యక్తులను వయసుతో నిమిత్తం లేకుండా ఆయన వదుల్చుకున్నారు. వారు గాంధీ కుటుంబ విధేయులన్న విషయాన్ని కూడా ఆయన పట్టించుకోలేదు.

సోనియాగాంధీకి కూడా గత కాలపు అవశేషాల పట్ల అంత ఆసక్తి లేదు. పీవీకి వ్యతిరేకంగా తివారీ, అర్జున్ సింగ్, పోతేదార్, నట్వర్‌సింగ్ తదితరులు అసమ్మతి శిబిరం నడుపుతున్నప్పటికీ ఆమె తన ప్రయోజనాల రీత్యా వారిని వారించలేదు కాని వారిని పూర్తిగా చేరదీయలేదు కూడా. తనకు ప్రధాని పదవి వచ్చే అవకాశాలు లేవని తెలిసినప్పుడు మన్మోహన్‌సింగ్ లాంటి వారికి అవకాశం కల్పించారు కాని విధేయులను పక్కన పెట్టారు. కాకపోతే మంత్రి పదవుల్లో, గవర్నర్ పదవుల్లో ఇచ్చి బుజ్జగించారు. నట్వర్‌సింగ్ లాంటివారిపై జైరాం రమేశ్ లాంటి తర్వాతి తరం నేతలు జోకులు విసురుతుంటే సోనియా నవ్వుతూ ఉండేవారని నట్వర్ రాసిన ఆత్మకథ చదివినప్పుడు అర్థమవుతోంది.

నట్వర్ మాత్రమే కాదు, క్రమక్రమంగా ఇందిర, రాజీవ్, సంజయ్ హయాం కాలపు నేతలందరూ కనుమరుగయ్యారు. ఒకప్పుడు సంజయ్‌గాంధీ మిత్రగణంలో చలాకీగా ఉన్న అంబికా సోనీ నిన్నమొన్నటి వరకూ రాజ్యసభ సభ్యురాలిగా ఉండి ఇప్పుడు 8 పదులు దాటిన వయసులో కాలక్షేపం చేస్తున్నారు. మరణించేంత వరకూ మోతీలాల్ వోరాను కోశాధికారిగా కొనసాగించి, రాజ్యసభలో నిద్రపోతున్నా కాంగ్రెస్ ఆయనను ఓపికగా భరించి గౌరవంగా నిష్క్రమించేందుకు వీలు కల్పించింది. సంజయ్ మిత్రుడైన గులాంనబీ ఆజాద్ లాంటి అనేక మంది తమ దారి తాము చూసుకుంటే దిగ్విజయ్‌సింగ్, కమలనాథ్ లాంటి నేతలు సహజంగా నిష్క్రమించే తరుణం ఆసన్నమైందని చెప్పక తప్పదు. ఎకె ఆంటోనీ, మన్మోహన్‌సింగ్, మీరాకుమార్ తదితరులు ఇప్పటికే క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 77 సంవత్సరాల సోనియాగాంధీ తనకు తాను ప్రత్యక్ష ఎన్నికలకు దూరమై రాజ్యసభను ఎంచుకున్నారు. అనేకమంది సీనియర్ నేతల సంతానం రాజకీయాల్లో ఇప్పటికే ప్రవేశించారు. మళ్లీ 2029లో లోక్‌సభ ఎన్నికలు జరిగే నాటికి ఇప్పుడున్న వారిలో అనేకమంది మనకు రంగంలో కనపడకపోవచ్చు.

నిజానికి నరేంద్ర మోదీ పాలించిన గత పదేళ్ల కాలంలో చాలా మంది నాయకులు తెరమరుగయ్యారు. మోదీ అధికారంలోకి రాగానే ఒక వ్యూహం ప్రకారం అద్వాణీ, మురళీ మనోహర్ జోషీ వంటి వృద్ధులను మాత్రమే కాదు, పాత తరానికి సన్నిహితంగా ఉన్నవారందరినీ క్రమక్రమంగా బీజేపీలో నిర్ణయాధికారం నుంచి దూరం చేసే ప్రక్రియ ప్రారంభిస్తే కాంగ్రెస్‌లో సహజంగా ఈ మార్పులు జరిగాయని చెప్పక తప్పదు. కాంగ్రెస్ వయసును రాజకీయాల్లో ఒక కొలమానంగా పెట్టుకోకపోయినా తరం మార్పు ఆ పార్టీలో కూడా జరిగింది. సోనియాగాంధీ నెహ్రూ, ఇందిర, రాజీవ్ కాలం నుంచి ఉన్నవారందరినీ కొంతకాలం భరించారు. రాహుల్ కూడా మొదట్లో పాతతరం వారిని భరించక తప్పలేదు. కాని క్రమంగా కాంగ్రెస్ నాయకత్వం వ్యూహాత్మకంగా పార్టీలో సంస్థాగతంగా బాధ్యతలు కొత్త వారికి అప్పజెప్పడం ప్రారంభించింది. గత ఏడాది ఉదయపూర్‌లో జరిగిన ఏఐసీసీ సదస్సులో 50 శాతం నేతలను 50 సంవత్సరాల లోపు వారికి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నది. దాన్ని పూర్తిగా అమలు చేయలేకపోయినా తమ నాయకత్వం వయసును తగ్గించుకునే ఆలోచనలో కాంగ్రెస్ ఉందనడంలో సందేహం లేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శుల్లో అందరూ 70 ఏళ్ల లోపు ఉన్నవారే. వీరిలో జైరాం రమేశ్ ఒక్కరే అందరికన్నా సీనియర్. రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, సచిన్ పైలట్, గౌరవ్ గొగోయ్, దీపేందర్ హుడా, రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్, ప్రణీతీ షిండే, సుప్రియా శ్రీనాటే, బి.వి. శ్రీనివాస్, ఫులోదేవి నేతమ్, గుర్దీప్ సప్పల్, కన్హయ్యకుమార్, నీరజ్ కుందన్ తదితర యువ నేతలదే కాంగ్రెస్ రాజకీయాల్లో భవిష్యత్ అని చెప్పక తప్పదు. ఇతర పార్టీల్లో కూడా అలాంటి యువ నేతలు ఎందరో ఉన్నారు.

కాని ప్రపంచ దేశాల్లో వస్తున్న మార్పులు, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంలో రోజురోజుకూ మారిపోతున్న పరిణామాలు, భాషలోనూ, భావాల వ్యక్తీకరణలోనూ కనపడుతున్న కొత్తదనం, సమాజానికి అవసరమైన ప్రమాణాలు, నైపుణ్యాలు, నాణ్యత గల సేవలు, పెరుగుతున్న భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించాల్సిన మౌలిక సదుపాయాలు, సంపద కేంద్రీకృతం కాకుండా అందరికీ అందుబాటులోకి రావాల్సిన మార్గాల గురించి ఆలోచించని రాజకీయతరం లేకపోతే ఏమి ప్రయోజనం ఉంటుంది? గడచిన అయిదు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక యువనేతకు పూర్తి మెజారిటీ ఇచ్చి అధికారం చలాయించే అవకాశం ప్రజలు కల్పించినప్పటికీ నిధులను పూర్తి దుర్వినియోగం చేసి రాష్ట్రం కొన్ని దశాబ్దాలు వెనుకకు పయనించేందుకు వీలు కల్పించారు. అదే సమయంలో నేటి వాట్సాప్‌లో గతం గురించి గొప్పలు చెప్పుకుంటూ ఆధునిక భావజాలాన్ని, హేతుబద్ధతను, వివేచనను అవహేళన చేసే వారిని చూస్తుంటే ఆవేదన కలుగుతుంది. 'కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు, తాతగారి, బామ్మగారి భావాలకు దాసులు, నేటి నిజం చూడలేని కీటక సన్యాసులు' అని ఇలాంటి వారిని చూసే మహాకవి శ్రీశ్రీ రాసి ఉంటారు. వీరికన్నా తమ అనుభవాన్ని జరిగిన తప్పులను సవరించుకునేందుకు ఉపయోగించుకుని ప్రజల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఒక లక్ష్యంతో చర్యలు చేపట్టే వారికి వయసుతో నిమిత్తం ఏముంటుంది?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఎన్నాళ్లకెన్నాళ్లకు ఈ ప్రజాస్వామ్య పరిమళం!

ఇటీవల తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాస్వామ్య పరిమళం తెలుగు సమాజాన్ని ఆహ్లాదపరిచింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి మీద బీఆర్ఎస్ నాయకులు చేసే అతిపెద్ద విమర్శ 'ఆయన పెద్దగా చదువుకోలేదు, ఆయనకు ఏం తెలియదు' అన్నది. కానీ ఆయన ప్రజాస్వామిక విలువలను, సమాజాన్ని బాగా చదివి ఆకళింపు చేసుకున్న, నిఖార్సైన విద్యార్థికుడని ఈ అసెంబ్లీ సమావేశాలు నిరూపించాయి.

2004 నుంచి 2009 దాకా ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ప్రధాన ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు మధ్య పోటాపోటీ వాతావరణాన్ని ప్రతిబింబించేది. రాష్ట్ర సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ఇద్దరికీ అవగాహన ఉండటంతో సుదీర్ఘ చర్చలు సాగేవి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అంశం కూడా ఆ చర్చల్లో ప్రధానపాత్ర అయ్యింది. ఇక 2009 తర్వాత ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అన్నదే అతి ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రులు ఎందరు మారినా ప్రధాన అజెండా ప్రత్యేక తెలంగాణ అంశమే. ఈ అంశం నుంచే తిరుగులేని నాయకుడిగా ఎదిగిన కేసీఆర్ హయాంలో తెలంగాణలో పాలన ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతుందని ప్రజలు ఆశించారు. ఉద్యమంలోంచి పుట్టిన పార్టీకి నాయకుడిగా ఎదిగిన పెద్దమనిషి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుతారని తెలంగాణ సమాజం భావించింది. కానీ 2014–2023 మధ్య తెలంగాణ అసెంబ్లీలో ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి.

"మీకేం తెల్వదు.... సోయి లేదా.... తెల్వకుండా మాట్లాడకు.... ఏయ్ నే చెప్తున్నాగా వినండి... నాకన్నా ఎక్కువ తెలుసా..." బహిరంగ సభల్లో మాట్లాడే ఈ భాష తెలంగాణ అసెంబ్లీలో 2014–2023 మధ్య తరచుగా వినిపించేది. ప్రతిపక్షం అంటే గౌరవం ఏ మాత్రం ఉండేది కాదు. వారికి బాధ్యతాయుతంగా సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్న భావనతో ఏకంగా సభలో ప్రతిపక్షమే లేకుండా చేయడానికి జరిగిన ప్రయత్నాలను చూశాం. సందర్భం ఏదైనా, సమస్య ఏదైనా ఇదొక్కటే ధోరణిగా కేసీఆర్ ముఖ్యమంత్రి హయాం నడిచిపోయింది. అసెంబ్లీలోనే అనుకుంటే పొరపాటు; సభ బయటకు వచ్చాక కూడా అదే ధోరణి! ఏ జర్నలిస్టుకూ సభలో జరిగిన దాని గురించి అడిగే అవకాశమే లేదు. ఏదైనా సందర్భంలో జర్నలిస్టుల నుంచి ప్రశ్నలెదురైనా, "ఏంటయ్యా.. ఏం ప్రశ్న అది.. నీకు తలకాయ ఉందా? నువ్వు ఏ ఛానెల్లో పని చేస్తున్నావు.. నాకు తెల్వదులే నువ్వు చెప్పు.." ఇలా అహంకార పూరిత సమాధానాలతో దాదాపు దశాబ్ద కాలం వెళ్లిపోయింది.



రేవంత్‌రెడ్డి హయాంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ స్పష్టంగా కనిపించింది. ప్రతిపక్షం ఏ ప్రశ్న వేసినా ముఖ్యమంత్రి లేదా ఒకరిద్దరు ముఖ్యులు మాత్రమే అందరి తరఫున సమాధానాలు చెప్పే ధోరణికి ఫుల్‌స్టాప్ పడింది. ప్రతి మంత్రిత్వ శాఖ తరఫున ఆయా మంత్రులే లేచి నిక్కచ్చిగా, స్పష్టంగా, ఆత్మవిశ్వాసంతో తమ ప్రభుత్వ వైఖరిని చెప్పగలిగే పరిస్థితి వచ్చింది. ఈ వ్యవహారం కన్నుల పండుగగా అనిపించింది.

తెలంగాణ సమాజ ఆకాంక్షలకు తగ్గట్టుగా 2023లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కొత్త ప్రభుత్వం ఏర్పడింది. రేవంత్‌రెడ్డి హయాంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ స్పష్టంగా కనిపించింది. ప్రతిపక్షం ఏ ప్రశ్న వేసినా ముఖ్యమంత్రి లేదా ఒకరిద్దరు ముఖ్యులు మాత్రమే అందరి తరఫున సమాధానాలు చెప్పే ధోరణికి ఫుల్‌స్టాప్ పడింది. ప్రతి మంత్రిత్వశాఖ తరఫున ఆయా మంత్రులే లేచి నిక్కచ్చిగా, స్పష్టంగా, ఆత్మవిశ్వాసంతో తమ ప్రభుత్వ వైఖరిని చెప్పగలిగే పరిస్థితి వచ్చింది. ఈ వ్యవహారం కన్నుల పండుగగా అనిపించింది. కేసీఆర్ కాలంలో జరిగిన దానికి పూర్తి భిన్నంగా అవసరమైన సందర్భాల్లో మాత్రమే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడ్డం కొందరికి ఆశ్చర్యం కూడా కలిగించింది. ఈ విషయంలో సీఎంతో పాటు శాసన సభ వ్యవహారాలను పర్యవేక్షించిన మంత్రి డి. శ్రీధర్‌బాబు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి.

ఇక ప్రభుత్వ విధానాలు, సమస్యలు, పరిష్కారాల విషయంలో అధికారపక్షంలో వివిధ వర్గాలకు చెందిన నాయకులు స్వేచ్ఛగా మాట్లాడడం కొత్తగా తెలంగాణ అసెంబ్లీలో కనిపించిన దృశ్యం. ఎప్పుడూ రాజకీయ ప్రయోజనం కలిగించే పాపులర్ అంశాలే కాకుండా సమాజానికి అత్యవసరమైన విద్య, వైద్యం తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చ జరగడం ఆరోగ్యకరమైన సంకేతం. విద్యా, ఉపాధి రంగాలపై కేవలం సుదీర్ఘ చర్చలకే పరిమితం కాకుండా బడ్జెట్ కేటాయింపుల విషయంలోనూ అదే అనుకూలత ప్రస్ఫుటంగా కనిపించింది. విద్య, వైద్యం, ఉపాధి మాత్రమే కాదు; తెలంగాణ సమాజానికి అవసరమైన ప్రతి రంగం మీద సావధానంగా, నిశితంగా, క్షుణ్ణంగా చర్చలు జరిగాయి. అంతకన్నా ముఖ్యమైన విషయం ఒకటి ఉంది. అదేమిటంటే– ఈ చర్చల్లో ప్రధాన ప్రతిపక్షం భాగస్వామి అయిందీ అనడం కన్నా అయ్యేలా ప్రభుత్వం చూసుకుంది అని చెప్పొచ్చు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే ఏ ప్రశ్న వచ్చినా అధికారపక్షం దూకుడు ధోరణితో సభను ఇంకాస్త వేడెక్కించి అంశాన్ని పక్కదోవ పట్టించేది. అదీ కాకుంటే సభ నుంచి ప్రతిపక్ష సభ్యుల్ని బలవంతంగా బయటకు పంపేది. ఒక దశలో అధికార పక్షాన్ని ప్రశ్నించి ప్రయోజనం లేదనే పరిస్థితిలో ప్రతిపక్ష సభ్యులే నిర్వీర్యం అయ్యే వాతావరణం కల్పించారు. ఇలా ఎన్నో టక్కుటమార విద్యలతో నాడు అధికారపక్షం ముందుకు నడిచింది. అందుకు పూర్తి భిన్నంగా రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ అసెంబ్లీ నడుస్తోంది.

తనకే సర్వం తెలుసు అనుకునే నాయకులకు పూర్తి భిన్నంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి వుంది. ఆయన సభలో మాట్లాడుతున్నప్పుడు పదేపదే సంబంధిత మంత్రులు, ఆయా ప్రాంతాల, వర్గాల, శాసనసభ్యుల పేర్లను ప్రస్తావించడం, వారి అభిప్రాయాలకు విలువివ్వడం చూశాం. ఈ పరిణతి లేక అధికారపక్షం నుంచి ప్రతిపక్షానికి పడిపోయిన బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ కనీసం ఆ బాధ్యతలు కూడా సరిగా నిర్వర్తించలేక సభకు దూరంగా వుండటాన్ని తెలంగాణ సమాజం జాగ్రత్తగా గమనిస్తోంది. పేరుకు విద్యావంతులైన వాళ్లు కింద పడ్డా పైచేయి తమదే అంటున్నారు. నిజంగా సమాజాన్ని చదువుకున్న విద్యార్థికులు పై మెట్టులో ఉన్నప్పటికీ వినయంగా ఉంటున్నారు. తెలంగాణ సమాజానికి ప్రస్తుతం ఇలాంటి నాయకత్వమే అవసరం. ఈ బీజాలు భవిష్యత్తులో బలమైన, నిజమైన ప్రజాస్వామ్య తెలంగాణ నమూనాకి బాటలేస్తాయి.

● యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
శాసనసభ్యులు, మహబూబ్‌నగర్

అన్యాయపు శిక్ష!

ఏడాదిన్నర కాలంగా ఢిల్లీ మద్యం విధానం కేసులో జైల్లో ఉన్న ఆ రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసి ఊరటనిచ్చింది. ఆ కేసు విచారణకు సీబీఐ ఇంకా సిద్ధం కాలేదు. దర్యాప్తు కొనసాగుతూనే ఉంది. ఈ మధ్య కాలంలో ఆయన బెయిల్ కోసం క్రింది కోర్టుల మెట్లు ఎక్కి దిగి వస్తున్నారు. సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు బెయిల్‌ని వ్యతిరేకిస్తూ రావడం వల్ల, విచారణ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని చెప్పడం వల్ల ఆయనకు బెయిల్ ద్వారా స్వేచ్ఛ లభించలేదు. ఈ విషయాల్ని గమనించి సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. కింది కోర్టులు రక్షణాత్మక వైఖరితో సేఫ్ గేమ్ ఆడుతూ, బెయిల్ ఇవ్వకుండా ఆయన స్వేచ్ఛ హక్కుని కాలరాయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పు పట్టింది. ఎందుకంటే న్యాయ సూత్రాల ప్రకారం బెయిల్ అన్నది నిందితుడి సహజ హక్కు. తప్పనిసరి సమయాల్లోనే జైలులో ఉంచాలి. ఆ వ్యక్తి ద్వారా సాక్ష్యాలు ప్రభావితం అవుతాయనుకుంటేనో, లేదా ఆయన దేశం విడిచి పారిపోతాడనుకుంటేనో జైల్లో ఉంచాలి. దర్యాప్తు సంస్థలు అన్ని పత్రాల్నీ సేకరించి పెట్టుకున్నపుడు, వాటిపైనే కేసు ఆధారపడి ఉన్నప్పుడు ఆయనకి కేసును ప్రభావితం చేసే అవకాశం లేదన్నది కింది కోర్టులు గమనించాల్సింది. విచారణ ప్రక్రియ మొదలవ్వడమే తీవ్రంగా జాప్యం కావడం, అంత వరకూ నిందితుడు జైల్లోనే మగ్గాల్సి రావడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. తప్పు చేశాడని ఋజువు కాకముందే శిక్షించడం అన్యాయం. ఒకవేళ ఆయన నిరపరాధి అయితే, చేయని నేరానికి, శిక్ష అనుభవించాల్సి రావడం ఎంత వేదనాభరితం? దర్యాప్తు సంస్థల నిష్పక్షపాత ధోరణిపై, అధికార పీఠాలతో వాటి దగ్గరతనంపై అనుమానాలున్నప్పుడు న్యాయ ప్రక్రియ మరింత లోపరహితంగా ఉండాలి. నిందితుడి వైపు నుండి ముందు ఆలోచించాలి.

ఇలా విచారణ ఖైదీలకు న్యాయవ్యవస్థ అనుమతించిన బెయిల్ హక్కు దూరం కావడం అరుదైన విషయం కాదు. జాతీయ నేర గణాంకాల నివేదిక ప్రకారం గత సంవత్సరం జైళ్లల్లో మగ్గుతున్న విచారణ ఖైదీలు నాలుగు లక్షల ముప్పయి వేల మంది. పూచీకత్తులకు ధనం లేక, సహాయం లేక ముద్దాయిలుగా ముద్రపడక ముందే, ఆ నేరానికి తమకు పడగల శిక్షకన్నా ఎక్కువ శిక్షకు గురై ఉన్నారు. సమాజంలో పలుకుబడి, అధికారం ఉన్న సిసోడియా లాంటి వారికే, అదీ అన్ని వనరులతో పోరాడితేనే, అందాల్సిన న్యాయం ఏడాదిన్నరకి అందితే, ఇక ఏ దిక్కూ లేని వారి సంగతేమిటి? ఆ లక్షలాది మందికి కూడా న్యాయం దక్కేలా వ్యవస్థను సరిదిద్దుకోవాలి. లేదంటే అది ఒక సామాజిక వైఫల్యంలా, భారతీయ న్యాయ వ్యవస్థకే మచ్చలా మిగిలిపోతుంది.

– డి.వి.జి. శంకరరావు

పౌర సమాజానికి చెవి ఒగ్గండి!

గత పదేళ్లుగా దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరించిన ఫాసిస్టు పోకడలను, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ, అవినీతి, కుటుంబ పాలనను భరించలేకనే ప్రజలు మార్పు కోరుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనను ప్రజలలో ఎప్పటికప్పుడు ఎండగడుతూ, పోరాడుతూ వచ్చిన ప్రజా సంఘాలు, పౌర సమాజ వేదికలు కూడా రాష్ట్రంలో విస్తృత ప్రచారం సాగించాయి. ఫలితమే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం.

ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ఈ విషయాన్ని మర్చిపోకూడదు. ప్రజా పాలన చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం పాలనాపరమైన, విధాన నిర్ణయాలు చేసేటప్పుడు నిత్యం రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోణంలో మాత్రమే ఆలోచించాలి. ఆ విధానాలు రాష్ట్రంపై, ప్రజలపై ఎటువంటి ప్రభావం వేస్తాయన్న విషయంపై పౌర సమాజ వేదికలతో కూడా చర్చిస్తే, సమాజం నుండీ పూర్తి మద్దతు అందుతుంది. మాకు అధికారం ఉంది కనుక ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తాం అంటే కుదరదు. ప్రజల పక్షాన నిలబడే పౌరసమాజ సంస్థలు అనివార్యంగా ప్రభుత్వ విధానాలను, తప్పులను ప్రశ్నించాలి. కొన్ని విషయాలలో కాంగ్రెస్ పాలన తప్పటడుగులు వేస్తోంది. ప్రజలతో, ప్రజా సంఘాలతో, పౌర సమాజ వేదికలతో చర్చల ద్వారా తప్పటడుగులను సరి చేసుకుని, గట్టి అడుగులు వేయవచ్చు. కానీ, తానుగా వేసిన తప్పటడుగులను మాత్రం తానే వెనక్కు తీసుకోవాల్సి ఉంటుంది.

విద్యా రంగంలో ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యలు సమగ్రంగా ఆలోచించి తీసుకున్నవి కాదని పౌర సమాజం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలించాల్సిన కొన్ని నిర్ణయాలేమిటో చూద్దాం: అమ్మ ఆదర్శ స్కూలు యాజమాన్య కమిటీలకు స్కూల్స్‌లో మౌలిక వసతుల నిర్మాణ బాధ్యతలు ఇవ్వడం; మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి స్కూల్ పరిధి నుండీ బయటకు తీసుకు వెళ్ళి సెంట్రలైజ్ కిచెన్ పద్ధతిలోకి మార్చి హరే రామ హరే కృష్ణ, అక్షయ పాత్ర లాంటి సంస్థలకు అప్పగించాలని నిర్ణయించడం; ప్రతి గ్రామంలోనూ స్కూల్ ఏర్పాటు చేసి దాన్ని బలోపేతం చేయకుండా మండల స్థాయిలో కేంద్రీకృత రెసిడెన్షియల్ ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం; మొత్తం విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చినా, కేవలం 7.31 శాతం మాత్రమే కేటాయించడం; స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు తప్పకుండా స్వాగతించాల్సిన నిర్ణయమే అయినా, దానిని పూర్తిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో కాకుండా, అందులో ప్రైవేట్ సంస్థలకు భాగస్వామ్యం కల్పించడం; 1 నుండీ మూడు తరగతులు అంగన్‌వాడీలో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా నడపడం, 4 నుండీ 12 వరకూ పై స్థాయి విద్యా సంస్థల నిర్మాణం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనలు... ఇలాంటి అంశాలన్నింటినీ ప్రభుత్వం పునః పరిశీలించాలి.

ప్రభుత్వం ఈ నిర్ణయాలన్నింటినీ సదుద్దేశ్యంతోనో, తనదైన కోణంలోనో ఆలోచించి తీసుకున్నప్పటికీ, వీటి అమలు వల్ల ఆచరణలో వచ్చే సమస్యలపై విద్యారంగ నిపుణులతో, ఇతర ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో, పిల్లల తల్లితండ్రుల కమిటీలతో సమగ్ర చర్చ జరపాలి. ముఖ్యంగా విద్యా రంగంలో చేసే మార్పులు ఏవైనా, గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే తెచ్చిన విద్యాహక్కు చట్టానికి లోబడి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలి. శాశ్వతంగా ఈ రంగంపై కృషి కొనసాగించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చిన



విధంగా విద్యా కమిషన్ కూడా వేయాలి. అదే సమయంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానాన్ని కేరళ, తమిళనాడు తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా తిరస్కరించాలి.

రాష్ట్ర పారిశ్రామిక రంగంలో ఫార్మా సిటీ రద్దు ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం. అయితే ఫార్మా విలేజ్‌ల భూమి సేకరణ కోసం బడ్జెట్‌లో రూ.50కోట్లు నిధులు కేటాయించడం ప్రభుత్వం పునరాలోచించాల్సిన విషయం. ఔషధ పరిశ్రమ ఎప్పుడైనా కాలుష్య భరితమే – సిటీ అయినా, విలేజ్ అయినా అవి కాలుష్యాన్ని వెదజల్లుతాయి. అందుకే యూరప్, అమెరికా దేశాలు తరిమేసిన ఔషధ కంపెనీలు ఇక్కడికి తరలి వస్తున్నాయి. ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుని మన రాష్ట్రాన్ని ఔషధ పరిశ్రమలతో కాలుష్యం కాకుండా చూడాలి. ఇప్పటికే ఉన్న ఔషధ పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాలను గుర్తించి, ఆయా పరిశ్రమలు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అన్నది పరిశీలించి పాటించని వాటి అనుమతులను రద్దు చేయాలి.

రాష్ట్రంలో ఇప్పటికే 15 ఇథనాల్ పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. అవి బియ్యం ఆధారంగా నడిచేవి. అవి కాలుష్యాన్ని వెదజల్లుతాయని నారాయణపేట జిల్లాలో ఏర్పాటు చేసిన చిత్తనూరు ఇథనాల్ పరిశ్రమ బయటపెట్టింది. కాలుష్యం భరించలేక అక్కడి మూడు గ్రామాల ప్రజలు పోరాడితే, గత ప్రభుత్వం వారిపై నిర్బంధాన్ని ప్రయోగించి, 307 సెక్షన్ క్రింద కేసులు నమోదు చేసింది. ఆ కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలతో కలిసి పోరాడిన బండారు లక్ష్మయ్య అనే లెక్చరర్‌ను సస్పెండ్ చేసింది. ప్రజలపై అప్పటి ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తేయాల్సిన ఈ ప్రభుత్వం కేసులు ఎత్తేయకపోగా, లక్ష్మయ్య గారిపై 2024 జనవరిలో రౌడీ షీట్ ఓపెన్ చేయడం సరికాదు. ఆయనపై ఇటీవల సస్పెన్షన్ ఎత్తేసినా, దూర ప్రాంతానికి బదిలీ చేసి మరో రూపంలో శిక్షించారు.


అలాగే చిత్తనూరు అనుభవాలతో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు పోరాడితే వారిపై ఈ ప్రభుత్వం సెక్షన్ 307 క్రింద కేసులు పెట్టింది. లోక్‌సభ ఎన్నికల ముందు అక్కడి పనులు ఆపేసిన ఆ కంపెనీ యాజమాన్యం మళ్ళీ తాజాగా పనులు ప్రారంభించింది. స్థానిక పోలీసు అధికారులు ఆ కంపెనీ యాజమాన్యానికి అనుకూలంగా ప్రజలను పిలిచి బెదిరిస్తున్న విషయం పౌర సమాజం దృష్టికి వచ్చింది. ఇథనాల్ కంపెనీల అంశంలో ఈ రెండు చోట్లా జరిగిన విషయాలు ప్రజాపాలన స్ఫూర్తికి వ్యతిరేకమైనవి. రాష్ట్రంలో ఇథనాల్ పాలసీపై ప్రభుత్వం పునరాలోచించాలి.

తెలంగాణ ఇప్పటికే పర్యావరణపరంగా అతి సున్నిత ప్రాంతంగా మారింది. ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరీత్యాలు రాష్ట్రానికి నష్టం చేస్తున్నాయి. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వరి లాంటి పంటల విస్తరణ పెరగడం వల్ల గాలిలో మిథేన్ వాయువు పెరుగుతున్నది. ఇలాంటి స్థితిలో రాష్ట్రంలో ఉన్న అడవులను కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. కానీ గత ప్రభుత్వం, అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో అడవులను ఇతర అవసరాలకు మళ్లించింది. ఇలాంటి స్థితిలో రాష్ట్రంలో అడవులను కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, తాజాగా వికారాబాద్ జిల్లాలో అతిదట్టమైన అనంతగిరి అటవీ ప్రాంతంలో 12 లక్షల చెట్లను కొట్టేసి, వేలాది ఎకరాలను నావల్ రాడార్ స్టేషన్ కోసం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రంలో కాలుష్యం మరింత పెరిగిపోతుంది. 20 గ్రామాలపై నేరుగా ప్రభావం చూపించే ఈ నావల్ రాడార్ స్టేషన్ రేడియేషన్ వల్ల క్యాన్సర్ కేసులు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా మూసీ నది జన్మస్థానమైన ఈ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు చేపట్టడం మొత్తం మూసీ భవిష్యత్తుకే ప్రమాదం.

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన అందిస్తామని కాంగ్రెస్ పార్టీ 7వ హామీగా ఇచ్చింది. ప్రగతిభవన్ ప్రజాభవన్‌గా మారినప్పుడు అందరూ సంతోషించారు. కానీ ఈ ప్రభుత్వ పాలనలోనూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అప్పుడప్పుడూ అయినా పోలీసుల దాష్టీకానికి గురవుతూనే ఉందని, పోలీసులు తమ నిజ స్వభావాన్ని ఇంకా మార్చుకోలేదని అనేక ఘటనలు ఇప్పటికే నిరూపించాయి. తాజాగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎవరైనా సభ పెట్టుకోవాలంటే చిక్కడపల్లి పోలీసుల అనుమతి ముందుగా తీసుకోవాలని ఆ స్టేషన్ అధికారులు భవన నిర్వాహకులకు చెప్పడం ఆందోళన కలిగించే విషయం. ఇది ప్రభుత్వ వైఖరా, లేదా ఆ స్టేషన్ అధికారుల అత్యుత్సాహమా అనేది స్పష్టంగా చెప్పలేం. ఇది ప్రభుత్వ అధికారిక వైఖరి కాకపోతే, ఆ విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించి, ఈ కండిషన్ పెట్టిన, ఆ స్టేషన్ పోలీసు అధికారులను హెచ్చరించాలి. ప్రజలకు ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం హామీ పడాలి.

■ కన్నెగంటి రవి
తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (TPJAC)

కోల్ రైల్‌కు సై



- ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్ర రైల్వేశాఖ మంజూరు
- రైల్వే లైన్లతో పెరగనున్న రవాణా, కనెక్టివిటీ
- కాజీపేట - భూపాలపల్లి లైన్ ప్రస్తావన కరువు

7

1 రామగుండం - భూపాలపల్లి (వయా మణుగూరు)
దూరం : 207 కి.మీ.
నిధులు : రూ.4,100కోట్లు
ప్రయోజనం : బొగ్గు సరఫరాతో పాటు టూరిజం అభివృద్ధి

2 డోర్నకల్ - మిర్యాలగూడ (కోదాడ)
దూరం : 105 కి.మీ
నిధులు : రూ.2,100కోట్లు
ప్రయోజనం : సరుకుల రవాణాతో పాటు హైదరాబాద్ కనెక్టివిటీ


3 డోర్నకల్ - గద్వాల
దూరం : 296 కి.మీ నిధులు : రూ.5వేల కోట్లు
ప్రయోజనం : కొత్త ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ

4 అసన్‌సోల్ (పశ్చిమబెంగాల్) - వరంగల్
దూరం : 1,316 కి.మీ
నిధులు : రూ.7,382 కోట్లు
ప్రయోజనం : గిరిజన ప్రాంతాలు, బొగ్గు రవాణా

ఇటీవల కేంద్ర రైల్వేశాఖ ప్రకటించిన కొత్త రైల్వే ప్రాజెక్టులు ఓరుగల్లుకు భారీ ప్రయోజనాన్ని చేకూర్చను న్నాయి. కోల్‌బెల్ట్ ప్రాంతమైన రామగుండం నుంచి భూపాలపల్లి, ములుగు మీదుగా మణుగూరు వరకు నిర్మించే రైల్వేలైన్ బొగ్గు సరఫరాతో పాటు పర్యాటక అభివృద్ధిలో కీలకం కానుంది. అలాగే డోర్నకల్ జంక్షన్ నుంచి మిర్యాలగూడ, గద్వాల వరకు వేర్వేరు రైల్వేలైన్లు ఇతర తూర్పు, దక్షిణ రైల్వేలైన్లతో కనెక్టివిటీని పెంచటంతో పాటు బొగ్గు, బియ్యం, గ్రానైట్ తదితర వాటిని సరఫరా చేసే విధంగా కొత్త రైల్వే కారిడార్ అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. అయితే కాజీపేట రైల్వే డివిజన్‌తో పాటు కాజీపేట - భూపాలపల్లి రైల్వేలైన్‌పై కేంద్రం ప్రకటన చేయకపోవటంపై ఓరుగల్లువాసుల్లో కొంత అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

హోటళ్లే అడ్డాగా..!



- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా శివారు హోటళ్లు
- రింగ్ రోడ్డు ప్రాంతాల్లో యథేచ్ఛగా దందా
- మామూళ్ల మత్తులో పడి నిర్లక్ష్యం చేస్తున్న పోలీసులు
- సీపీ దృష్టి పెట్టాలంటున్న ప్రజలు

వరంగల్ క్రైం, ఆగస్టు 13: వరంగల్ మహా నగర శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు విచ్చల విడిగా జరుగుతున్నాయి. శివారులో వెలుస్తున్న పలు హోటళ్లే ఇందుకు అడ్డాలుగా మారాయి. ప్రధానంగా కేయూ, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్న హోటళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం. పేకాటతో పాటు అనధికారిక మందు పార్టీలు, వ్యభిచారం, ఇతరత్రా కార్యకలాపాలు జరుగుతుంటాయని తెలిసింది.

పోలీసుల వైఫల్యం

ఓఆర్ఆర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పలు దందాలు బహిర్గతమైనప్పటికీ స్థానిక పోలీసులు చూసీచూడనట్లు ఉంటున్నారని తెలుస్తోంది. నగర శివారులో ఉన్న ఈ హోటళ్లలో జరుగుతున్న దందాల గురించి పోలీసులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తారనే ప్రచారం ఉంది. పెట్రోలింగ్ పార్టీలు అటుగా చూడరనే విమర్శలున్నాయి. అయితే యాజమాన్యాలు ఇస్తున్న అమ్యామ్యాల మత్తులో పోలీసులు అటుగా కన్నెత్తి చూడరనే ఆరోపణలున్నాయి. దందాలు బహిర్గతమైనప్పుడు హడావుడి చేయడం.. నామమాత్రపు చర్యలతో మమ అనిపించడం.. అలవాటుగా మారిందనే విమర్శలున్నాయి. ప్రధానంగా కేయూ, హసన్‌పర్తి పరిసర ప్రాంతాల్లో ఇటీవల పలు నూతన లాడ్జీలు వెలుస్తున్నాయి. ఈ లాడ్జీలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారినట్లు తెలిసింది. వీటిపై పోలీసులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిచ్చినట్లు అవుతోంది.

కొన్ని ఘటనలు

- జూన్ 11వ తేదీన ఓఆర్ఆర్‌పై వెలిసిన ఒక లాడ్జిలో మహిళతో ఒక సీఐ అడ్డంగా దొరికిన విషయం బహిర్గతమైంది. ఈ సమయంలో పలు జంటలు ఆ లాడ్జిలో ఉన్నట్లు సమాచారం. సీఐని పట్టుకునే హడావుడిలో మిగతా రూముల్లో ఉన్నవారిపై దృష్టి సారించలేదు. ఈలోపు వారు పారిపోయినట్లు తెలిసింది. సదరు సీఐని పట్టుకున్నప్పటికీ అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.
- ఈనెల 6న ఓఆర్ఆర్ సమీపంలోని ఒక హోటల్‌లో తొమ్మిది మంది పేకాట ఆడు తూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబ డ్డారు. వీరి నుంచి రూ.1లక్ష 23వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబ డిన మొత్తాన్ని గమనిస్తే ఏ స్థాయిలో పేకాట ఆడుతున్నారో గమనించవచ్చు.
- ఓఆర్ఆర్‌పై ములుగు వెళ్లే దారిలో ఉన్న మరో హోటల్.. పేకాటకు, పంచా యితీలకు, ఇతరత్రా కార్యకలాపాలకు కేంద్రం మారినట్లు సమాచారం. ఈ హోటల్‌లో కొద్దిరోజుల కిందట పేకాట ఆడుతూ పలువురు పట్టుబడిన విషయం తెలిసిందే. వీరిలో సంపన్నులు ఉన్నట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వారిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.
- ఇక చింతగట్టు ప్రాంతంలో ఉన్న ఒక ఫామ్‌హౌస్‌లో ప్రతిపక్ష పార్టీకి చెందిన పలువురు పేకాట ఆడుతూ పట్టుబడి కోర్టులో జరిమానా కట్టిన విషయం తెలిసిందే.

సీపీ దృష్టి పెట్టాలి



వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నగరంలో నిత్యం తనిఖీలు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణపై చర్యలు చేపడుతున్నారు. అర్ధరాత్రిళ్లు రోడ్లపై తిరుగుతూ స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. అయితే నగరంలో జరిగే దందాలను అరికడుతున్న సీపీ.. శివారు ప్రాంతాల్లోని హోటళ్లలో జరిగే దందాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హోటళ్లపై దాడి చేయడం, ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టడంలాంటివి చేయాలి. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచితే తప్ప.. ఈ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడదు. ఇప్పటికైనా శివారు ప్రాంతాలు, ప్రధానంగా ఓఆర్ఆర్‌పై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.



మీడియాతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

రైతులందరికీ అమలు కాని రుణమాఫీ

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 13: రాష్ట్రంలోని అందరు రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో 40 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్రంలో 64 లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నారని, అయితే 49 లక్షల మంది రైతులే రుణమాఫీకి అర్హులని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీని ఒకేసారి చేస్తానని చెప్పి ఇప్పటికీ చేయలేదన్నారు. ఈ రెండు విడతల్లో సుమారు 18 లక్షల మంది రైతులకు రూ.12వేల కోట్ల పైన మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. మూడో విడతలో ఇంకో 4లక్షల మంది రైతులకు మరో 3నుంచి 4వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేస్తారని, అందరికీ చేయరన్నారు. సోనియాగాంధీ జన్మదినం డిసెంబర్ 9లోపు వరకే రుణాలకు వడ్డీ చెల్లిస్తామని, తదుపరి కాలానికి రైతులే వడ్డీ చెల్లించాలనడం హాస్యాస్పదంగా ఉందని ఈటల ఎద్దేవా చేశారు. మహిళలకు రూ.2500, వికలాంగులకు రూ.6000, పెన్షన్ రూ.4000, కౌలు రైతులు, పట్టారైతులకు ఏటా రూ.15,000, రూ.12000 ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేసీఆర్‌పై ఆగ్రహంతో కాంగ్రెస్‌ను గెలిపించుకుంటే రైతుల కళ్లలో మట్టి కొడుతున్నారని అన్నారు. రైతుల సమస్యపై బీజేపీ ఆధ్వర్యంలో గ్రామాల్లో రచ్చబండ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని, రైతుల సమస్యలన్నీ తెలుసుకున్నాక రైతు ఉద్యమాన్ని లేవనెత్తి ప్రభుత్వ మెడలు వంచుతామని ఈటల హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎంపీ సీతారాంనాయక్, రాష్ట్ర నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, కాశీప్రసాద్, కొండేటి శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

రైతులు రాజు కావాలనేదే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, ఆగస్టు 13: రైతు రాజు కావాలనేదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్, డీసీవో నాగేశ్వర్‌రావుతో కలిసి సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోదాంలోని స్టాక్‌ను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పీఏసీఎస్‌లోని రైతుల సంఖ్యతో పాటు పంట రుణాల వివరాలు, రుణమాఫీ, రైతులకు అందించే ఎరువులు, విత్తనాల ధరలతో పాటు అందించే సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి ఎల్లాపూర్ సొసైటీ కింద అనంతసాగర్‌లో కొనుగోలు చేసిన భూమి కబ్జాకు గురైందని తక్షణమే విచారణ జరిపి హసన్‌పర్తి సొసైటీలో విలీనమైన ఎల్లాపూర్ సొసైటీ భూమిని తిరిగి అప్పగించాలని కలెక్టర్‌ను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తక్షణమే తహసీల్దారు చల్ల ప్రసాద్‌ను పిలిచి విచారణ జరిపి పట్టాదారులపై

మిగతా 8వ పేజీలో..

హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలపాల్సిందే..

- విడదీయడంతో అస్థిత్వం కోల్పోతోంది..
- మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు
- వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణంపై చర్చ

కాజీపేట, ఆగస్టు 13: 'వరంగల్ నగరాన్ని ముక్కలు చేయడంతో అస్థిత్వం కోల్పోతోంది.. హనుమకొండ, వరంగల్ కేంద్రంగా వరంగల్ జిల్లాగా ఉంటేనే పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుంది.. ఇప్పటికైనా పాలకులు చొరవ తీసుకుని హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలపాలి' అని వరంగల్ మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు కోరారు. హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమానగర్ బాలవికాసలో మంగళవారం 'వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణం' అనే అంశం పై చర్చ కార్యక్రమం జరిగింది. నిర్వాహకుడు పింగిళి సంపత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.రాజేశ్వర్ రావు హాజరై మాట్లాడారు. ఆసియా ఖండంలోనే ప్రాధాన్యతను సంతరించుకున్న ఏనుమాముల మార్కెట్, అజంజాహి మిల్లు, ఎయిర్‌పోర్టుతో 1200 యేళ్ల చరిత్ర కలిగిన వరంగల్‌ను విడదీయడం బాధాకరం అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడం న్యాయమైన డిమాండ్ అన్నారు. జిల్లాల ఏకీకరణ కోసం తన వంతు కృషిచేస్తానని చెప్పారు.

అంతకుముందు ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ.. హైదరాబాద్ స్థాయిలో ఎదుగుదల ఉండి పెట్టుబడులకు ఆకర్షణీయంగా ఉండే వరంగల్‌ను విడదీయడం దారుణం అన్నారు. తుగ్లక్ కూడా ఇలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.



చర్చలో మాట్లాడుతున్న డాక్టర్ టి. రాజేశ్వర్ రావు, చిత్రంలో వెంకట నారాయణ, తదితరులు

నాటి పాలకులు జిల్లాలను విడదీసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రాజకీయ కుట్రే జిల్లాల విభజన అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపే విషయం ఎవరూ వ్యతిరేకించపోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరినీనిందించడం కన్నా, దీర్ఘకాలిక అభివృద్ధి కోసం ఆలోచించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ముందుకెళదామని తీర్మానించారు. తెలంగాణ ఉద్యమకారుడు జనార్దన్ మాట్లాడుతూ.. చవటలు, దద్దమ్మల్ల వల్లే ఈ విభజన జరిగిందన్నారు. అడ్డంకులు వస్తే కలిసికట్టుగా ఒక్కటై వరంగల్, హనుమకొండను ఏకం చెయ్యాలన్నారు. అనంతరం పిగిళి సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. కేవలం వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడమే ధ్యేయం అన్నారు.

అంతకుముందు రైల్వే కార్మిక నాయకులు కర్ర యాదవరెడ్డి, దేవులపల్లి రాఘవేందర్, సామాజిక వేత్త పెద్ది వెంకటనారాయణ, కొండ్ర నర్సింగరావు, న్యూడెమొక్రసీ నేత అప్పారావు, కాంగ్రెస్ నాయకులు రావుల సదానందం, ఎం.డి.అంకూస్, జర్నలిస్టులు, రిటైర్డ్ టీచర్లు, అడ్వకేట్‌లు, ప్రొఫెసర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వరంగల్, హను మకొండ జిల్లాలను కలపాల్సిందేనని, అందుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో సీఎంని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల్లో వేగం పెంచండి

- మేయర్ గుండు సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 13: వరంగల్ నగరంలో నిర్మాణం అవుతున్న ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారు లకు సూచించారు. మంగళవారం బల్దియా పోతననగర్ సమీపంలోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సివిల్ పనులను అక్కడి అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఈఈ శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ సిబ్బంది, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.


నాటు సారాపై ఉక్కుపాదం మోపండి..

- వరంగల్‌ను నాటు సారా రహిత జిల్లాగా మార్చండి
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి

వరంగల్ క్రైం, ఆగస్టు 13: పల్లెల్ని, తండాలను పట్టిపీడిస్తున్న నాటు సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వరంగల్‌లోని 17 ఎక్సైజ్ స్టేషన్‌ల సీఐలు, ఎస్ఐలు ఐదు జిల్లాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు. నాటు సారా నిర్మూలకు తీసుకుంటున్న చర్యలు, నమోదైన కేసులు, మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలను కమలాసన్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటు సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటు సారాకు వినియోగించే బెల్లం సరఫరాపై నిఘా పెట్టాలని, సరఫరా చేస్తున్న వ్యక్తులపై పీడీయాక్ట్ పెట్టి కోర్టు మెట్లు ఎక్కించాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి నిందితులకు కేసుల పడేలా చర్యలు చేపట్టాలన్నారు. నెలాఖరుకు వరంగల్‌ను నాటుసారా రహిత జిల్లాగా మార్చాలని ఆయన సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ. ఎక్సైజ్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని, నాటు సారా, గంజాయి ఇతర డ్రగ్స్ నిర్మూలను సమష్టిగా ముందుకు వెళతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్‌ను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మారు స్తామన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావుతోపాటు ఐదు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చాలని సీఎం నిర్ణయం

డ్రగ్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం విజయవంతానికి పోలీసులతో కలిసి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెలాఖరు నాటికి డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. జూన్ 15 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 75వేలకు పైగా కేసులు పెట్టినట్లు ఆయన తెలిపారు. నాటు సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించడంతోపాటు బెల్టుషాపులు నిర్వహించే వారిపై కేసులు పెడుతున్నట్లు కమలాసన్‌రెడ్డి వివరించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. డ్రగ్స్ ఫ్రీ వరంగల్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వల్ల జరిగే నష్టంపై అవగాహన కలిగించేందుకు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు సైతం వేస్తున్నట్లు ఆయన తెలిపారు. తాము చేస్తున్న ప్రయత్నానికి మీడియా, తల్లిదండ్రులు సహకరించాలని అంబర్ కిషోర్ ఝా సూచించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమలాసన్‌రెడ్డి

భేష్ బిట్టూ!

- పోలీసు జాగిలానికి ఘనంగా ఉద్యోగ విరమణ
- సేవలను కొనియాడిన సీపీ



వరంగల్ క్రైం, ఆగస్టు 13: 11 ఏళ్ల పాటు పోలీసు విభాగంలో సేవలందించిన బిట్టు (పోలీస్ జాగిలం)కు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిట్టును సీపీ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించి చేసిన సేవలను కొనియాడారు. 2013 డిసెంబర్ 26న కమిషనరేట్ జాగిలాల విభాగంలో చేరి బిట్టు పోలీస్‌శాఖకు సేవలందించింది. ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు ఇతర వీఐపీలు కమిషనరేట్ పరిధిలో పర్యటించినప్పుడు పేలుడు పదార్థాలు గుర్తించడంలో బిట్టు కీలకపాత్ర పోషించింది. బిట్టుకు హ్యాంగ్లర్‌గా కానిస్టేబుల్ ప్రభాకర్ వ్యవహరించాడు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో జాగిలం పాత్ర కీలకమన్నారు. పేలుడు పదార్థాలను గుర్తించడంతో పాటు మత్తు పదార్థాలు గుర్తించడంలోనూ జాగిలాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్‌ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, శ్రీధర్, చంద్రశేఖర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు అతిథిగా మంత్రి సురేఖ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13: హనుమకొండలోని పోలీస్ పరేడ్‌గ్రౌండులో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను మంత్రి చేతులమీదుగా అందజేస్తారు.

కోల్ రైల్‌కు సై!

ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కోల్‌రైల్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 1998 నుంచి భూపాలపల్లి కోల్‌బెల్ట్‌కు రైల్వే లైన్ నిర్మాణం చేయాలనే డిమాండ్ ఉంది. ఎట్టకేలకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ కోల్‌రైల్‌పై ప్రకటన చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు 207కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దీనికోసం డీపీఆర్‌లు సిద్ధం చేశారు. అటవీ శాఖ నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు లేకపోవటం కొంత జాప్యం జరుగుతోంది. అయితే రెండు మూడు నెలల్లో తుది అనుమతులు మంజూరు కానున్నాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

రామగుండం నుంచి మణుగూరు వరకు 207కి.మీ.ల రైల్వేలైన్ కోసం సుమారు రూ.4,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2013-14లో రామగుండం - మణుగూరు రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే చేయగా, 207కిలోమీటర్ల రైల్వేలైన్‌కు రూ.1,112కోట్లతో ఈ రైల్వే లైన్ నిర్మించవచ్చునని ప్రతిపాదన చేశారు. పదేళ్లలో ఈ అంచనా వ్యయం నాలుగు రేట్లు పెరిగింది. ఇక ఈ లైన్ పూర్తి అయితే భూపాలపల్లికి రైల్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీంతో బొగ్గు దిగుమతి, ఎగుమతికి కష్టాలు తప్పనున్నాయి. అలాగే రామగుడం నుంచి భూ పాలపల్లి మీదుగా మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణంతో థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా సులభం కానుంది. ప్రస్తుతం భూపాల పల్లిలోని కేటీపీపీకి బొగ్గును రామగుండం నుం చి రైల్ ద్వారా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్‌కు దిగుమతి చేసుకుంటున్నారు. ఉప్పల్ నుంచి 70కిలో మీటర్లు ప్రయాణించిన పరకాల మీదుగా కేటీపీపీకి బొగ్గును సరఫరా చేస్తున్నారు. దీంతో అధిక వ్యయంతో పాటు సమయానికి బొగ్గు కేటీపీపీకి చేరటం లేదు.

అలాగే ఈ రైల్వేలైన్ ఏరియాలోనే రామగుండం సమీపంలోని 2,600 మెగావాట్ల ఎన్‌టీపీసీ విద్యుత్ కేంద్రంతో పాటు 1,600 మెగావాట్ల తెలంగాణ ఎన్‌టీపీసీ ప్రాజెక్టు, అలాగే జైపూర్‌లోని జెన్‌కోకు చెందిన 6,200మెగావాట్లు, 11 మెగావాట్లు విద్యుత్ కేంద్రాలు భూపాలపల్లిలో ఉన్నాయి. మణుగూరు సమీపంలోని 1,200 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు కూడా రైల్‌మార్గం అందుబాటులో లేదు. ఈ లైన్‌తో బొగ్గు సరఫరా ఈ పరిశ్రమలకు సులభతరం కానుంది. అలాగే కొత్త రైల్వేలైన్‌తో పర్యాటక రంగానికి పండుగ కానుంది. రామగుడం నుంచి మణుగూరు వరకు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నింటినీ లింకు చేసుకుంటూ లైన్ నిర్మాణం చేయనున్నారు. ప్రధానంగా మంథని, కాళేశ్వరం, రామప్ప, మేడారం, లక్నవరం, ఏటూరునాగారం అభయారణ్యం, బొగత, మల్లూరు తదితర పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సమీపం నుంచి మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణం సాగనుంది. దీంతో ఈ రైల్వేలైన్‌తో పర్యాటకానికి కొత్త కళ రానుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

డోర్నకల్ టు మిర్యాలగూడ, గద్వాల

రైల్వేశాఖ ప్రకటించిన కొత్త ప్రాజెక్టుల్లో కీలకమైనది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేశారు. డోర్నకల్ నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లా ముదిగొండ, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, కోదాడ మీదుగా మిర్యాలగూడ చేరుతుంది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అనుసంధానమవుతుంది. దీంతో యాదాద్రి పవర్ ప్లాంట్ వరకు భూపాలపల్లి నుంచి బొగ్గును, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం నుంచి ధాన్యం, బియ్యం, గ్రానైట్ పరిశ్రమలకు, సిమెంట్ పరిశ్రమలకు సరుకులను రవాణా, షుగర్ ఫ్యాక్టరీల నుంచి చెక్కర సరఫరా చేసేందుకు మార్గం సుగమమవుతుంది.

అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగూళూరు లైన్‌ను అనుసంధానం చేస్తున్నారు. కీలకమైన రెండు మార్గాలను అనుసంధానంతో పాటు కొత్తగా రైల్వేలైన్ లేని ప్రాంతాలకు కూడా రైల్వే కనెక్టివిటీ జరుగుతుంది. ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే ఈ లైన్‌తో డోర్నకల్ జంక్షన్ మరింత కీలకంగా మారనుంది. వీటితో పాటు పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు 1,316కిలో మీటర్ల రైల్వే కనెక్టివిటీకి కేంద్ర రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఈప్రాజెక్టుకు సుమారు రూ.7,382కోట్లు ఖర్చు చేస్తుంది. భద్రాచలం వద్ద నిర్మించే కొత్త స్టేషన్‌తో వరంగల్ రైల్వేలైన్‌కు అనుసంధానం అవుతుంది. గిరిజనుల అధికంగా ఉండే ప్రాంతాల గుండా ఈ రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా బొగ్గు సరఫరాతో పాటు ప్రకృతి వైపరిత్యాల సందర్భాల్లో ప్రత్యామ్నాయం లైన్‌గా ఇది పని చేస్తుందని రైల్వేశాఖ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూర్చేవే కావటం విశేషం.

అటకెక్కిన కాజీపేట - భూపాలపల్లి లైన్

కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్‌కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వే శాఖ రూ.1,152కోట్ల నిధులు మంజూరు చేసింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రెండు కిలో మీరట్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే 2023-24లో నిధులు కేటాయించినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. దీంతో 2024-25 బడ్జెట్‌లో కాజీపేట- భూపాలపల్లి రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ రాలేదనే విమర్శలున్నాయి. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కాజీపేట-భూపాలపల్లి లైన్‌పై దృష్టి పెట్టి రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలని ఓరుగల్లువాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊసేలేని రైల్వే డివిజన్

కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రతీరోజు సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ ఆదాయం వచ్చే జంక్షన్‌లల్లో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా చేయటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి.

నేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య

మడికొండ, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికులకు అండగా ఉండి ఆదుకుంటోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం మడికొండలోని టెక్స్‌టైల్ పార్కులో సిడిబీ క్లస్టర్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ ఏజీఎం స్మృతివాజ్‌పేయి ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన లాంచ్ వర్క్‌షాప్ కమ్ అడాప్షన్ ఆఫ్ గ్రీన్ టెక్నాలజీ సెమినార్‌లో వరంగల్ ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొట్టచేతపట్టుకొని సూరత్, షోలాపూర్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సొంత రాష్ట్రంలో తమ తల రాతలు మారతాయని నమ్మి వచ్చిన నేత కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నేత కార్మికులకు సైతం తగిన న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. తన శక్తి మేరకు నేత కార్మికులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్‌లో మాట్లాడి జిల్లాకు వెల్‌నెస్ సెంటర్ తీసుకువచ్చానని తెలిపారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్కులో యూనిట్లు సక్రమంగా నడుస్తున్నాయని భావించానని, క్షేత్రస్థాయిలో నేత కార్మికుల పరిస్థితి వేరే విధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికులను నిర్లక్ష్యం చేసిందన్నారు. నేతకార్మికులు తనతో సమావేశమై తమ సమస్యలు పూర్తిగా తెలిపినట్లయితే వారిని మంత్రి కొండా సురేఖ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ పొదుపు, పరస్పర సహాయక సహకారం సంఘం అధ్యక్షుడు ఊరుకొండ శ్రీరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభించిన టెక్స్‌టైల్ పార్కులో 164 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి ప్రారంభించాయని, వాటికే లోన్లు వచ్చాయని, మిగతా 200యూనిట్లకు లోన్‌లు మంజూరు కాకపోవడంతో ఖాయిలా పడ్డాయన్నారు. వాటికి ప్రభుత్వం సబ్సిడీగానీ, విద్యుత్ సబ్సిడీ గానీ రానందున యూనిట్లు ఉత్పత్తి చేయడంలేదని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే స్కూల్ యూనిఫామ్‌లు, సింగరేణి వంటి సంస్థలకు ఇచ్చే యూనిఫామ్‌లకు చెందిన వస్త్రాలను నేసే పనిని తమకు ఇప్పించినట్లయితే నేత కార్మికులను ఆదుకున్నట్లవుతుందని తెలిపారు. ఈ మేరకు ఎంపీ, ఎమ్మెల్యే చొరవచూపి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దర్గా స్వామి, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కోశాధికారి ఆముదాల జ్యోతిభాస్కర్, డైరెక్టర్లు సదానందం, రాధిక తిరుపతి నేత కార్మికులు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలి

ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ విద్య డైరెక్టర్ శృతి ఓఝా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించిన ఇంటర్మీడియెట్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే వరంగల్‌లో తిరిగి ప్రారంభించాలని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయ భవనం సమకూరే వరకు ప్రస్తుతానికి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలని ఆమె ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఆర్జేడీ కార్యాలయం తరలింపునకు ముందు పనిచేసిన ఆర్జేడీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో పాటు అందరూ సిబ్బంది తిరిగి ఆర్జేడీ కార్యాలయంలో విధుల్లో చేరాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఆర్జేడీ కార్యాలయం తిరిగి వరంగల్‌లో ఏర్పాటు కానుండటంతో వివిధ అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ బృంద గీతాల పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 31న జాతీయ బృందగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుధీర్‌కుమార్, కె.సత్యానారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో 6 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి 6 నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22లోగా పోటీల కన్వీనర్ కమలమనోహర్ (9440604347)కు వివరాలను పంపించాల్సిందిగా వారు కోరారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో నిట్‌కు 21వ ర్యాంకు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) నిట్‌కు ఇంజనీరింగ్ కేటగిరిలో 21వ ర్యాంకు దక్కింది. సోమవారం సాయంత్రం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో నిట్‌కు ఓవరాల్ కేటగిరిలో 53వ ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ విభాగంలో 100వ ర్యాంకును పొందింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను క్షుణ్ణంగా విశ్లేషిస్తామని, మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు.



బంజారాల పండుగలకు ప్రభుత్వం పెద్ద పీట

వడ్డెపల్లి, ఆగస్టు 13: బంజారాల పండుగలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో సంత్‌సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే తీజ్ నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను మంగళవారం హనుమకొండ సుబేదారిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. తీజ్ నవరాత్రోత్సవాలను బంజారా సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంత్ సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం గోపాల్‌పూర్ అధ్యక్షుడు భానోతు జవహర్‌లాల్, ప్రధాన కార్యదర్శి ధారావత్ రాంచందర్ నాయక్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పావవత్ రామెల్ నాయక్, రాజారాం నాయక్, నవీన్‌నాయక్, జవహర్ నాయక్, కిష్యానాయక్, రాజు నాయక్, ధర్మా నాయక్, సర్వన్ నాయక్, శివరాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మడికొండ, ఆగస్టు 13: మడికొండలోని రైతు వేదిక భవనంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నర్మెట వెంకటరమణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బస్కె శ్రీలేఖక్రిష్ణ, నర్మెట వేణుగౌడ్, నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్ తదతరులు పాల్గొన్నారు

సాంకేతికం, ఉత్పాదకతలో స్థిరత్వం కీలకం

హసన్‌పర్తి, ఆగస్టు 13: వ్యవసాయంలో సాంకేతికం, ఉత్పాదకతలో స్థిరత్వం కీలకమని చండీఘడ్ ఫైండ్స్ మిస్టెక్ సీఈవో డాక్టర్ మనోజ్‌మనుజ అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ అధ్యాపకులు, విద్యార్థుల నోకోడ్ ఏఐ పేరుతో నిర్వహిస్తున్న మూడు రోజుల వర్క్‌షాప్ మంగళవారం రెండవ రోజు కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విస్తృతమైన కోడింగ్ నైపుణ్యాలు అవసరం లేకుండా వ్యవసాయంలో కృత్రిమ మేధస్సును వాడటమే ఈ వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. అనంతరం కళాశాల డీన్ భూపాల్‌రాజు మాట్లాడుతూ.. వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు, వ్యవసాయం యొక్క సామర్థ్యం, స్థిరత్వం, వ్యవసాయ దిగుబడిని పెంచి పెట్టుబడిని తగ్గిస్తుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ సాంకేతిక నిపుణుడు డాక్టర్ మనోజ్ మనుజ ఏఐ సాధనాలు, విజ్ఞానంతో వ్యవసాయ వృద్ధి విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన సిబ్బంది, వ్యవసాయ కోర్సుల విద్యార్థులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలి

హసన్‌పర్తి, ఆగస్టు 13: బడి ఈడు పిల్లలు బడిలో ఉండే విధంగా చూడాలని మండల విద్యాధికారి రవిందర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను కోరారు. 65వ డివిజన్ ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని, హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నైపుణ్యాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంట ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనం నడుపొద్దు



మాట్లాడుతున్న సత్యనారాయణ

వరంగల్ క్రైం, ఆగస్టు 13: కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మద్యం సేవించి వాహనదారులు వాహనాలు నడుపొద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సూచించారు. ట్రైసిటీస్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు కమిషనరేట్‌లో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇటీవల మద్యం సేవించి రోడ్డు ప్రమాదంలో మరణించిన వారిలో ఎక్కువగా నిరుపేదలున్నారని తెలిపారు. వీరి మరణంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడాన్ని కుటుంబ సభ్యులు వ్యతిరేకించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఐ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో యువత ముందుండాలి

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



ఎన్‌సీసీ క్యాడెట్లతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఇతర అధికారులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 13: దేశ రక్షణకు యువత క్రమశిక్షణతో ముందుకు రావాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సూచించారు. కేయూలో ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో సీఏటీసీ 6వ క్యాంపు జరుగుతోంది. ఈ సందర్భంగా క్యాంపు 9వ రోజు మంగళవారం కేయూ ఇండోర్ స్టేడియంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. దేశ రక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్లు పునాదిగా నిలుస్తారని చెప్పారు. యువతకు ప్రేరణగా ఎన్‌సీసీ నిలుస్తోందన్నారు. దేశభక్తిని, క్రమశిక్షణను ఎన్‌సీసీ యువతకు నేర్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

గ్రూప్ కమాండర్ కల్నల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాల్ స్మీలి మాట్లాడుతూ.. వరంగల్, ఖమ్మం ఎన్‌సీసీ యాక్టీవిటీస్‌ను తెలిపారు. ఏపీ, తెలంగాణ వాయుసేన క్యాంపు రాజస్థాన్‌కు బయలుదేరే ముందు ఈ క్యాంపులో శిక్షణను మామునూరు ఎరో డ్రమ్ముల ట్రైనింగ్ పొందుతారని, సీఏటీసీ-6లో ఎన్‌సీసీ సాంస్కృతిక డిల్లు బెస్ట్ యాడ్‌గా నిలుస్తోందని చెప్పారు. క్యాంపు చివరి రోజు ఎన్‌సీసీ క్యాడెట్లకు ధృవపత్రాలను అందచేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ కల్నర్ రామదురై, కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య, క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నర్ రవి సునారే, ఖమ్మం బెటాలియన్ కమాండింగ్ అధికారి డాక్టర్ మంజుల క్యాంపు అర్జెంట్ కెప్టెన్ డాక్టర్ పి.సతీశ్‌కుమార్, క్యాంపు క్వార్టర్ మాస్టర్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సుబేదార్ మేయర్ సుహాస్ కదం, లెఫ్టినెంట్ గణప్రశ్, సెకండ్ ఆఫీసర్ ప్రవీణ్, ఫస్ట్ ఆఫీసర్ కందార్ సందీప్‌రెడ్డి, బీహెచ్‌ఎం మానే ప్రదీప్, బాల్‌రెడ్డి, లెఫ్టినెంట్ సబిత, థర్డ్ ఆఫీసర్ శాంతి, జేసీవోలు సౌరస్య, కందం, ఏడుకొండలు, జీసీఐ సుజిత, జీసీఐ శీతల్‌పి. పీఐ స్టాఫ్, క్యాడెట్లు పాల్గొన్నారు. విజేతలకు వివిధ పోటీలు, క్రీడలు, బెస్ట్ ఫైరింగ్, ఉత్తమ క్యాడెట్లుకు ముఖ్యఅతిథులతో బహుమతులను అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జానపద సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి.

విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టాలి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ
- ఘనంగా మోషన్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేడీ లక్ష్మీనారాయణ, మోషన్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్

వడ్డెపల్లి, ఆగస్టు 13: విద్యార్థులు లక్ష్యంపై దృష్టిపెట్టాలని, సంకల్పం ఉంటే విజయం తథ్యమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ (జేడీ) లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో మోషన్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి అప్పులు తెచ్చి మంచి కళాశాలలో చేర్పించారని, దాన్ని విద్యార్థులు గుర్తించుకొని ఎప్పటికప్పుడు తమను తాము మెరుగు పర్చుకుంటూ మంచి ఫలితాలను సాధించాలని కోరారు. విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసేందుకు అనేక సాధనాలు మనకు అందుబాటులో ఉన్నాయని, వాటిలో ముఖ్యంగా మొబైల్‌ను రెండేళ్లపాటు పక్కకు పెట్టాలని సూచించారు. కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణు గోపాల్ మాట్లాడుతూ.. కష్టపడి విజయం సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు చిర్ర గణేష్, శరత్, పెరుమాండ్ల అనిల్, కాలేజీ కోటా అధ్యాపకులు అనూజ్‌కపూర్, సాయిల్ కత్వాల్, మోహన్ మంగళం, ప్రదీప్ పట్కార్, దమన్, అవినాష్, సురేందర్, కళాశాల సిబ్బంది మురళి, రమేష్, సాగర్, రాజు, శశి, శివ, అరుణ్, రవళి, అరుణ, శిల్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

హనుమకొండ టౌన్, ఆగస్టు 13: వివిధ కారణాల దృష్ట్యా సెల్ ఫోన్‌లను పోగొట్టుకున్న బాధితులకు హనుమకొండ పోలీసులు మంగళవారం సెల్‌ఫోన్స్ అందజేశారు. ప్రయాణాలతో పాటు పనిచేసే ప్రాంతాల్లో ఆదమరిచి పోగొట్టుకున్న సెల్‌ఫోన్స్‌ను బాధితుల ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గుర్తించి వివిధ రాష్ట్రాలలో ఉన్న సెల్‌ఫోన్స్‌ను తెప్పించారు. మంగళవారం బాధితులను హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ ఆరుగురి బాధితులకు సెల్‌ఫోన్స్ అందజేశారు. ఈసందర్భంగా పోయిన సెల్‌ఫోన్స్‌ను గుర్తించడంతో పాటు తిరిగి తెప్పించడంలో విశేష కృషిచేసిన హోంగార్డు పుప్పాల అశోక్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

రెడ్ క్రాస్‌లో రక్తదాన శిబిరం

సుబేదారి, ఆగస్టు 13 : యువతనేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని తలసేమియా చిన్నారుల కోసం హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, జిల్లా పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ భగీరథ్, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, పీఆర్‌వో శివ, నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, కన్నె రాజు, గుళ్లపెల్లి శివకుమార్, బొట్టు కమలాకర్, గజ్జెల సుమన్, ఉప్పరపెల్లి రాజ్‌కుమార్, ఊరటి రవికుమార్ పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

కాజీపేట, ఆగస్టు 13: కారు డ్రైవర్‌పై దాడిచేసిన ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట బస్టాండ్ సమీపంలోని జీపు అడ్డావద్ద మంగళవారం ఓ వ్యక్తి మూత్రవిసర్జన చేస్తుండగా అడ్డుకున్న కారుడ్రైవర్ పిండిరాజుపై దాడి చేశారు. అనంతరం మరో ఏడుగురు వ్యక్తులను పిలిపించి రాజుపై దాడి చేయడమే కాకుండా అక్కడే ఉన్న మూడుకార్ల అద్దాలు పగలకొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడిచేసిన హర్షిత్‌తోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

హనుమకొండ టౌన్, ఆగస్టు 13: హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తా, హనుమకొండ బస్టాండ్, అదాలత్ ఏరియాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 111 వాహనాలు సీజ్ చేయగా, త్రిబుల్ రైడింగ్, స్పీడ్ రైడింగ్‌లో 122 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్స్ నాగబాబు, రామకృష్ణ, హనుమకొండ లాఅండ్ ఆర్డర్ సీఐ వై.సతీష్, ఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పరు పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 13: ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా మొరం తవ్వి తరలిస్తున్న ఎక్స్‌కవేటర్. టిప్పర్‌ను పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మంగళవారం పట్టుకున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం ఐనవోలు సబ్‌స్టేషన్ సమీపంలో ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా ఎక్స్‌కవేటర్‌తో మొరం తవ్వి టిప్పర్ ద్వారా సమీపంలో డంపింగ్ చేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేని కారణంగా కేసు నమోదు చేసి టిప్పర్, ఎక్స్‌కవేటర్ స్వాధీనం చేసుకుని డంపింగ్ చేసిన 50 ట్రిప్పుల మొరంను సీజ్ చేసినట్లు ఎస్సై పి. శ్రీనివాస్, ఏఆర్‌ఐ రాణి తెలిపారు.

మెట్టుగుట్టపై ఘనంగా రాజశ్యామల యాగం



మెట్టుగుట్టపై రాజశ్యామల యాగం నిర్వహిస్తున్న ఎ.వి.వి.ఎ.ఎస్.ఎస్ ట్రస్టు చైర్మన్ మాడిశెట్టి రాజేష్ కుమార్ జ్ఞానేశ్వరి

మడికొండ, ఆగస్టు 13: మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మంగళవారం ఎ.వి.వి.ఎ.ఎస్.ఎస్ ట్రస్టు నిత్యాన్నదాన సత్రం చైర్మన్ మాడిశెట్టి రాజేష్ కుమార్ జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులు రాజశ్యామల యాగం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అభిలాష్‌శర్మ వేదమంత్రోశ్చరణతో యాగం జరుగగా భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని పూజలు చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంతో పాటు ఇంకా అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేయాలని ప్రజలు ఆయురారోగ్యాల తో ఉండాలనే సంకల్పంతో యాగం నిర్వహించినట్లు రాజేష్ తెలిపారు.

రైతులు రాజు కావాలనేదే ప్రభుత్వ లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఏసీఎస్‌లు రైతు సంక్షేమం కోసమే పనిచేయాలని, అందుకు కావాల్సిన పూర్తి సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రూ.1.78 కోట్ల పంట రుణాలను సొసైటీ ద్వారా 780 మంది రైతులు రుణం పొంది ఉంటే వారిలో మొదటి దశలో 144 మందికి రూ.31.35 లక్షలు, రెండోదఫా 120 మందికి రూ.31.78లక్షలు రుణమాఫీ అయిందన్నారు. కాగా, మిగిలిన 516 మందికి రూ.1.15లక్షల రుణమాఫీ కాని రైతుల వివరాల జాబితాను రూపొందించాలన్నారు. రుణమాఫీ పొందని వారి వివరాల జాబితాను సిద్ధం చేసి వాటి కారణాలను తెలుపుతూ జాబితాను రూపొందించి నివేదికను పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంరెడ్డి, డైరెక్టర్లు వీసం కర్ణాకర్‌రెడ్డి, నేదునూరి కుమారస్వామి, వెల్దండి రమేష్, నోడల్ అధికారులు సత్యనందం, మనోహర్‌రావు, సోమశేఖర్, సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, రైతులు ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఇన్‌చార్జి డీఈవో ఎ.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబరు 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3,50000 మించరాదని, కుల, ఆదాయ, వైకల్యం ఉంటే సంబంధిత ధృవపత్రాలను సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్‌కు సమర్పించాలని సూచించారు. www.bse.telangan.gov.in వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 13: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో ఎట్టకేలకు బదిలీలు జరిగాయి. డీఈల విభాగంలో రాజ్‌కుమార్, సారంగం, రవికిరణ్, శివానంద్‌లు ఉన్నారు. మరో ఇద్దరు డీఈలుకు స్థానచలనం కల్పించకుండా కీలక బాధ్యతల్లో ఉంచినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల కరీంనగర్ నుంచి జిల్లాకు వచ్చిన మహేందర్‌కు ఎలక్ట్రికల్, సాలిడ్ వెస్ట్ సెక్షన్లు అప్పగించారు. ఇంకా 16 మంది ఏఈలు, ఇద్దరు డీఎంలను కలుపుకుని 18 మంది డివిజన్‌లతో పాటు పలు శాఖలలో పని చేస్తారు. వీరిలో పది మందికి మాత్రమే బదిలీ చేస్తూ పలు శాఖలు కేటాయించగా, మరో ఆరుగురిని బదిలీ చేయయపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇద్దరు పురుష ఏఈలతో పాటు ఓ మహిళా ఏఈ శాఖలో రిక్రూట్‌మెంట్ జరిగిన ఏడేళ్లుగా ఒకేచోట పని చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ బదిలీలు పూర్తిగా అడ్డదారిలో జరిగాయని ఉన్నతాధికారులు మరోమారు పునరాలోచించి అందరికీ స్థానచలనం కల్పించాలని తోటి అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

బదిలీల్లో అక్రమాలు?

ఇంజనీరింగ్ శాఖలో జరిగిన బదిలీలలో పైరవీలు జోరుగా సాగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్లకు మించి ఒకే చోట పనిచేసిన వారిని గుర్తించి సీనియారిటీ ఆధారంగా బదిలీలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, నిబంధనలు ఉల్లంఘించి ఈ బదిలీలు జరిగినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరికి మాత్రమే బదిలీలు నిర్వహించడంపై మిగతా సిబ్బంది మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకున్న వారికి బదిలీలు జరగలేదని అంటున్నారు.

యువత మత్తుపదార్థాలకు లోనుకావొద్దు



మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

కాజీపేట, ఆగస్టు 13: యువత మత్తుపదార్థాలకు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీపీ అంబర్‌కిషోర్ ఝా అన్నారు. నిట్‌లో మంగళవారం మత్తు పదార్థాలు, ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీ హాజరై మాట్లాడారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్ నాశానం అవుతుందన్నారు. కొందరు మత్తుపదార్థాలు అమ్మకాలు జరుపుతూ యువతను మత్తులో దించుతున్నారన్నారు. ఇలాంటి వాటిపై యువత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంజాయి నియంత్రణపై డ్రగ్స్ కంట్రోల్ ఏర్పాటు చేశామని ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తే 87125 84473 కి సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, కాజీపేట ఏసీపీ తిరుమల్, నార్కోటిక్ విభాగం ఏసీపీ సైదులు, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుభుధి, ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి, నిట్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కాజీపేట ఏసీపీ కార్యాలయాన్ని సీపీ అంబర్‌కిషోర్ ఝా సందర్శించారు. నేరాల నియంత్రణపై పోలీసులు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు సీపీ పలు సూచనలు చేశారు.

కాజీపేట ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ

హనుమకొండ టౌన్: హంటర్‌రోడ్డులోని కాజీపేట ఏసీపీ కార్యాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా మంగళవారం సందర్శించారు. కాజీపేట సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పెండింగ్ కేసులపై అధికారులతో సీపీ చర్చించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ తిరుమల్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. కాగా సీపీకి ఏసీపీ తిరుమల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

హనుమకొండ టౌన్, ఆగస్టు 13: నయీంగనర్ పెద్దమోరీ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. నిర్ణీత సమయానికి బ్రిడ్జి అంబాటులోకి వచ్చే విధంగా పనులను వేగవంతం చేయాలన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో పాటు సైడ్‌కాల్వ పనులు, బ్రిడ్జి సుందరీకరణ పనులు ఏకకాలంలో పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. నిర్మాణ దశలో ప్రజలకు పాదాచార మార్గాన్ని అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ అబూబకర్, విజయ శ్రీ సయ్యద్ రజాలీ, స్మార్ట్‌సిటీ ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, బల్దియా ఈఈ రాజయ్య ఇరిగేషన్ డీఈఈ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

హసన్‌పర్తి, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే వేడుకల్లో ప్రతీ ఒక్కరు దేశ భక్తితో జాతీయ జెండాకు వందనం చేయాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి బస్టాండు మీదుగా విద్యార్థులతో ఊరేగింపుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండులో హసన్‌పర్తి ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్, సుజాత విద్యానికేతన్, శ్రీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు స్థానిక యువత ర్యాలీలో పాల్గొని జాతీయ గీతాన్ని ఆలపించి త్రివర్ణపతాకానికి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆకుతోట శాంతారాంకర్ల, అనుమాండ్ల విద్యాసాగర్, పాకల తిరుమలేశ్వర్‌రెడ్డి, గూడూరు లక్ష్మీనారాయణ, వలుస జ్ఞానేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు తాళ్లపెల్లి కుమారస్వామిగౌడ్, మారపల్లి రాంచంద్రారెడ్డి, మేకల హరిశంకర్, పిట్టల కుమారస్వామి, పెద్దమ్మ శ్రీనివాస్, పెద్దమ్మ నాగరాజు, రాజేశ్వర్‌రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

జూలైవాడ, ఆగస్టు 13: అపరిచితులతో జాగ్రత్తగా ఉంటూ ఏదైనా సమస్య వస్తే తప్పకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ ఫసియుద్దిన్ తెలిపారు. మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు జిల్లా మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో జూలైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ కళ్యాణి, ఎస్ఐ ఫసియుద్దిన్‌లు మాట్లాడుతూ.. ఆడ పిల్లల భద్రతా, లింగ సమానత్వం సున్నితత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉంటూ సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియా ఉపయోగాలు వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు, ఎలాంటి దురలవాట్లకు గురికావద్దని సూచించారు. పిల్లలకు ఏమైన సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులకు చెప్పడంతోపాటు టోల్‌ఫ్రీ నెంబర్లు 100, 181. 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భాగ్యలక్ష్మీ, కానిస్టేబుల్ రామారావు, హెడ్‌మాస్టర్ స్వర్ణలత, మానస, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారి, అసిస్టెంట్‌ను నియమించాలి

ఐనవోలు, ఆగస్టు 13 : ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారితోపాటు ఒక అసిస్టెంట్‌ను నియమించి రెవెన్యూ శాఖను బలోపేతం చేయాలని, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్(ట్రెంగ) జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామానికి రెవెన్యూ అధికారి ఉండేలా ప్రతిపాదనలు పంపించాలని కమిటీకి సూచించిన నేపథ్యంతో తమ అసోసియేషన్ నుంచి ప్రభుత్వానికి విన్నవించామన్నారు. గతంలో రెవెన్యూ అధికారులుగా పనిచేసిన వారిని 2020లో అప్పటి ప్రభుత్వం అన్నిశాఖలకు పంపించిందని వారిని మళ్లీ రెవెన్యూ శాఖకు తీసుకోవాలని వారితోపాటు సహాయకుడిని తీసుకుంటేనే రెవెన్యూశాఖ పటిష్టంగా మారుతుందన్నారు. ప్రభుత్వ భూములకు రక్షణతోపాటు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవలందిస్తారన్నారు. ప్రభుత్వం తమ సూచనలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ట్రెంగ కార్యదర్శి మేకల రమేష్, కోశాధికారి పి. దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతికి విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి సమాజ అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. సంఘం జెండాను ఎగురవేసిన అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో విద్యార్థులు ఉద్యమాలను నిర్మించాలని కోరారు. ధనప్రవాహంలో కొట్టుమిట్టాడుతున్న రాజకీయాలను ప్రక్షాళన చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఏఐఎస్ఎఫ్ పోరాడిందని, అనంతరం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలను నిర్వహించిందన్నారు. దేశానికి, రాష్ట్రాలకు ప్రధానులను, ముఖ్యమంత్రులను అందించిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర వర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణీత్‌గౌడ్, సంతోష్, ఉపాధ్యక్షులు చరణ్, కుమార్, సహాయకార్యదర్శి రవితేజ, కౌన్సిల్ సభ్యులు వినయ్, అజరుద్దీన్, కరిష్మా, కుషల్, సంతోషి, హని తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన డ్రైవర్‌కు సన్మానం

బాలసముద్రం, ఆగస్టు 13: వరంగల్-2డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న ఓ డ్రైవర్ విధి నిర్వాహణలో మానవత్వం చాటి సోమవారం ఓ ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన విషయం తెలిసిందే. మంగళవారం డ్రైవర్ డి. వెంకన్నను ఆర్టీసీ ఎం.డి సజ్జనార్ హైదరాబాద్‌లోని బస్సు భవన్‌కు పిలిపించి అధికారుల సమక్షంలో ఘనంగా డ్రైవర్ వెంకన్నను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, డిప్యూటీ రీజనల్ మేనేజర్ భానుకిరణ్, మాధవరావు, వరంగల్-2డిపో మేనేజర్ వి. జోత్స్న తదితరులు వెంకన్నను అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వడ్డెపల్లి, ఆగస్టు 13: హనుమకొండ 58వ డివిజన్ వడ్డెపల్లికి చెందిన తాళ్లపెల్లి ప్రవీణ్(40) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మృతుడి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు . ఆయన వెంట కాంగ్రెస్ 58వ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ జిల్లా నేతలు తాళ్లపెల్లి రవీందర్ (జేకే), తాళ్లపెల్లి విజయ్, తాళ్లపెల్లి మేరి, నల్ల లలితమ్మ, ఎమ్మీ ఆరీఫ్, తాళ్లపెల్లి చిన్న , గౌస్‌పాషా, కరుణాకర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 14 ఆగస్టు 2024

గురి చూసి బాణం కొడితే యాభై మీటర్ల దూరంలోని లక్ష్యాన్ని కొట్టాల్సిందే. పతకం పట్టాల్సిందే. ఆ ఆర్చరీ అథ్లెట్ పేరు వెన్నం జ్యోతి సురేఖ. మనదేశంలోనే విలువిద్యలో మేటి క్రీడాకారిణి అనేందుకు సాక్ష్యం... ఇప్పటి వరకూ ఆమె సాధించిన 62 జాతీయ, 61 అంతర్జాతీయ పతకాలే నిదర్శనం. త్వరలో కెనడా, మెక్సికో దేశాల్లో ప్రపంచ ఆర్చరీ పోటీల్లో పాల్గొనటానికి సిద్ధమవుతున్న క్రీడాకారిణి **జ్యోతి సురేఖ**ను 'నవ్య' పలకరించిందిలా...



సహనంతోనే సాధించా..

కృష్ణా జిల్లాలోని చల్లపల్లి గ్రామం మాది. అమ్మ పేరు శ్రీ దుర్గ, నాన్న పేరు సురేంద్ర కుమార్. నాన్న వ్యవసాయం చేస్తారు. మేము ఉండేది... నేను చదివింది విజయవాడలోనే. ఇక నేనొక్కదాన్నే కావటంతో అల్లారు ముద్దుగా పెంచారు. విభిన్నంగా ఆలోచించే మనస్తత్వం ఇద్దరిదీ. అందుకే మూడేళ్లప్పుడే స్విమ్మింగ్ క్లాసులో జాయిన్ చేశారు. అలా బాల్యంలో స్విమ్మింగ్ అంటే ఇష్టం పెంచుకున్నా. ఎంతంటే.. కేవలం నాలుగేళ్ల వయసులోనే ఏకంగా ఐదు కిలోమీటర్ల మేర కృష్ణా నదిలో ఈదాను. ఊహ తెలియని వయసులో చేసిన ఫీట్ అది. ఎన్నో ప్రశంసలు అందుకున్నా. 'యంగెస్ట్ స్విమ్మర్'గా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కాను. ఎందుకో తెలీదు కానీ.. మా పేరెంట్స్ విలువిద్యను నేర్చుకోమన్నారు. వారికి తెల్సినంతగా నా గురించి ఎవ్వరికీ తెలీదు కాబట్టి 'సరే' అన్నాను. వెంటనే స్విమ్మింగ్ వదిలేయటం బాధనిపించినా.. వదిలేశా. అలా పదకొండేళ్ల వయసులో(2007) ఆర్చరీలోకి వచ్చా.

అలా ఆత్మవిశ్వాసం..

ఆర్చరీలో జాయిన్ అవుతూనే కొత్తగా అనిపించింది. అది కాకుండా ఆ సమయంలో నేషనల్ స్విమ్మింగ్ పోటీ మిస్సయ్యాను. అయ్యో.. ఎందుకిలా చేశారని బాధపడ్డా.

> క్వాలిఫికేషన్ కోసం 720 పాయింట్స్ ఉంటాయి. అంటే 72 బాణాలు షూట్ చేయాలి. హైయస్ట్ పది పాయింట్స్ ఉంటాయి. తొమ్మిది, ఎనిమిది.. ఇలా పాయింట్స్‌ను లెక్కగడతారు. పాయింట్స్ బట్టి ర్యాంక్ ఇస్తారు. ఆ తర్వాత ఎలిమినేషన్ మ్యాచ్‌లు ఉంటాయి. పూల్‌గా డివైడ్ చేస్తారు. ఆ మ్యాచ్‌లో 15 బాణాలు సంధించాల్సి ఉంటుంది. ఎవరు ఎక్కువ స్కోరయితే వాళ్లు గెలుస్తారు. ఇదరి పాయింట్స్ సమానమైతే షూట్ ఆఫ్ ఉంటుంది. ఎవరి బాణమైతే సెంటర్‌కి క్లోజ్‌లో ఉంటుందో వారే విన్నర్ అవుతారు. ఖాళీగా ఉంటే పేరెంట్స్‌తో ఎక్కువ సమయం గడుపుతా. మంచి మ్యూజిక్ వింటా. ఫలానా సినిమా బావుంది అంటే చూస్తా. పజిల్ గేమ్స్ ఆడుతుంటా. ఖాళీగా ఉంటే ఇతర గేమ్స్ చూస్తుంటా. ఈసారి ఒలింపిక్స్ బాడ్మింటన్, షూటింగ్ విభాగాలను చూశా.

> నా కూతురు అని కాదు కానీ.. మేము ఊహించని గొప్ప విజయాలు సాధించింది. నాలుగేళ్ల వయసులోనే స్విమ్మింగ్‌లో లిమ్కా రికార్డు అందుకుంది. మేం గేమ్ మార్చినా.. ఫోకస్ మారలేదు. ఆర్చరీలో అద్భుతమైన విజయాలు సాధించింది. పట్టిన పట్టు వదలదు. దేశం తరపున సుదీర్ఘకాలం నుంచి విజయాల పరంపర కొనసాగిస్తోంది. ఒకే ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ అందుకున్న వాళ్లు లేరు! పతకాలు కొట్టి దేశం పేరు నిలబెడుతున్నా.. రావాల్సినంత గుర్తింపు మా అమ్మాయికి రాలేదనేది నా అభిప్రాయం.
>
> \- సురేంద్ర కుమార్, తండ్రి



అయితే ఆర్చరీలో సాధన చేసే కొద్దీ ఇష్టం పెరిగింది. ఈ గేమ్‌లో ఏకాగ్రత, భుజబలం ఉండాల్సిందే అని అర్థమైంది. స్విమ్మింగ్ వల్ల భుజబలం వచ్చింది. అది ఆర్చరీకి ఉపయోగపడింది. ఇక ఏకాగ్రత నాకు ఎక్కువే. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రాక్టీస్ చేసేదాన్ని. బాగా గుర్తుంది.. నేషనల్ గేమ్స్ విజయవాడలో జరుగుతాయని.. కొన్ని నెలల ముందే నా చేతికి విల్లు ఇచ్చారు. తొలి నేషనల్ గేమ్స్‌లోనే ఆరు బంగారు పతకాలు వచ్చాయి. ఎనిమిదో తరగతిలో మెక్సికో వెళ్లి ఆడాను. విద్య, విలువిద్యను బ్యాలెన్స్ చేసుకోవాలని పేరెంట్స్ చెప్పేవారు. అలానే చేశా. నలంద విద్యానికేతన్‌లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివా. పోటీలు ఉన్నప్పుడు ప్రాక్టీస్ చేసేదాన్ని. ప్రత్యేక క్లాసులు పెట్టించుకునేదాన్ని. అంతే కానీ చదువుల్లో వెనకపడలేదు. సాధన చేయటం.. గేమ్‌లో పతకాలు కొట్టడం.. అలా మెల్లమెల్లగా లాంగ్ రన్‌లో ఆర్చరీ అథ్లెట్‌గా నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అంతేకానీ ఓవర్‌నైట్‌లో ఏదీ రాలేదు. రాదు కూడా!

నామీద నాకే కోపం వచ్చేది..

కె.ఎల్. విశ్వవిద్యాలయం నుంచి బిటెక్, ఎంబీఏ చేశా. యూనివర్సిటీ యాజమాన్యం సపోర్టుగా నిలిచింది. ఏనాడూ ఇబ్బంది అవ్వలేదు చదువుకి. ట్యూషన్స్‌లో చదివి డిస్టింక్షన్ పాసయ్యాను. దాదాపు కాలేజీకి వెళ్లలేదు కాబట్టి విద్యార్థి జీవితం మిస్సయ్యాననే బాధ ఉంటుంది. అయితే చిన్నవయసులోనే దేశానికి ఆడగటం గొప్ప విషయమే అనిపిస్తుంది. గేమ్‌లోనే కాదు లైఫ్‌లోనూ స్ట్రగుల్స్ ఉంటాయి. అప్ అండ్ డౌన్స్ ఉండనే ఉంటాయి. వాటిని దాటుకుని ముందుకు వెళ్లాల్సిందే. కొందరు స్పోర్ట్స్ చాలా సులువు అనుకుంటారు. కష్టపడితే కానీ.. తెలీదు. ఏదీ సులువుగా రాదు. కొన్నిసార్లు బాగా ఆడినప్పటికీ మెడల్స్ రావట్లేదని బాధపడేదాన్ని. నామీద నాకే కోపం వచ్చేది. ఆ సమయంలో పేరెంట్స్ 'నువ్వు చేసే పని చేయి.. తప్పకుండా వస్తాయి మెడల్స్' అనేవారు. నాలో ధైర్యాన్ని నింపారు. ఆర్చరీ ఆటతో ఎంతో సహనం నేర్చుకున్నా.

అదే నా కల...

అమెరికా, యూరప్, చైనా, థాయ్‌లాండ్, టర్కీ, మెక్సికో, దక్షిణ కొరియా... లాంటి దేశాల్లో ఎక్కువగా పోటీలు జరుగుతాయి. 2007 నుంచి 26 జాతీయ, 57 అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నా. సక్సెస్ కంటే ఫెయిల్యూర్ ఇష్టం నాకు. మెడల్ వస్తే రెండు రోజులు సంతోషమే. ఫెయిల్యూర్ వస్తే సక్సెస్ అయ్యేంతవరకూ నాతోనే ఉంటుంది. గతేడాది చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో మూడు బంగారు పతకాలు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన వరల్డ్ కప్ పోటీల్లో మూడు బంగారు పతకాలు వచ్చాయి. నిల్చిపోయే విజయాలివి. గతంలో కంటే ఇప్పుడు వసతులు బావున్నాయి. కేంద్ర ప్రభుత్వం బాగా సపోర్టు చేస్తోంది. ఇప్పుడు ఆర్చరీలోకి అమ్మాయిలు బాగానే వస్తున్నారు. పదిహేడేళ్ల అదితి సీనియర్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో ఇండివిడ్యువల్‌గా గోల్డ్ కొట్టింది. ఇదో మంచి పరిణామం. అర్జున అవార్డు గ్రహీతను. స్పోర్ట్స్ కోటాలో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చింది. త్వరలో పోస్టింగ్ ఇవ్వనుంది ప్రభుత్వం. ఇకపోతే.. పదిహేడేళ్లు వెనక్కి తిరిగి చూసుకుంటే.. ఆర్చరీలో ఇంత సాధించానా? అనిపిస్తుంది. అమ్మానాన్న తీసుకున్న నిర్ణయమే సరైనదని అర్థమైంది. లేకుంటే ఇవాళ ఈ స్టేజ్‌లో ఉండేదాన్ని కాదేమో! ఇకపోతే ఇప్పటి వరకూ ఇన్ని పతకాలొచ్చాయి అని లెక్కపెట్టుకోను. ఎందుకంటే సాధించిన పతకాలు చెబుతూ కూర్చోలేం. ఆ ఆలోచనలు వదిలేస్తా. ఇక్కడ ఎప్పటికప్పుడు సాధన చేస్తూ.. ఫిట్‌నెస్, ప్రతిభను ప్రూవ్ చేసుకుంటేనే నిలబడగలం. ఇకపోతే దాదాపు ప్రతి టోర్నమెంట్‌లో పతకాలు ఉన్నాయి. వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో ఇండివిడ్యువల్ గోల్డ్ లేదు. దీంతో పాటు వరల్డ్ కప్ ఫైనల్ ఇండివిడ్యువల్‌గా గోల్డ్ మెడల్ లేదు. ఆ రెండింటినీ సంపాదించాలన్నదే నా కల."

• రాళ్లపల్లి రాజావలి

బ్యూటీ

హెయిర్ మాస్క్



వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు తోడ్పడే హెయిర్ మాస్కులను ఉపయోగిస్తూ ఉండాలి. వీటిని ఇంట్లోనే తయారుచేసుకునే వీలుంది. శిరోజాల సౌందర్యానికి తోడ్పడే ఆ మాస్కులు ఇవే!

పొడిజుట్టు కోసం:

- ఐదు చెంచాల సెనగపిండి, పెరుగు, రెండు పెద్ద చెంచాల ఆలివ్ ఆయిల్ కలుపుకోవాలి.
- ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు పట్టించాలి.
- 20 నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేసేయాలి.
- కండిషనర్ వాడడం మర్చిపోకూడదు.
- సెనగపిండి కుదుళ్లను బలపరిస్తే, ఆలివ్ ఆయిల్, పెరుగు జుట్టుకు మెరుపును అందిస్తాయి. జుట్టు పట్టుకుచ్చులా మెత్తగా తయారవుతుంది.

సాధారణ వెంట్రుకలు

- రెండు పెద్ద చెంచాల సెనగపిండి, బాదం పొడిలను గిన్నెలో కలుపుకోవాలి.
- దీనికి కొంత పెరుగు కూడా కలుపుకోవచ్చు.
- ఈ మిశ్రమాన్ని కదుళ్లు, వెంట్రుకలకు పట్టించాలి.
- 30 నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేసేయాలి.

జిడ్డు వెంట్రుకలు

- రెండు పెద్ద చెంచాల సెనగపిండి, మెంతులు, కొబ్బరిపాలలో నానబెట్టాలి.
- ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టించి మర్దన చేయాలి.
- అరగంట తర్వాత తలస్నానం చేసేయాలి.

పొడైన వెంట్రుకలు

- ఒక మగ్గిన అరటిపండును గుజ్జుగా చేసుకోవాలి.
- దీన్లో నాలుగు చెంచాల కొబ్బరినూనె, ఒక చెంచా గ్లిజరిన్, రెండు చెంచాల తేనె చేర్చి కలపాలి.
- ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, అరగంట తర్వాత తలస్నానం చేసేయాలి.
- ఇలా వారానికి ఒకసారి చొప్పున క్రమం తప్పకుండా రెండు నెలలపాటు చేస్తే పొడయిన వెంట్రుకలు బాగవుతాయి.

జీవం కోల్పోయిన వెంట్రుకలు

- కలబంద గుజ్జు రెండు పెద్ద చెంచాలు తీసుకోవాలి.
- దీనికి రెండు పెద్ద చెంచాల సిలికాన్ లేని కండిషనర్‌ను కలపాలి.
- ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు పూసుకుని, పెద్ద దంతాలు ఉన్న దువ్వెనతో వెంట్రుకలు అన్నింటికీ అంటుకునేలా దువ్వాలి.
- 20 నిమిషాల తర్వాత తలస్నానం చేసేయాలి.



'ఈ'తరం

"మా అబ్బాయికి ఇంకా ఆరు నెలలు రాలేదు. అప్పుడే ఫోన్లో కార్టూన్లు చూసేస్తున్నాడు. వీడియోలు మార్చడం కూడా తెలిసిపోయింది..."- ఇది చాలామంది తల్లితండ్రుల మురిపెం. "చదువు పూర్తిగా పక్కన పెట్టేశాడు. ఎవర్నీ కలవడు. ఎవరితోనూ మాట్లాడడు. రాత్రీ పగలూ స్మార్ట్ ఫోనే ప్రపంచం. తిండి మీద ధ్యాసలేదు. ఎప్పుడు నిద్రపోతున్నాడో కూడా తెలీదు"... - ఇది మరికొందరు తల్లితండ్రుల ఆవేదన. మొదట్లో ముచ్చటగా అనిపించినది కొన్నేళ్ళు గడిచేసరికి ఆందోళనగా మారుతోంది. ప్రస్తుత సమాజంలో ప్రతిచోటా కనిపిస్తున్న ఈ ధోరణుల గురించి తన తాజా పుస్తకం 'ఐ పేరెంట్: ఎంబ్రాసింగ్ పేరెంటింగ్ ఇన్ ది డిజిటల్ ఏజ్'లో చర్చించారు రచయిత్రి, కాలమిస్ట్ **నేహా జె.హీరానందాని.** ఆ వివరాలు ఆమె మాటల్లోనే:

పేరెంట్స్ కోసం...

"రచనకు... ఆ మాట కొస్తే సృజనాత్మకమైన ఏ పనికైనా ఏదో ఒక ప్రేరణ ఉంటుంది. 'ఐ పేరెంట్' రాయడానికి నాకు ప్రేరణ నేను ఊహించని విధంగా... మా అమ్మాయి జోయా నుంచి దొరికింది. ఆమె స్కూల్ వాళ్ళు ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చరిత్ర సృష్టించిన ఒక గొప్ప పాత్రలా దుస్తులు ధరించి రావాలని పిల్లలకు సూచించారు. "మహాత్మా గాంధీ, మదర్ థెరిసాలా చాలా మంది తయారై వస్తారేమో? నువ్వేం చేద్దామనుకుంటున్నావ్?" అని జోయాను అడిగాను. నా ఆలోచనల్లో మహాత్ముడు, థెరిసా చరిత్రను రూపుదిద్దిన వ్యక్తులు. కానీ "అదేం కాదమ్మా! చాలా మంది 'మిస్టర్ బీస్ట్'లా దుస్తులు వేసుకొని వస్తారు" అంది జోయా. కొంతసేపు నాకు నోట మాట రాలేదు. ఆ తరువాత ఆలోచించాను. మన పిల్లలది ఒక కొత్త ప్రపంచం. మనకు సమాంతరంగా ఉన్న మరో విశ్వంలో వాళ్ళు జీవిస్తున్నారు. వాళ్ళకు ఆసక్తి కలిగించే, స్ఫూర్తిని అందించే అంశాలు పూర్తిగా భిన్నమైనవి. వారి గురించీ, వారి పెంపకం గురించి చర్చిస్తూ ఒక పుస్తకం రాయాలనుకున్నాను. అదే 'ఐ పేరెంట్'.

వారిది మరో ప్రపంచం...

మానవ చరిత్రలో ఇంటర్‌నెట్ స్థాయిలో ప్రభావం చూపించిన అంశం మరొకటి లేదనేది నా అభిప్రాయం. అంతర్జాతీయ స్థాయిలో ఒక పెద్ద ప్రయోగానికి మనమందరం సాధనాలుగా మారిపోయాం. కుప్పలుతెప్పలుగా సమాచారాన్ని కుమ్మరిస్తూ... సవాళ్ళు విసిరి, గందరగోళానికి గురి చేస్తున్న డిజిటల్ ప్రపంచంలో పిల్లల పెంపకం సులభం కాదు. మనకు అంతగా అవగాహన లేని ఒక ప్రపంచంతో మమేకమైపోయిన పిల్లలకు మార్గదర్శకత్వం వహించడం తల్లితండ్రులకు సవాల్‌గా నిలుస్తోంది. పిల్లలకు తామే ప్రపంచం అని తల్లితండ్రులు భావిస్తారు. ఆన్‌లైన్‌లోనే జీవిస్తున్న ఈ 'జెనరేషన్ జెడ్' (1990ల చివరి నుంచి 2010ల తొలినాళ్ళ మధ్య పుట్టినవారి) విషయంలో అది నిజం కాదు. వాస్తవానికి వాళ్ళు తమదైన ప్రపంచంలో ఉన్నారు. అది ఎలాంటి సరిహద్దులూ లేని క్రీడామైదానం లాంటిది. వాళ్ళ స్నేహాలు, ఘర్షణలు, ప్రేమలు... ఇలా అన్నీ దానితోనే ముడిపడుతున్నాయి. అంటే పెద్దల ప్రపంచం ఒకటైతే... ఆన్‌లైన్‌లో జీవిస్తూ, అక్కడే నేర్చుకుంటూ, దాన్నే శ్వాసిస్తున్న పిల్లల ప్రపంచం మరొకటి. ఈ రెండు ప్రపంచాలనూ కలపాలన్నదే నా ప్రయత్నం.

> నేహా కాలమిస్ట్, రచయిత్రి. అమెరికాలోని మసాచుసెట్స్ వెల్లస్లీ కాలేజీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఆంగ్ల సాహిత్యంలో ఆనర్స్ డిగ్రీ, హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఎడ్యుకేషన్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నారు. 'యునిసెఫ్'తో కొన్నాళ్ళు పని చేసిన తరువాత.. ఆర్థిక, సామాజిక అంశాలపై హఫింగ్టన్ పోస్ట్, వోగ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రముఖ పత్రికల్లో కాలమ్స్ రాశారు. పిల్లల కోసం 'ది పద్మాస్' పేరిట 50 మంది 'పద్మ పురస్కార గ్రహీతల' జీవిత పరిచయాలతో పుస్తకాన్ని వెలువరించారు. స్ఫూర్తిదాయకులైన 50 మంది భారతీయ మహిళలపై 'గర్ల్ పవర్: విమెన్ హూ బ్రోక్ ది రూల్స్' అనే పుస్తకం రాశారు. చదవడం, రాయడం, కొత్త ప్రదేశాలను సందర్శించడం... ఇవీ ఆమె ప్రధానమైన అభిరుచులు. దాదాపు ఇరవయ్యేళ్ళ నుంచి వివిధ సామాజిక అంశాలపైనా, లింగ సమానత్వంపైనా వివిధ రచనల ద్వారా తన గళాన్ని వినిపిస్తున్నారు.

సౌకర్యం... వ్యసనం కూడా!

ఇప్పటి పిల్లలు ఒక చేత్తో స్మార్ట్ ఫోన్‌తో, మరో చేత్తో ట్యాబ్లెట్‌తో పుడుతున్నారు. వారిలో చాలామందికి నడవడం రాకముందే ఒక పరికరం చేతికి వస్తోంది. దాన్ని క్లిక్ చెయ్యడం, స్క్రోల్ చెయ్యడం లాంటివి అన్నప్రాసనకన్నా ముందే వాళ్ళు నేర్చుకుంటున్నారు. మొదటి మాట నోటి నుంచి రాకముందే... ఆ పరికరాన్ని ఎలా వాడాలనేది వాళ్ళకు పూర్తిగా తెలిసిపోతోంది. దీనికి బాధ్యత పూర్తిగా తల్లితండ్రులదే. పెద్దల విషయానికొస్తే... ఒక సగటు వ్యక్తి గంటకు కనీసం 12 సార్లు తన ఫోన్‌ను చెక్ చేస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. స్మార్ట్ ఫోన్ చేతిలో లేని జీవితాన్ని మనం ఊహించలేం. అవి వార్తలను అందిస్తున్నాయి, మనల్ని సమాజంతో అనుసంధానిస్తున్నాయి, వినోదాన్ని పంచుతున్నాయి, విద్యా సంబంధమైనవి తెలియజేస్తున్నాయి. మరోవైపు పోర్న్‌పోర్టల్స్‌గా దుష్ప్రభావాలనూ కలిగిస్తున్నాయి. ఒకే ఒక పరికరం ఉంటే చాలు... ఇవన్నీ సాధ్యమవుతున్నాయి. ఇది ఇదివరకూ ఎన్నడూ ఊహకైన అందని గొప్ప సౌకర్యం. అదే సమయంలో పెద్ద వ్యసనం కూడా. ఈ వ్యసనం మానసిక వైకల్యాలకు కారణమవుతోంది. పెద్దలే ఈ సుడిగుండంలో పడి మునిగిపోతున్నప్పుడు... మానసిక పరిపక్వత లేని పిల్లల పరిస్థితి ఏమిటి?

మొదటి గ్లోబల్ జనరేషన్...

నా పుస్తకం పిల్లల డిజిటల్ అడిక్షన్ గురించి చర్చించడానికి మాత్రం కాదు. 'ఆ పిల్లలతో ఎలా వ్యవహరించాలి? వాళ్ళను ఎలా అర్థం చేసుకోవాలి? అవసరమైనప్పుడు వాళ్ళకు ఎలా అండగా నిలవాలి?' అనే అంశాలను ప్రధానంగా చర్చించాను. అందుకే ఇదంతా డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం గురించి కాబట్టి నా పుస్తకానికి 'ఐ పేరెంట్' అని పేరు పెట్టాను. తల్లితండ్రుల మీద కూడా డిజిటల్ ప్రభావం ఎక్కువగానే ఉంది. ఉదాహరణకు... ఇంగ్లండ్‌కో, బ్రిటన్‌కో చెందిన వాళ్ళెవరో... 'చిన్న పిల్లలకు పెట్టే ఆహారంలో నెయ్యి ఉండాలా? వద్దా?' అనేది వాళ్ళ పరిజ్ఞానం మేరకు రాస్తారు. మన దేశంలో దాన్ని చదివిన తల్లితండ్రుల్లో ఏవో అనుమానాలు మొదలవుతాయి. జీవితంలోని ప్రతి విషయంలోకి టెక్నాలజీ చొచ్చుకువచ్చేస్తున్నప్పుడు... ఒకే విధమైన ఆనందాలే కాదు, ఒకే రకమైన సమస్యలు కూడా వచ్చి పడుతున్నాయి. సైబర్ వేధింపులు, సోషల్ మీడియాను అతిగా ఉపయోగించడం, గేమ్స్‌కు బానిసలు కావడం... పిల్లల మీద తల్లితండ్రుల నుంచి వినిపిస్తున్న ప్రధానమైన ఫిర్యాదులు. అంతేకాదు... పిల్లల పట్ల అతి ప్రేమ, శ్రుతిమించిన గారాబం వల్ల కూడా పెంపకం కష్టమవుతోంది. ప్రతి తరానికి తనదైన కలలుంటాయి. అయితే 'జనరేషన్ జెడ్' అద్భుతమైన తరం. వాళ్ళది మొట్టమొదటి గ్లోబల్ జనరేషన్. తమ సరిహద్దులను దాటి వాళ్ళు చూస్తున్నారు, ప్రపంచం పరస్పరం ఎలా అనుసంధానం అవుతోందో, ఒక ప్రాంతానికో, దేశానికో సంబంధించిన సమస్య ప్రపంచ సమస్యగా ఎలా మారుతుందో గ్రహిస్తున్నారు. వాళ్ళకు ఎన్నో విషయాల గురించి అవగాహన ఉంది. టీనేజీలోకైనా ఇంకా ప్రవేశించని పిల్లలు వాతావరణ మార్పుల మీద ప్రపంచవ్యాప్తంగా ఎలా ఉద్యమిస్తున్నారో మనం చూస్తున్నాం. అదే సమయంలో... వేరొకరితో ఎక్కువగా పోల్చుకోవడానికి, అవాంఛనీయమైన పోటీకి కూడా సాంకేతికత దారి తీస్తోంది. అది ఈ తరాన్ని అపరిమితమైన ఒత్తిడికి, మానసికమైన దుర్బలత్వానికి గురిచేస్తోంది. ఈ పరిణామాలన్నిటినీ నా పుస్తకంలో చర్చించాను. తల్లితండ్రులకు నేను చిట్కా వైద్యం లాంటి పరిష్కారాలేవీ నేను చెప్పలేదు. డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం గురించి ఆరోగ్యకరమైన చర్చ ప్రారంభించాలన్నదే నా ఉద్దేశం."

ఫ్యాషన్



భలే భుజోడి

హుందాగా, సంప్రదాయంగా కనిపించే చీరల్లో 'భుజోడి' హ్యాండ్‌లూమ్ శారీస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బెంగాలీ కాటన్ చీరలను మరిపించే భుజోడి చీరలు మృదువుగా, సౌకర్యంగా హాయిగొలిపే లేత రంగుల్లో తయారవుతూ ఉంటాయి. అన్ని కాలాలకూ తగిన భుజోడి చీరల గురించి తెలుసుకుందామా!

నాణ్యమైన నూలుతో...

గుజరాత్, కచ్ ప్రాంతంలోని భుజోడి గ్రామంలో సంప్రదాయ భుజోడి హ్యాండ్‌లూమ్ చీరల మూలాలున్నాయి. అత్యంత నాణ్యమైన నూలుతో కూడిన క్లిష్టమైన డిజైన్ల వల్ల భుజోడి చీరలు మహిళలతో పాటు ఫ్యాషన్ డిజైనర్లను సైతం ఆకట్టుకుంటున్నాయి. గుజరాత్‌లోని భుజ్ నగరానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న భుజోడి గ్రామంలోని కళాకారుల మగ్గాలు వడికే ప్రతి చీరలో, శాలువాలో, ఘాగ్రాలో, దుప్పట్లలో 500 ఏళ్ల నాటి చరిత్ర ప్రతిఫలిస్తూ ఉంటుంది.

వేర్వేరు సందర్భాల్లో....

ఆఫీస్ వేర్‌గా భుజోడి చీరలను నిరభ్యంతరంగా ఎంచుకోవచ్చు. రోజంతా చీరకట్టులో గడపడం అసౌకర్యంగా భావించే మహిళలు సైతం ఈ చీరలను నిస్సంకోచంగా ఎంచుకోవచ్చు. తేలికగా, మెత్తగా ఉంటాయి కాబట్టి రోజంతా చీరకట్టులో ఉన్నా చికాకు అనిపించదు. కలర్‌ఫుల్‌గా కనిపించాలంటే, ఆకర్షణీయమైన మోటిఫ్స్, డిజైన్లను కలిగి ఉండే చీరలను ఎంచుకుంటే సరిపోతుంది. ఈవినింగ్ వేర్‌గా కూడా ఈ చీరలు బాగుంటాయి. క్లాసీ లుక్ కోసం కలంకారీ పనితనమున్న స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఎంచుకోవాలి.

అన్ని కాలాలకూ తగ్గట్టుగా

కాటన్ చీరలు అనగానే వాటి మెయింటేనెన్స్ కష్టమని అనుకుంటాం. కానీ భుజోడి చీరలు అందుకు పూర్తి భిన్నం. బెంగాలీ కాటన్ చీరల్లా వీటికి గంజితో పని ఉండదు. మెత్తగా, ఒంటికి హత్తుకుని హాయిగొలుపుతాయి. పైగా వేసవిలో చల్లదనాన్నీ, శీతాకాలంలో వెచ్చదనాన్ని అందిస్తాయి. కాబట్టి అన్ని కాలాలకూ అనువైన భుజోడి చీరలను మరో ఆలోచన లేకుండా కొనుగోలు చేయొచ్చు. ఈ చీరల తయారీలో సహజసిద్ధ రంగులను ఉపయోగిస్తారు కాబట్టి వెలిసిపోతాయనే భయం కూడా ఉండదు. కలంకారీ బ్లౌజ్, మెటల్ జ్యువెలరీలతో మ్యాచ్ చేస్తే, భుజోడి చీరల్లో స్టైలిష్‌గా కనిపిస్తాం. ప్రత్యేకమైన లుక్ కోసం జామెట్రిక్ మోటిఫ్స్ డిజైన్ చీరలను ఎంచుకోవాలి.

నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 14 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

షారూఖ్‌ను దాటిన పాపులారిటీ



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా విడుదల చేసిన ఈ వారం అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సెలబ్రిటీ జాబితాలో హీరోయిన్ శోభితా దూళిపాళ్ల పలువురు అగ్ర తారలను వెనక్కునెట్టి, రెండో స్థానం దక్కించుకున్నారు. షారూఖ్‌ఖాన్ ఆమె తర్వాతి స్థానంలో నిలిచారు. శార్వరీ అగ్రస్థానంలో నిలవగా, జాన్వీకపూర్ ఐదో స్థానంలో నిలిచారు. ఇటీవలే నాగచైతన్యతో శోభిత నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో నెటిజన్లు ఆమె గురించి తెలుసుకునేందుకు ఎక్కువగా సెర్చ్ చేశారు.

'మిస్టర్ బచ్చన్'ను గుర్తుంచుకుంటారు



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీరు కొత్త రవితేజను చూస్తారు. ఇందులోని ప్రేమకథ, పాటలు, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో ఇరగదీస్తుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇది థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించే సినిమా. అనుకున్నదానికంటే బాగా వచ్చింది. దానిక్కారణం ఆయనంక బోస్ విజువల్స్, మిక్కీ.జే.మేయర్ సంగీతం. ఈ సినిమాకు రిపీట్ ఆడియెన్స్ ఉంటారు" అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. "ఇది రవితేజతో నా మూడో సినిమా. ఈ సినిమాలో ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుంది" అని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు.



తిరుమలేశుడి సేవలో జాన్వీకపూర్

ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ యాక్టర్ జాన్వీ కపూర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె తన స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీదేవి జీవించి ఉండగా ఏటా తన పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేవారు. జాన్వీకపూర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)



సక్సెస్‌ను సెలబ్రేట్ చేద్దాం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ "సరిపోదా... చిత్రంతో ప్రేక్షకులకు మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. మన సినిమా సక్సెస్‌ను థియేటర్లలో సెలబ్రేట్ చేద్దాం' అన్నారు. ఎస్. జే సూర్య మాట్లాడుతూ 'నాని గారి పాత్ర ఈ సినిమాలో ప్రతి శనివారం చేసే పనులు 'బాషా' చిత్రాన్ని గుర్తుకు తెస్తాయి' అన్నారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని డీవీవీ దానయ్య చెప్పారు.

క్లుప్తంగా...

ధైర్యాన్ని నింపింది



నటుడిగా తొలి చిత్రం 'అలనాటి రామచంద్రుడు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో నడుస్తోంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మీడియాతో ముచ్చటించారు. "నా తొలి సినిమాకే ఇంతటి ప్రేక్షకాదరణ దక్కడం చాలా సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఓ స్వచ్ఛమైన ప్రేమకథను థియేటర్లలో చూశామని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ విజయం టీమ్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది" అని చెప్పారు.

ఐదు జంటల ప్రేమకథ



ఎం.ఎస్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఈనెల 29న విడుదలవుతోంది. హీరో ఆకాశ్ జగన్నాథ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఐదు ప్రేమ జంటల మధ్య సాగే అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు చెప్పారు. శృతి శంకర్, వి హారిక, అభిలాష్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అరమాన్. సినిమాటోగ్రఫీ: ఎస్. ప్రసాద్.

గురుదక్షిణగా రూ. 300



ఖరీదైన బహుమతులే అవ్వాల్సిన పనిలేదు... మనసు అంతరాళలో నుంచి పొంగిపొర్లే ప్రేమను వ్యక్త పరిచేందుకు ఇచ్చే బహుమతులు చిన్నవే అయినా వాటి విలువ అమూల్యమే. సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ తను గురువుగా భావించే మహేశ్‌భట్‌కు కూడా ఇలాంటి బహుమతినే అందించి, ఆశ్చర్యపరిచారు. ఇటీవలే ముంబైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మహేశ్‌భట్, అనుపమ్‌ఖేర్ వేదికను పంచుకున్నారు. తన సినీ ప్రయాణం గురించి వేదికపైన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు అనుపమ్‌ఖేర్. 'ఎవరైనా నా బయోపిక్ తీస్తే అందులో భట్ సాబ్‌ది ముఖ్యమైన పాత్ర అవుతుంద'ని ఆయన అన్నారు. అలా చెబుతూ వెంటనే తన జేబులో నుంచి రూ. 300 తీసి మహేశ్‌భట్‌కు అందజేసి, గురుదక్షిణగా స్వీకరించాలని కోరారు. మహేశ్‌భట్ ఆ నోట్లను సంతోషంగా స్వీకరించడమే గాకుండా వాటిని వేదికపైనుంచి అందరికీ చూపించి, జాగ్రత్తగా తన జేబులో దాచుకున్నారు. అనుపమ్‌ఖేర్ సినీ జీవితాన్ని మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్'. నటుడిగా ఆయనకు గొప్ప పేరు తెచ్చి కెరీర్‌లో నిలదొక్కుకునేలా చేసింది. 1984లో వచ్చిన ఈ చిత్రానికి మహేశ్‌భట్ దర్శకత్వం వహించారు.

సవాలుతో కూడుకున్న విషయం



తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న తమిళ సంగీత దర్శకుల్లో జి.వి.ప్రకాశ్ ఒకరు. ఆయన సంగీతం అందించిన లేటెస్ట్ చిత్రం 'తంగలాన్'. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇలాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కు సంగీతం అందించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలకు పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ చాన్స్ మిస్స్ చేసుకోవాలనుకోలేదు. ఒక సంగీత దర్శకుడిగా ఈ సినిమాకు పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సినిమాకు ఎలాంటి సంగీతం అందించాలనే విషయమ్మై చాలా పరిశోధన చేశాను. దర్శకుడు పా.రంజిత్ విజన్ చాలా బాగుంటుంది. థియేటర్లలో పూనకాలు తెప్పించే సన్నివేశాలు సినిమాలో చాలా ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన పాటలకి మంచి స్పందన వస్తోంది" అని చెప్పారు.

డేట్ మార్చడమే 'స్త్రీ 2'కి కలిసొచ్చిందా?



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం రెండు హిందీ చిత్రాలు విడుదలవుతున్నాయి. అవేమిటంటే.. అక్షయ్‌కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే', జాన్ అబ్రహం ప్రధాన పాత్ర పోషించిన 'వేదా'. వీటి కంటే ఒక రోజు ముందే రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ 2' రిలీజ్ అవుతోంది. ఈ మూడు చిత్రాల్లో మొదటి నుంచీ 'స్త్రీ 2' చిత్రం మీద ఎవరికీ అంచనాలు లేవు. దీనికి ప్రధాన కారణం హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు నాలుగేళ్లుగా సరైన హిట్ లేకపోవడం. అలాగే హీరో రాజ్‌కుమార్ రావుకు ఈ ఏడాది విడుదలవుతున్న మూడో సినిమా ఇది. అతనికి కూడా ఓహో అనిపించే హిట్ పడకపోవడం మరో కారణం. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ' చిత్రం 2018లో విడుదలై సూపర్ హిట్ అయింది. అప్పట్లోనే ఈ హారర్ కామెడీ రూ వంద కోట్లు వసూలు చేసింది. సాధారణంగా సీక్వెల్ అనగానే భారీ అంచనాలు ఉండడం సహజం. కానీ 'స్త్రీ' సీక్వెల్‌కు అంత క్రేజ్ రాకపోవడం గమనార్హం. మొదట ఈ సినిమాను కూడా గురువారమే విడుదల చేయాలనుకున్నారు. అప్పటికే రెండు భారీ చిత్రాలు పోటీలో ఉండడంతో భారీ ఓపెనింగ్స్ వస్తే గొప్పే అని అనుకున్నారు .కానీ అనూహ్యంగా గురువారం కు బదులు బుధవారమే సినిమాను విడుదల చేయాలని చివరి క్షణంలో నిర్ణయం తీసుకోవడం 'స్త్రీ 2'కు కలసి వచ్చిందని ట్రేడ్ పండితులు అంటున్నారు. సోలో రిలీజ్ కావడంతో మొదటి రోజే రూ పది కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని ఓ అంచనా. టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ జోరు చూస్తుంటే అంత మొత్తం వసూలు చేయడం ఈజీయే అని ట్రేడ్ పండితులు పేర్కొంటున్నారు. చిన్న చిత్రాల్లో 'గదర్ 2' చిత్రానిదే ఇప్పటివరకూ రికార్డ్. ఆ సినిమా తొలి వారం రూ 40.10 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడున్న అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్‌ను పరిశీలిస్తే 'స్త్రీ 2' దానిని అధిగమించి, రూ 50 కోట్లు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ 'స్త్రీ 2' చిత్రానికి సంబంధించి 2.21 లక్షల టికెట్లు అడ్వాన్స్‌గా బుక్ అయ్యాయి. దీని వల్ల రూ. 6.87 కోట్లు వసూలు అయ్యాయి. మహారాష్ట్ర, ఢిల్లీ సర్క్యూట్స్ లోనే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. ఓపెనింగ్ రోజు థియేటర్ల దగ్గర అమ్మకాలు ఉంటాయి కనుక రూ పది కోట్లు వసూలు చయడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. అదే నిజమై 'స్త్రీ 2' తొలి వారం రూ 50 కోట్లు వసూలు చేస్తే హారర్ కామెడీ చిత్రాల్లో ఇదే హయ్యెస్ట్ రికార్డ్ అవుతుంది. ఈ అంకెలు ఎంతవరకూ నిజమవుతాయో కొన్ని గంటల్లో తేలిపోతుంది కనుక వేచి చూద్దాం.

నిమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ



హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- బీఎస్సీ (నర్సింగ్), బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్), బీపీటీ(బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

బీఎస్సీ నర్సింగ్: ఈ ప్రోగ్రామ్‌ను మహిళలకు ఉద్దేశించారు. వివాహితులు కూడా అర్హులే. ఇందులో మొత్తం 100 సీట్లు ఉన్నాయి.

బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్): కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులోనే ఏడాది ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఈ ప్రోగ్రామ్‌లో 11 స్పెషలైజేషన్లు, 100 సీట్లు ఉన్నాయి. అనెస్తీషియా టెక్నాలజీ 10, డయాలసిస్ థెరపీ టెక్నాలజీ 20, కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ 12, ఎమర్జెన్సీ అండ్ ట్రామా కేర్ టెక్నాలజీ 8, రేడియోగ్రఫీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ 10, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ 12, న్యూరో టెక్నాలజీ 6, పెర్‌ఫ్యూజన్ టెక్నాలజీ 4, రేడియేషన్ థెరపీ టెక్నాలజీ 4, రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ 10, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ 4 సీట్లు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్ సమయంలో సంస్థ నిబంధనల ప్రకారం స్టయిపెండ్ చెల్లిస్తారు.

బీపీటీ(బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ): కోర్సు వ్యవధి నాలుగున్నరేళ్లు. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. ఇందులో మొత్తం 50 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.2500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 27
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/E6YVAGలో చదవండి.

దిక్సూచి

మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్ల స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org

ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిటర్లకు ఊరట

100% డిపాజిట్లు వెనక్కి తీసుకునే అవకాశం

2025 జనవరి 1 నుంచి అమల్లోకి.. ఆర్‌బీఐ ఆదేశాలు



ముంబై: అత్యవసర పరిస్థితుల్లో తమ డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలనుకునే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల డిపాజిటర్లకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద ఊరట కల్పించింది. ఈ డిపాజిట్లను ఆమోదించిన మూడు నెలల్లోపు, అత్యవసర వైద్య కారణాలతో డిపాజిటర్ల నుంచి ఉపసంహరణ విజ్ఞప్తి అందితే ఎన్‌బీఎఫ్‌సీలు వారి డిపాజిట్లను వడ్డీ లేకుండా పూర్తి (100 శాతం)గా వెనక్కి ఇవ్వాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని తెలిపింది. భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) మార్గదర్శకాల్లో పేర్కొన్న అత్యవసర వైద్య పరిస్థితుల నిర్వచనాన్ని ఎన్‌బీఎఫ్‌సీలు ఇందుకు పరిగణనలోకి తీసుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

ఇతర ఖర్చులు: అత్యవసర వైద్య ఖర్చులతో పాటు ప్రభుత్వం పేర్కొనే ప్రకృతి వైపరీత్యాలతో ఏర్పడే ఖర్చులకూ ఇదే సూత్రం వర్తిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. డిపాజిట్లను ఆమోదించిన మూడు నెలల్లోపు అత్యవసరేతర కారణాలతో డిపాజిటర్లు తమ డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని కోరినా.. ఎన్‌బీఎఫ్‌సీలు ఆ విజ్ఞప్తిని ఆమోదించాలి. కాకపోతే అప్పుడు డిపాజిట్ మొత్తంలో సగాన్ని మాత్రమే వడ్డీ లేకుండా చెల్లిస్తారు. ఈ అసలులో సగం లేదా రూ.5 లక్షలు, ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తారు.

హెచ్‌ఎఫ్‌సీలకు కొత్త నిబంధనలు

దీనికి తోడు ప్రజల నుంచి డిపాజిట్లు ఆమోదించే గృహ ఫైనాన్స్ కంపెనీ (హెచ్‌ఎఫ్‌సీ)లకు సంబంధించీ ఆర్‌బీఐ కొత్త నిబంధనలు జారీ చేసింది. ఈ సంస్థలు ఇక తమ మొత్తం డిపాజిట్లలో 13 శాతానికి బదులు 15 శాతం మొత్తాన్ని నగదు రూపంలో ఉంచుకోవాలని కోరింది. దీనికి తోడు ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లకు సమానమైన ఆస్తుల మొత్తాన్ని హెచ్‌ఎఫ్‌సీలు ఎల్లవేళలా కవరేజీగా ఉంచుకోవాలని స్పష్టం చేసింది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల నుంచి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ రేటింగ్ పొందకుండా హెచ్‌ఎఫ్‌సీలు కొత్త డిపాజిట్లు సేకరించడం గానీ, ఉన్న డిపాజిట్లను పునరుద్ధరించడంగానీ చేయకూడదని ఆంక్షలు విధించింది.

రూ.4.5 లక్షల కోట్లు ఫట్

- సెన్సెక్స్ 693 పాయింట్లు డౌన్
- 79,000 దిగువ స్థాయికి సూచీ
- నిఫ్టీ 208 పాయింట్లు పతనం

10లో 7 అదానీ షేర్లకు నష్టం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 692.89 పాయింట్లు కోల్పోయి 78,956.03 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 208 పాయింట్లు క్షీణించి 24,139 వద్ద స్థిరపడింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐటీసీ వంటి బ్లూచిప్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణతో పాటు చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలు మార్కెట్ నష్టాలకు కారణమయ్యాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. ఉదయం తొలి గంట ట్రేడింగ్‌లో స్వల్ప లాభ, నష్టాల మధ్య ఊగిసలాడిన స్టాక్ సూచీలకు ఆ తర్వాత నష్టాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. దాంతో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.52 లక్షల కోట్లు తగ్గి రూ.445.30 లక్షల కోట్లకు (5.30 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.46 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, టాటా స్టీల్స్ రెండు శాతానికి పైగా నష్టపోయాయి. హిండెన్‌బర్గ్ ఆరోపణల ప్రభావంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ట్రేడయ్యాయి. గ్రూప్‌లోని 10 కంపెనీల్లో 7 స్వల్పంగా నష్టపోగా.. అదానీ టోటల్ గ్యాస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మాత్రం పాజిటివ్‌గా ముగిశాయి.



యూనికామర్స్ బంపర్ లిస్టింగ్

సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన యూనికామర్స్ ఈసొల్యూషన్స్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. గతవారంలో ఐపీఓను ముగించుకున్న కంపెనీ.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఇష్యూ ధర రూ.108తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 112.96 శాతం ప్రీమియంతో రూ.230 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 137.17 శాతం వృద్ధితో రూ.256.15 వరకు ఎగబాకిన షేరు ధర.. మధ్యాహ్నం నుంచి మళ్లీ తగ్గుతూ వచ్చింది. తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి 94.49 శాతం లాభంతో రూ.210.05 వద్ద స్థిరపడింది.

ఫస్ట్‌క్రై లిస్టింగూ హిట్టే..

ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ సైతం లిస్టింగ్ రోజున భారీగా లాభపడింది. ఇష్యూ ధర రూ.465తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 34.40 శాతం ప్రీమియంతో రూ.625 వద్ద లిస్టయింది. ఒకదశలో 52 శాతం వృద్ధితో రూ.707.05 వద్దకు ఎగబాకినప్పటికీ, చివరికి 45.86 శాతం లాభంతో రూ.678.25 వద్ద ముగిసింది.

అపోలో హాస్పిటల్స్ లాభంలో 83% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 83 శాతం వృద్ధితో రూ.305 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.167 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.4,418 కోట్ల నుంచి రూ.5,086 కోట్లకు పెరిగింది. హాస్పిటల్స్‌కు చెందిన అన్ని వ్యాపార విభాగాలు అద్భుతమైన పనితీరును కనబరచటంతో ప్రోత్సాహకర ఫలితాలను నమోదు చేసినట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. త్రైమాసిక కాలంలో హెల్త్‌కేర్ సర్వీసెస్ రెవెన్యూ రూ.2,637 కోట్లుగా ఉండగా అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ ఆదాయం రూ.366 కోట్లు, అపోలో హెల్త్ కంపెనీ రెవెన్యూలు రూ.2,082 కోట్లుగా ఉన్నాయి.

తగ్గిన రెయిన్‌బో హాస్పిటల్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ (ఆర్‌సీఎంఎల్).. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.330.20 కోట్ల ఆదాయంపై రూ.39.73 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 15 శాతం పెరగగా లాభం మాత్రం 4.2 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో 280 పడకల సామర్థ్యం గల మూడు కొత్త హాస్పిటల్స్‌ను ప్రారంభించటం కలిసివచ్చిందని పేర్కొంది. కాగా రాజమండ్రిలో వంద పడకల సామర్థ్యం గల రీజినల్ హబ్ హాస్పిటల్‌తో పాటు బెంగళూరులోని హెన్నూర్‌లో 60 పడకలతో ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికల్లా అందుబాటులోకి రానున్నాయని రెయిన్‌బో హాస్పిటల్స్ తెలిపింది. అలాగే తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్ 24 నెలల్లో అందుబాటులోకి రానుందని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,620 ▲	65,650 ▲	88,500 ▲
ముంబై	70,444 ▲	64,527 ▲	80,702 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	486
వరంగల్	457	గోదావరి	486
చిత్తూరు	493	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	82	విజయవాడ	90
వరంగల్	82	గుంటూరు	90
కరీంనగర్	82	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	82	చిత్తూరు	99
కర్నూలు	82	నెల్లూరు	99
విశాఖపట్నం	86	అనంతపురం	90
గోదావరి	90		

హీరో మోటోకార్ప్ లాభం రూ.1,032 కోట్లు

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో హీరో మోటోకార్ప్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 47 శాతం వృద్ధి చెంది రూ.1,032 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.701 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.8,851 కోట్ల నుంచి రూ.10,211 కోట్లకు పెరిగింది. ఒక త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ రూ.10,000 కోట్ల మార్కును చేరుకోవటం ఇదే మొదటిసారి. కాగా త్రైమాసిక కాలంలో అమ్మకాలు మెరుగ్గా ఉండటం కలిసివచ్చిందని పేర్కొంది.

జపాన్‌కు మేడిన్ ఇండియా ఫ్రాంక్స్

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) దేశీయంగా ఉత్పత్తి చేసిన ఎస్‌యూవీ ఫ్రాంక్స్ కారును జపాన్‌కు తొలిసారిగా ఎగుమతి చేసింది. 1,600 కార్లతో తొలి కన్‌సైన్‌మెంట్ గుజరాత్‌లోని పిపవావ్ పోర్టు నుంచి జపాన్‌కు బయలుదేరింది. మారుతి సుజుకీ తన వాహన శ్రేణి నుంచి జపాన్ మార్కెట్లో ప్రవేశపెడుతున్న తొలి ఎస్‌యూవీ ఇది. కాగా బాలెనో తర్వాత జపాన్‌కు సరఫరా చేస్తున్న రెండో కారు. ఈ ఏడాది చివరిలో ఫ్రాంక్స్‌ను జపాన్ మార్కెట్లో ప్రవేశపెడతారు.

దీర్ఘకాలానికి మన మార్కెట్లు భేష్

యూనియన్ ఎంఎఫ్ సీఈఓ మధు నాయర్

20 నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): యూనియన్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) ఈ నెల 20న కొత్త మ్యూచువల్ ఫండ్ పథకాన్ని ప్రారంభిస్తోంది. మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ పేరుతో ప్రారంభించే ఈ పథకం నిధుల్లో 60 నుంచి 85 శాతం మార్కెట్ పరిస్థితులను బట్టి ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టనున్నట్లు యూనియన్ ఎంఎఫ్ సీఈఓ మధు నాయర్ చెప్పారు. మిగతా నిధులను పెద్దగా నష్టభయం (రిస్క్) లేని బంగారం, వెండి ఈటీఎఫ్‌లు, రుణ పత్రాల్లో మదుపు చేస్తామన్నారు. ఈ పెట్టుబడి వ్యూహంతో మల్టీ అసెట్స్ అలోకేషన్ ఫండ్ ద్వారా మదుపరులు మంచి రాబడులు పొందే అవకాశం ఉంటుందన్నారు. సెప్టెంబరు 3 వరకు సబ్‌స్క్రిప్షన్స్ స్వీకరించే ఈ పథకం ద్వారా రూ.1,000 కోట్లకుపైగా సమీకరించాలని యూనియన్ ఎంఎఫ్ భావిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం యూనియన్ యాక్టివ్ మూమెంటమ్ ఫండ్ పేరుతో మరో కొత్త పథకాన్ని ప్రారంభించే యోచన ఉందన్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఇప్పటికే సెబీకి సమర్పించినట్టు చెప్పారు.

పసిడి భవిష్యత్ భేష్: అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తే పసిడి ధర మరింత పెరిగే అవకాశం ఉందని నాయర్ చెప్పారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలూ ఇందుకు దోహదం చేస్తాయన్నారు. వచ్చే ఐదేళ్లలో పసిడి మదుపరులకు మంచి లాభాలు పంచే అవకాశం పుష్కలంగా ఉందన్నారు. కాగా దేశీయ స్టాక్ మార్కెట్ విలువలు.. ప్రస్తుతం కొద్దిగా అతిగానే కనిపిస్తున్నట్టు నాయర్ చెప్పారు. దీర్ఘకాలానికి చూస్తే మాత్రం మన స్టాక్ మార్కెట్‌కు ఎలాంటి ఢోకా లేదన్నారు. వేగంగా పెరుగుతున్న జీడీపీ వృద్ధి రేటు, వ్యక్తిగత ఆదాయాలు ఇందుకు దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుతం ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశం వచ్చే మూడు నాలుగేళ్లలో మూడో స్థానానికి ఎదగనున్న విషయాన్ని నాయర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

తెలుగు రాష్ట్రాలు కీలకం: తమ నిధుల సమీకరణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలది అత్యంత కీలక పాత్ర అని నాయర్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరం తెలంగాణ నుంచి సమీకరించిన నిధులు, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 76 శాతం పెరిగినట్టు చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికి రూ.16,500 కోట్లుగా ఉన్న తమ పథకాల ఆస్తుల విలువ (ఏయూఎం) ఈ ఆర్థిక సంవత్సరం చివరికి రూ.25,000 కోట్లు అధిగమించే అవకాశం ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా యూనియన్ ఎంఎఫ్ నిధుల సమీకరణ వృద్ధి రేటు యాభై శాతానికి పైగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇది పరిశ్రమ వృద్ధి రేటు కంటే రెట్టింపని నాయర్ తెలిపారు.

ఆ ఫండ్స్ మా దేశానివి కావు: మారిషస్

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ పేర్కొన్న ఐపీఈ ప్లస్ ఫండ్, ఐపీఈ ప్లస్ ఫండ్-1 తమ దేశానివి కావని మారిషస్ ప్రకటించింది. ఫైనాన్షియల్ సర్వీసెస్ కమిషన్ ఆఫ్ మారిషస్ (ఎఫ్ఎస్‌సీఎం) మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సెబీలో చేరక ముందు గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీతో కలిసి మారిషస్‌లో నమోదైన ఈ రెండు ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎస్‌సీఎం ఈ ప్రకటన విడుదల చేయడం విశేషం. ఇతర దేశాలకు చెందిన వ్యక్తులు, సంస్థలు తమ దేశంలో డొల్ల కంపెనీలు ఏర్పాటు చేయడానికి తమ చట్టాలు కూడా ఒప్పుకోవని ఎఫ్ఎస్‌సీఎం తెలిపింది. ఈ ఫండ్స్ ఏర్పాటుకు తాము ఎలాంటి అనుమతులు కూడా ఇవ్వలేదని స్పష్టం చేసింది.

స్పోర్ట్స్

వినేశ్ పిటిషన్‌పై తీర్పు మళ్లీ వాయిదా

ఈనెల 16న నిర్ణయం



న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు రజత పతకం దక్కేనా? లేదా? అనే ఉత్కంఠతో సోమవారం భారత క్రీడాభిమానులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూశారు. ముందుగా ప్రకటించిన సమయం ప్రకారం రాత్రి 9.30 గంటలకు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) ఎలాంటి తీర్పునివ్వబోతోందోనన్న ఆత్రుత అందరిలోనూ కనిపించింది. కానీ తీరా ఆ సమయానికి తుది తీర్పు మరోసారి వాయిదా పడిందన్న నిర్ణయం రావడంతో అంతా ఉసూరుమన్నారు. తాజాగా ఈనెల 16న వినేశ్ అనర్హత విషయమై కాస్ తుది తీర్పునివ్వబోతోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే వాదనలు పూర్తయినప్పటికీ నిర్ణయం వెల్లడించేందుకు మాత్రం ఆలస్యమవుతోంది. పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ మహిళల 50కేజీ విభాగం ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. కానీ సరిగ్గా పోటీలకు ముందు తన బరువు 100 గ్రాములు ఎక్కువగా ఉండడంతో డిస్‌క్వాలిఫై కావడం అందరినీ షాక్‌కు గురిచేసింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం కావడంతో పాటు భారత ఒలింపిక్ సంఘం కూడా వెంటనే ఈ విషయాన్ని కాస్‌లో అప్పీల్ చేసింది. వినేశ్‌కు కనీసం రజతమైనా ఇవ్వాలనే డిమాండ్ వినిపించింది. అయితే తన పిటిషన్‌పై గేమ్స్ ముగింపు రోజు 11న తీర్పు వస్తుందని ఆశించినా.. అది సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుత నిర్ణయంతో మరో రెండ్రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ కాస్ తీసుకునే నిర్ణయం వినేశ్‌కు అనుకూలంగా వస్తే భారత్ ఖాతాలో రెండో రజతం చేరుతుంది.



రూ.10 కోట్ల నజరానాతో పాటు వాహనం

నదీమ్‌కు ఆల్టో కారు, గేదె

లాహోర్: పాకిస్థాన్ బల్లెం వీరుడు, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్‌ను స్థానిక రాష్ట్ర ప్రభుత్వం సన్మానించింది. మంగళవారం పాక్‌లోని పంజాబ్ రాష్ట్ర సీఎం మరియం నవాజ్ షరీఫ్ స్వయంగా నదీమ్ స్వగ్రామం ఖనేవాల్‌కు వెళ్లి, అతడిని అభినందించారు. పాక్ కరెన్సీలో రూ.10 కోట్ల నగదు బహుమతితో పాటు హోండా సివిక్ కారును నదీమ్‌కు ప్రదానం చేశారు. అంతేకాక ఈ వాహనానికి 92.97 నెంబర్‌ను కేటాయించారు. నదీమ్ ఒలింపిక్స్‌లో జావెలిన్‌ను 92.97 మీటర్ల దూరం విసిరిన సంగతి తెలిసిందే.

అల్లుడూ..ఇదిగో గిఫ్ట్ : నదీమ్‌కు ఒక పక్క కార్లు, నగదు పురస్కారాలు వచ్చి పడుతుంటే తన మామ మహ్మద్ నవాజ్ గేదెను బహుమతిగా ఇచ్చి ఆశ్చర్యపరిచాడు. నదీమ్ స్వగ్రామమైన ఖనేవాల్ పరిసర ప్రాంతాల్లో గేదెలను కలిగి ఉండడం గౌరవమట.

ఆల్టో కారు బహుమతిపై ట్రోలింగ్..

నదీమ్ సాధించిన ఒలింపిక్ పతకానికి మెచ్చి పాకిస్థాన్‌కు చెందిన అమెరికా వ్యాపారవేత్త అలీ షేఖానీ అతడికి మారుతిసుజుకి ఆల్టో కారును ఇస్తానని ప్రకటించాడు. ఈ కారు పాక్ కరెన్సీలో రూ.23 లక్షలుగా ఉంది. 'అతడికి బీఎండబ్ల్యూ, ఆడీ వంటి కార్లను ఇవ్వాలి కానీ ఇలాంటి చిన్నకార్లు ఇచ్చి అవమానించొద్దు' అని సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ జరుగుతోంది.



రొటీన్‌కు భిన్నంగా ఓపెన్ ఆడిటోరియంలో మొదలైన పారిస్ ఒలింపిక్స్.. ఆసాంతం అలరించాయి. ఇక, విశ్వ క్రీడలను ముగించిన తీరును అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. స్టార్ హీరో టామ్ క్రూస్.. కప్పుపై నుంచి కిందకు వచ్చి ఒలింపిక్ జెండాను అందుకొని బైక్‌పై స్టేడియం బయటకు దూసుకెళ్లడంతో పారిస్ క్రీడలు ముగిశాయని చెబుతూనే.. తదుపరి '2028 లాస్ ఏంజిల్స్ మిషన్' మొదలైందనే విధంగా హాలీవుడ్ టచ్ ఇచ్చారు.

పారిస్‌ను మరిపించడం.. లాస్ ఏంజిల్స్‌కు సాధ్యమా?

- తక్కువ బడ్జెట్‌తో భేష్
- తాత్కాలిక స్టేడియాలతో తగ్గిన నిర్వహణ భారం
- భవిష్యత్ బిడ్డర్లకు చక్కని పాఠం

ఇప్పటివరకు జరిగిన విశ్వ క్రీడల్లో పారిస్ ఒక మైలురాయి అని విశ్లేషకులు భావిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఇంతటి మెగా ఈవెంట్‌ను సూపర్ హిట్ చేయడాన్ని కొనియాడుతున్నారు. ముఖ్యంగా ఒలింపిక్స్ స్థాయిని నిలబెట్టిన మెగా ఈవెంట్‌గా చరిత్రలో నిలిచిపోతుందంటున్నారు. 2016 రియో ఒలింపిక్స్‌లో మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కోగా.. కరోనా కారణంగా టోక్యో క్రీడల నిర్వహణ భారంగా మారింది. 2020లో జరగాల్సిన క్రీడలను 2021కి వాయిదా వేయడంతో సంబంధిత స్టేడియాల పరిరక్షణ, నిర్వహణ వ్యయం కొండలా పెరిగింది. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్ నిర్వహణ పెద్ద సవాల్‌గా మారింది. గత పరిణామాలను నిశితంగా పరిశీలించిన నిర్వాహకులు.. ప్రతి విషయంలోనూ సమర్థంగా వ్యవహరించారు. ముఖ్యంగా బడ్జెట్ నియంత్రణలో భేష్ అనిపించుకొన్నారు. స్టేడియాల విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిటీ అంతటా దాదాపుగా 35 వేదికలతోపాటు తాత్కాలిక స్టేడియాలను నిర్మించి ఖర్చుకు పగ్గాలేశారు. షూటింగ్ లాంటి క్రీడలను శివార్లలో నిర్వహించడంతో ఆయా ప్రాంతాల్లో కూడా పర్యాటకుల సందడి పెరిగింది. మొత్తం భారమంతా ఒక్క పారిస్ నగరిపైనే పడకుండా చూసుకోవడం భవిష్యత్ నిర్వాహకులకు ఒక పాఠం. ఓపెనింగ్ సెర్మనీని కూడా రొటీన్‌కు భిన్నంగా సైన్ నదిపై నిర్వహించారు.

లోపాలున్నా.. చిన్నవే

206 దేశాలకు చెందిన 10 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న ఇంత పెద్ద ఈవెంట్ నిర్వహణలో అసలు లోపాలు చోటు చేసుకోలేదా? అంటే కాదనే చెప్పుకోవాలి. ముఖ్యంగా ప్లేయర్లు ఆహారం కోసం లైన్లలో బారులు తీరి నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు క్రీడాకారులు కేవలం ప్రాణాలు నిలబెట్టుకోవడానికి తప్ప.. క్రీడా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆహారం ఏమంత రుచిగా లేదనే ఫిర్యాదులు అందాయి. భారత క్రీడాకారులకు సౌకర్యవంతమైన బసకూడా ఏర్పాటు చేయలేకపోయారు. ఏసీలు లేకపోవడంతో భారత ఎంబసీనే చొరవ తీసుకోవాల్సి వచ్చింది. అన్నింటి కంటే పెద్ద టాస్క్ ట్రాన్స్‌పోర్ట్. ప్లేయర్లను ఆయా వేదికల వద్దకు చేరవేయడంలో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే, ఇంత భారీ ఈవెంట్‌లో చిన్నపాటి లోపాలు సహజమే అయినా.. ఓవరాల్‌గా 2024 క్రీడలను అత్యుత్తమ స్థాయిలో నిర్వహించారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పారిస్‌ను దలదన్నేలా 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ నిర్వహణ 'మిషన్ ఇంపాజిబుల్' అంటున్నారు.

రూ. 1.5 కోట్లా.. ఎప్పుడిచ్చారు?

సాయ్ నివేదికను తప్పుబట్టిన అశ్విని



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోసం తనపై రూ. కోటిన్నరకు పైగా ఖర్చు చేసినట్టు భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) తన నివేదికలో పేర్కొనడాన్ని బ్యాడ్మింటన్ డబుల్స్ ప్లేయర్ అశ్విని పొన్నప్ప తప్పుబట్టింది. తనకు అందిన సహాయం స్వల్పమేనని తెలిపింది. ఆఖరికి కోచ్ కోసం తాను చేసిన అభ్యర్థనను కూడా తిరస్కరించారని చెప్పింది. తనీషా క్రాస్టోతో కలసి మహిళల డబుల్స్ బరిలో దిగిన పొన్నప్ప ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండానే ఇంటిముఖం పట్టింది. అయితే, ఒలింపిక్ సైకిల్‌లో భాగంగా ఆమెకు 'టాప్స్' పథకం కింద రూ.4.5 లక్షలు, వార్షిక ట్రైనింగ్, పోటీల కింద రూ. 1.48 కోట్లను ఖర్చు చేసినట్టు సాయ్ తెలిపింది. 'ఆ నివేదిక నన్ను షాక్‌కు గురి చేసింది. వ్యక్తిగతంగా నాకు ఆర్థిక సాయం చేశానని చెప్పడం హాస్యాస్పదం. నా కోచ్‌కు నేనే జీతాలు చెల్లించా. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తర్వాతే నన్ను టాప్స్‌లో చేర్చార'ని పొన్నప్ప చెప్పింది.

బంగ్లాతో తొలి టీ20 గ్వాలియర్‌కు తరలింపు

న్యూఢిల్లీ: స్వదేశంలో జరిగే రెండు సిరీస్‌ల షెడ్యూల్‌లో బీసీసీఐ స్వల్ప మార్పులు చేసింది. అక్టోబరు 6న ధర్మశాలలో బంగ్లాదేశ్‌తో జరగాల్సిన తొలి టీ20 వేదికను గ్వాలియర్‌కు మార్చింది. ధర్మశాల స్టేడియంలో మరమ్మతుల కారణంగా మ్యాచ్‌ను తరలించినట్టు బోర్డు తెలిపింది. ఇక, వచ్చే జనవరిలో ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భాగం తొలి రెండు టీ20ల వేదికల్లో పరస్పరం మార్పులు చేసింది. తొలి మ్యాచ్ కోల్‌కతాలో, రెండో మ్యాచ్ చెన్నైలో నిర్వహించే విధంగా షెడ్యూల్‌ను రివైజ్ చేశారు. రిపబ్లిక్ డేను దృష్టిలో ఉంచుకొని వేదికలను మార్పులు చేయాలని కోల్‌కతా పోలీసులు, క్యాబ్ చేసిన విజ్ఞప్తి మేరకు వేదికలను పరస్పరం మార్పులు చేసినట్టు పేర్కొంది.

పారా షట్లర్ భగత్‌పై నిషేధం



న్యూఢిల్లీ: డోపింగ్ కోడ్‌ను ఉల్లంఘించిన పారా షట్లర్ ప్రమోద్ భగత్‌పై 18 నెలల సస్పెన్షన్ వేటు పడింది. టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన ప్రమోద్..దీంతో పారిస్ పారాలింపిక్స్‌కు దూరమయ్యాడు. నిబంధనల ప్రకారం తన ఉనికిని నాడా అధికారులకు అథ్లెట్లు తెలియజేయాలి. భగత్ డోపింగ్ నిబంధనల్ని ఉల్లంఘించినట్టు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) యాంటీ డోపింగ్ విభాగం గత మార్చిలో తేల్చింది. ప్రమోద్ 12 నెలల వ్యవధిలో ఇలా మూడుసార్లు అంతుచిక్కకుండా వెళ్లిపోయాడని 'కాస్' పేర్కొంది.

మను–నీరజ్ పెళ్లా..!

కొట్టిపడేసిన భాకర్ తండ్రి



న్యూఢిల్లీ: షూటర్ మను భాకర్, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా లవ్‌లో ఉన్నారంటూ నెట్‌లో ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. ఒలింపిక్స్‌లో వీరిద్దరూ చనువుగా మాట్లాడుకొంటున్నట్టు బయటకు వచ్చిన వీడియోలు, ఫొటోలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. త్వరలో వీరి పెళ్లి అంటూ నెటిజన్లు పోస్టుల మీద పోస్టులు పెడుతున్నారు. అయితే, భాకర్ తండ్రి రామ్ కిషన్ మాత్రం ఈ ఊహాగానాలకు కొట్టిపడేశాడు. 'మను ఇంకా చిన్నపిల్లే. ఆమెకు పెళ్లి వయసు రాలేదు. మాకు కూడా ఎలాంటి ఆలోచనా లేద'ని తెలిపాడు. వారిద్దరి మధ్య ఏమీ లేదని చెప్పాడు. నీరజ్‌ను మను తల్లి సుమేధ కొడుకులా భావిస్తుందని, రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలున్నాయని తెలిపాడు. పారిస్ క్రీడల్లో మను రెండు కాంస్యాలు సాధించగా.. నీరజ్ రజతం దక్కించుకొన్నాడు.

ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్‌గా పోప్



లండన్: ఇంగ్లండ్ టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా ఒల్లీ పోప్ నియమితుడయ్యాడు. నార్తర్న్ సూపర్ చార్జర్స్ తరఫున 100 లీగ్‌లో ఆడుతున్న ప్రస్తుత కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు తొడ కండర గాయం కావడంతో శ్రీలంకతో జరగనున్న సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. దీంతో స్టోక్స్ స్థానంలో పోప్‌కు నాయకత్వ బాధ్యతలను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అప్పగించింది. పోప్‌ను ఈ సిరీస్‌కు మాత్రమే కెప్టెన్‌గా నియమించారు.

శ్రీలంక బ్యాటింగ్ కోచ్ బెల్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ ఇయాన్ బెల్‌ను శ్రీలంక బ్యాటింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈనెల 21 నుంచి ఇంగ్లండ్ టూర్‌లో ఆ జట్టుతో శ్రీలంక 3 టెస్టులు ఆడనుంది.



ఇన్‌టేక్ వెల్ ఘటనపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం వల్లే సుంకిశాల ప్రమాదం

» అయినా ప్రభుత్వం దానిని వెనకేసుకొస్తోంది: ఏలేటి

నల్లగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సుంకిశాల పంప్‌హౌస్ ఇన్‌టేక్ వెల్ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం వల్లే రిటైనింగ్ వాల్ కుప్పకూలిందని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి ఆరోపించారు. ఆ సంస్థ వల్లే సుంకిశాల ప్రమాదం జరిగినట్లు స్పష్టంగా తెలుస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోకుండం లేదని ప్రశ్నించారు. మంగళవారం నల్లగొండ జిల్లా సుంకిశాల ఎత్తిపోతలను మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావుపటేల్, పాల్వాయి హరీష్, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. సుంకిశాల ఘటన జరిగి 12 రోజులు గడుస్తున్నా ఒక్క మంత్రి కానీ, ఉన్నతాధికారి కానీ ఎందుకు సమీక్ష నిర్వహించలేదని ప్రశ్నించారు. ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ చర్యలకు ఎందుకు ఆదేశించడం లేదని నిలదీశారు. తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి

» టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హోదాలో వుంటూ రాహుల్‌గాంధీపై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతుంటే రాహుల్ చైనా ఆదేశాల మేరకే మౌనం వహిస్తున్నారని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రధాని మోదీ చొరవ తీసుకొవాలని, బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చించి హిందువులపై దాడులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐటీఐలు, గురుకులాల సమస్యలపై సర్కారు కినుక

» మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు

రాష్ట్రంలో ఐటీఐ కాలేజీలు, గురుకులాల్లో కనీస వసతుల్లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా సర్కారుకు చీమ కుట్టినట్లు కూడా లేదని, వాటి పరిష్కారంపై కినుక వహిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పెద్దపల్లి, సంగారెడ్డి, ఆదిలాబాద్.. ఇలా రాష్ట్రంలో ఎక్కడ చూసినా.. ఐటీఐల పరిస్థితి అధ్వానంగా ఉందని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. కొన్నిచోట్ల తరగతి గదుల్లోకి వాననీరు చేరి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సిబ్బంది కొరతతో టాయిలెట్లు, పారిశుధ్య నిర్వహణ సరిగాలేక విద్యార్థులు అవస్థ పడుతున్నారన్నారు. గురుకులాల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, కలుషిత ఆహారంతో విద్యార్థులకు అస్వస్థత, పాముకాటుకు విద్యార్థి మృతి, డెంగీ జ్వరంతో ఓ విద్యార్థి దుర్మరణం వంటి వార్తలు రాష్ట్రంలో నిత్యకృత్యమయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను సత్వరం పరిష్కరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కరోనావల్ల రద్దు చేసిన రైళ్లను మళ్లీ నడపాలి

» దక్షిణ మధ్య రైల్వే జీఎంతో ఎంపీ రఘురామిరెడ్డి భేటీ

కరోనా కారణంగా రద్దు చేసిన రైళ్లన్నింటినీ పునరుద్దరించేందుకు చర్యలు తీసుకోవాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. రైల్‌నిలయంలో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో ఆయన సమావేశమైన సందర్భంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికులకు రైళ్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కరోనా కాలంలో బెల్గాం-భద్రాచలం రైలుతో పాటు పలు రైళ్లు రద్దు చేసినట్టు ఆయన గుర్తుచేశారు. అలాగే కొత్తగూడెం రైల్వేస్టేషన్ వద్ద ఇరుకుగా మారిన దారిని విస్తరించేందుకు అనుమతించాలని కోరారు.

రవాణాశాఖలో సీఎం పీఏ దందా?: బీఆర్ఎస్

రవాణాశాఖలో సీఎం పీఏ దందాలు చేస్తున్నారని, అందులో జరుగుతున్న అవినీతిపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఫిర్యాదులు వెళ్లాయని బీఆర్ఎస్ నేతలు సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఆర్టీసీలో కలెక్షన్ల దందా నడుస్తోందని, బస్సులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడంలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారు. దీనిపై సీబీసీఐడీ దర్యాప్తునకు మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్ధమా? అని ప్రశ్నించారు. లాభాల్లో ఉన్న ఆర్టీసీని కాంగ్రెస్ ప్రభుత్వం నష్టాల్లోకి నెట్టేసిందని, సంస్థను మిగులు బడ్జెట్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పగిస్తే రూ.2100 కోట్ల నష్టానికి చేర్చారని అన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లోనూ 'మధ్యాహ్న భోజనం' ఉండాలని పిల్

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు కావడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. మిడ్ డే మీల్ పీఎం పోషణ్‌కు సంబంధించిన జీవో నెంబర్ 1 ప్రైవేటు పాఠశాలల్లో అమలు కావడం లేదని పేర్కొంటూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అఖిల్ గురుతేజ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో పలు ప్రైవేటు పాఠశాలలను సైతం ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీచేసింది. విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.



'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బండా ప్రకాశ్ తదితరులు

బీసీ ఉద్యమానికి ఆయుధం 'మా వాటా మాకే'

» జూలూరు గౌరీశంకర్ పుస్తకావిష్కరణలో వక్తలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ రాసిన 'మా వాటా మాకే' పుస్తకం బీసీ ఉద్యమానికి భావజాల ఆయుధం అవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఈ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ 77 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో బీసీ సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ కూడా లేదన్నారు. కులగణనకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఏమీ చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతోందని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. నిజానికి నెల రోజుల్లో కులగణన చేయించవచ్చన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టీ చిరంజీవులు, ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ లక్ష్మణ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు మాట్లాడారు.

గురుకులాలను ప్రక్షాళన చేస్తాం

» ప్రతి నెలా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

» గురుకులాలపై గత సర్కారు నిర్లక్ష్యం

» ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలను ప్రక్షాళన చేస్తామని, అభివృద్ధికి నిధులు సమకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2004 నుంచి 2014 వరకు హాస్టళ్లలో చదివే విద్యార్థులకు హెల్త్ కార్డులు ఉండేవని, ప్రతి నెలా వైద్యులు వచ్చి వారి ఆరోగ్యాన్ని పరీక్షించి, కార్డులో రాసే వారని గుర్తు చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలోనే పారా మెడికల్ సిబ్బంది ఉండేవారని, ఆ విధానాన్ని తిరిగి తీసుకొస్తామన్నారు. గురుకుల పాఠశాలలో చదివే ఏ విద్యార్థీ నేలపై పడుకోవడానికి వీల్లేదని, మంచం, పరుపు, దుప్పటిని ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. మంగళవారం భట్టి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. తరగతి గదులు, డార్మెటరీ, ఆవరణను పరిశీలించారు. పలువురు తల్లిదండ్రులు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పెద్దాపూర్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతిచెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దాపూర్ పాఠశాలకు వచ్చానన్నారు. ఇకపై నెలలో ఒక రోజు మంత్రులు, ఎమ్మెల్యేలు గురుకుల పాఠశాలలను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు నెలకో గురుకుల పాఠశాలలో బస చేయాలని సూచించారు. ప్రభుత్వం బడ్జెట్‌లో గురుకుల పాఠశాలల పక్కా భవనాల కోసం రూ.5 వేల కోట్లు కేటాయించిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న గత పాలకులు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. విద్యార్థుల డైట్ చార్జీలను పెంచడానికి త్వరలోనే అధికారులతో కమిటీ వేస్తామని ప్రకటించారు. ప్రతి గురుకులంలో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని గురుకులాల కార్యదర్శి రమణకుమార్‌ను ఆదేశించారు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్లు, టీచర్లు, పారా మెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పెద్దాపూర్ పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మృతిచెందిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి గురుకుల సొసైటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ కుటుంబాలకు ఇల్లు లేనట్లయితే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. భట్టి వెంట బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. కాగా, విద్యార్థులకు తగిన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, వేడివేడి పదార్థాలనే వడ్డించేలా జాగ్రత్త తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్లు కూడా పాఠశాలలపై సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు.

అధ్వాన హాస్టళ్లు

(మొదటి పేజీ తరువాయి)



ఖమ్మంజిల్లా గాంధీనగరం గురుకులంలో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

వెల్లడైంది. ఇవే కాదు.. రిజిస్టర్లు/రికార్డులను సరిగ్గా నిర్వహించకపోవడం, సరుకుల కొనుగోళ్లలో అవకతవకలు, కొన్ని హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చేసి చూపించడం, వార్డెన్లు వారానికో నెలకో ఒకసారి వచ్చిపోవడం.. ఇలా ఎన్నో అక్రమాలు బయటపడ్డాయి. ఏసీబీకి చెందిన 10 బృందాలు మంగళవారం రాష్ట్రంలోని పది వసతి గృహాలను ఏక కాలంలో తనిఖీ చేశాయి. ఒక్కో బృందంలో ఏసీబీ అధికారులతో పాటు తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ ఉన్నారు. తనిఖీల్లో బయటపడ్డ అవకతవకలు, అక్రమాలకు బాధ్యులైన అధికారులపై నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని ఏసీబీ తెలిపింది. హాస్టళ్లలో పరిస్థితులను మెరుగుపరచడానికి తగిన సిఫారసులు చేస్తామని వెల్లడించింది.

ఎన్నో సమస్యలు..

రాజధాని హైదరాబాద్‌లోని జాంబాగ్ ఎస్సీ బాలుర హాస్టల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లి బీసీ బాలుర వసతి గృహం సహా పది హాస్టళ్లలో ఏసీబీ బృందాలు తనిఖీ చేశాయి.

- జాంబాగ్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో వసతులు సరిగ్గా లేవని, నాణ్యత లేని ఆహారం పెడుతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు.
- ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని గాంధీనగరం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులకు విద్యార్థులు పలు ఫిర్యాదులు చేశారు. తమకు మెనూ ప్రకారం భోజనం అందట్లేదని.. నీళ్ల చారు, ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని వాపోయారు. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో దోమలు పెరిగిపోయి జ్వరాలబారిన పడుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని, నిద్రించే సమయంలో ఎలుకలు తమను కరుస్తున్నాయని చెప్పారు. వంటగదిని పరిశీలించిన అధికారులు.. అక్కడంతా ఈగలతో నిండిపోయి, అపరిశుభ్రంగా కనిపించడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఉపాధ్యాయులు చెప్పాపెట్టకుండా సెలవు పెట్టారని.. ఉదయం 8గంటలు దాటినా వార్డెన్ రాలేదని గుర్తించారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇప్పలపల్లి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల శుభ్రంగా లేదని.. 356మంది విద్యార్థులకు సరిపడా సదుపాయాలు లేవని ఏసీబీ అధికారులు గుర్తించారు.
- మంచిర్యాల జిల్లా వేమనపల్లిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 272 మంది విద్యార్థుల కుగాను 172 మంది విద్యార్థులే ఉన్నట్లు.. బియ్యం వాడకంలో తేడాలున్నట్లు గుర్తించారు. పాఠశాలలో సరైన పారిశుధ్య ఏర్పాట్లు లేవని తెలిపారు.
- మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో తనిఖీలు చేసిన ఏసీబీ అధికారులు.. విద్యార్థులకు పెట్టిన అల్పాహారం నాణ్యంగా లేదని, పల్లీలు, కందిపప్పు, రాగులు, కూరగాయలు, నాసిరకంగా ఉన్నాయని తెలిపారు. బియ్యంలో పురుగులు ఉన్నాయని, విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని.. గదులు, బాత్‌రూంలు అపరిశుభ్రంగా ఉన్నాయని, బాత్‌రూంలకు తలుపులు లేవని.. రికార్డుల నమోదు సక్రమంగా లేదని చెప్పారు. వార్డెన్ అందుబాటులో లేరని, ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వస్తోందని.. వెల్లడించారు.
- సిద్దిపేటలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించట్లేదని గుర్తించారు.
- నల్లగొండ జిల్లా తిప్పర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో 52 మంది విద్యార్థులు ఉన్నట్లుగా రికార్డుల్లో పేర్కొన్నా.. వాస్తవానికి ఉన్నది 23 మందిమాత్రమే అని తేలింది. గ్రామంలో ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థినులు కూడా హాస్టల్‌లో ఉంటున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. హాస్టల్ వాటర్‌ట్యాంక్ అపరిశుభ్రంగా ఉందని, మరుగుదొడ్లు సరిపడా లేవని వెల్లడించారు. విద్యార్థులకు అల్పాహారం పెట్టట్లేదని.. బాలికలకు నెలనెలా ఇచ్చే కాస్మోటిక్స్ వివరాలను రెండు నెలలుగా రికార్డుల్లో నమోదుచేయట్లేదని పేర్కొన్నారు.

జనగామ ఎస్సీ బాలికల హాస్టల్‌లో.. హాజరుపట్టీలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు, క్షేత్రస్థాయిలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు తేడా ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆహార మెనూను కూడా పాటించట్లేదని అధికారులకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌కు వచ్చే బియ్యం, పప్పులు, గుడ్లు, చింతపండు తదితర వస్తువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌ను కూడా సరిగ్గా నిర్వహించట్లేదని.. వార్డెన్ రాత్రి పూట విధులకు హాజరు కావట్లేదని అధికారులు వెల్లడించారు.



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బృందం సభ్యులు

విద్యార్థుల భద్రతకు పొంచి ఉన్న ముప్పు

» భువనగిరి గురుకులనిర్వహణ, వసతులపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అసంతృప్తి

» 'వసతి గృహ హింస' కథనానికి స్పందన

భువనగిరి టౌన్, ఆగస్టు 13: పెచ్చులు ఊడుతున్న పైకప్పు.. శిథిలావస్థలో ఉన్న భవనాలు.. యాదాద్రి భువనగిరిజిల్లా భువనగిరిలోని గురుకుల పాఠశాల దుస్థితి ఇది! ఆ భవనాలు కూలే ప్రమాదం ఉందని.. విద్యార్థుల భద్రతకు ముప్పు పొంచి ఉందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు ఆందోళన వెలిబుచ్చారు. 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన 'వసతి గృహ హింస' కథనానికి స్పందనగా.. ఆ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం భువనగిరి గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజన నాణ్యతను, పాఠశాల, డార్మెటరీ భవనాలను పరిశీలించారు. విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పిల్లలకు పెడుతున్న భోజనంలో నాణ్యత లోపించిందని, పరిశుభ్రత లేదని అసంతృప్తి వెలిబుచ్చారు. పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్ల పొదల కారణంగా పాములు వచ్చే ప్రమాదం ఉందని.. శిథిలావస్థలో ఉన్న భవనాలు వర్షాలకు కూలే ముప్పు ఉందని ఆందోళన వెలిబుచ్చారు. వసతులు మెరుగుపరిచే దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని సంక్షేమ, విద్యా శాఖలకు, జిల్లా పాలనా యంత్రాంగానికి సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై అందరితో చర్చించాకే నిర్ణయం!

» అదే రేవంత్‌కూ వర్తిస్తుంది: వేణుగోపాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మీద పీసీసీలు, ఇతర వర్గాలతో చర్చలు జరిపిన తర్వాతే ఒక నిర్ణయానికి వస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. చర్చలు జరిపేందుకు త్వరలో ఒక కమిటీ వేస్తామని తెలిపింది. మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులతో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమావేశమైన తర్వాత మీడియాతో మాట్లాడిన పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయం వెల్లడించారు. తొలుత వర్గీకరణతో సంబంధం ఉన్న వారితో, తర్వాత పీసీసీలతోనూ చర్చలు జరుపుతామని, ఆ తర్వాత ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు. అదే అందరికీ వర్తిస్తుందన్నారు. షెడ్యూల్డు కులాల రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు కదా? అని ఓ విలేకరి ప్రశ్నించగా.. తాను అందరితో చర్చించి తీసుకున్న నిర్ణయం రేవంత్‌కూ వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2023 నవంబరు 25న ప్రధాని మోదీ తెలంగాణకు వెళ్లి మాదిగలకు వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించగా.. జైరాం రమేశ్ స్పందించారు. మోదీ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు తెచ్చి, క్రీమీలేయర్‌కు వ్యతిరేకమని స్పష్టం చేసి ఉండేవారని అన్నారు. తాము క్రీమీలేయర్‌కు వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ, అధ్యక్షుడు అనేక సార్లు స్పష్టం చేసినట్లు తెలిపారు. కేంద్రం నిజంగా వర్గీకరణకు అనుకూలంగా ఉంటే పార్లమెంట్‌లో బిల్లు తెచ్చి ఉండేదన్నారు.

కొత్త కోర్సుల దరఖాస్తులు మళ్లీ పరిశీలించండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త కోర్సులు ప్రారంభించే విషయమై ఇంజినీరింగ్ కాలేజీలు చేసుకున్న దరఖాస్తులను మళ్లీ పరిశీలించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కారణంగా కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో కొత్త కోర్సులు ప్రారంభించాలనుకుంటున్న కాలేజీలకు ఊరట లభించింది. సరైన కారణాలను వివరించకుండా దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని పేర్కొంది. కొత్త కోర్సులు, సీట్ల పెంపు అనుమతుల విషయంలో ప్రభుత్వానిదే తుది నిర్ణయం అంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను డివిజన్ బెంచ్ కొట్టేసింది. కొత్త కోర్సుల ప్రారంభం, డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు పెంచుకోవడం, కోర్సుల విలీనం, డిమాండ్ లేని కోర్సుల్లో సీట్ల తగ్గింపునకు అనుమతి ఇవ్వాలంటూ తాము చేసిన దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించడం చెల్లదని పేర్కొంటూ పలు ఇంజినీరింగ్ కాలేజీలు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిని కొట్టివేసిన సింగిల్ జడ్జి.. కొత్త కోర్సులకు అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. సింగిల్ జడ్జి తీర్పుపై సీఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర ఇంజినీరింగ్ కాలేజీలు డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు.

అగ్రి దందాలో జోగి తనయుడి అరెస్టు

రాజీవ్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ

విజయవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రి గోల్డ్ భూముల కబ్జా కేసులో ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్ తనయుడు జోగి రాజీవ్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. రాజీవ్‌తోపాటు సర్వేయర్ ఎ.రమేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులోని జోగి రమేశ్ ఇంటికి మంగళవారం ఉదయమే ఏసీబీ అధికారుల బృందం చేరుకుంది. మధ్యాహ్నం వరకు ఇంట్లో సోదాలు నిర్వహించారు. అనంతరం రాజీవ్‌ను అరెస్టు చేస్తున్నట్టు అతడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములకు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయించుకున్న అంశంలో ఏసీబీ అధికారులు.. రాజీవ్‌పై ఈ నెల ఎనిమిదో తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో రాజీవ్‌ను ఏ1గా పేర్కొన్నారు. జోగి రమేశ్ బాబాయ్ జోగి వెంకటేశ్వరరావును ఏ2గా చేర్చారు. సర్వేయర్ ఎ.రమేశ్(ఏ3)గా చేర్చారు. జోగి రాజీవ్, ఎ.రమేశ్‌ను అరెస్టు చేసిన తర్వాత గొల్లపూడిలో ఉన్న ఏసీబీ జిల్లా కార్యాలయానికి తరలించారు. ఆ తర్వాత విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లారు. రాజీవ్ తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఏసీబీ తరఫున పీపీ మీనాకుమారి... న్యాయాధికారి హిమబిందు ఎదుట వాదనలు వినిపించారు. అనంతరం కోర్టు 23 వరకు రాజీవ్, రమేశ్‌లను రిమాండ్‌కు ఆదేశించడంతో విజయవాడ జైలుకు తరలించారు.

పల్లెల్లో ఆస్పత్రుల కొరత

జనాభాకు తగినట్లుగా లేని దవాఖానాలు

36% సీహెచ్‌సీలు, 30% పీహెచ్‌సీల లేమి

ఆరోగ్య కేంద్రాల్లో ఔషధాల లభ్యతా అంతంతే

కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ గణాంకాల్లో వెల్లడి

తెలంగాణలోనూ ఇదే రకమైన పరిస్థితి

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. పల్లెల్లో జనాభాకు తగినట్టుగా ఆస్పత్రులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రుల కొరతపై కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ.. పార్లమెంట్‌లో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు లిఖిత పూర్వక సమాధానమిచ్చింది. గ్రామీణ వైద్య గణాంకాలు-2022 ప్రకారం.. పల్లె ప్రాంతాల్లో 24.86 శాతం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, 30.79 శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ), 36.12 శాతం సామాజిక ఆరోగ్య కేంద్రా(సీహెచ్‌సీ)ల కొరత ఉంది. క్షేత్రస్థాయి ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలంటే మూడంచెల వ్యవస్థ అవసరం. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఐదు వేల జనాభాకు ఒక ఆరోగ్య ఉప కేంద్రం ఉండాలి. అదే కొండ, గిరిజన ప్రాంతాల్లో అయితే 3 వేల జనాభాకు ఉండాలి. మైదాన ప్రాంతాల్లో ప్రతి 30 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ.. కొండ, గిరిజన ప్రాంతాల్లో 20 వేల జనాభాకు ఉండాలి. మైదాన ప్రాంతాల్లో 1.20 లక్షల జనాభాకు సీహెచ్‌సీ ఉండాలి. అదే కొండ, గిరిజన ప్రాంతాల్లో 80 వేల జనాభాకు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇక ఆరోగ్య ఉప కేంద్రాల్లో 106 రకాల ఔషధాలు, పీహెచ్‌సీ స్థాయిలో 172, సీహెచ్‌సీల్లో 300 రకాలు, జిల్లా ఆస్పత్రుల్లో 381 రకాల ఔషధాలు అందుబాటులో ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ వైద్య కేంద్రాలు మాదిరిగానే ఔషధాల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది.

తెలంగాణలోనూ అదే పరిస్థితి..

కాగ్ ఇటీవల ఇచ్చిన నివేదిక ప్రకారం మన రాష్ట్రంలోనూ ఆరోగ్య కేంద్రాల కొరత ఎక్కువగానే ఉన్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో జనాభాకు అనుగుణంగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఉప కేంద్రాలు లేవని వెల్లడైంది. సీహెచ్‌సీలు 69 శాతం, పీహెచ్‌సీలు 25 శాతం, ఉప కేంద్రాలు 29 శాతం కొరత ఉన్నట్లు కాగ్ పేర్కొంది. జనగామ, సిరిసిల్ల, హన్మకొండ జిల్లాల్లో ఒక్క సీహెచ్‌సీ కూడా లేదు. దేశవ్యాప్తంగా సీహెచ్‌సీల కొరత 36 శాతం ఉంటే.. మన దగ్గర అందుకు రెట్టింపు ఉంది. మరోవైపు రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 35,004 పడకలు అవసరం కాగా, సర్కారీ దవాఖానాల్లో 27,996 పడకలు ఉన్నాయి. 7,008 బెడ్స్ కొరత ఉన్నట్లు తాజా కాగ్ నివేదికలో వెల్లడైంది. ఆదిలాబాద్, హైదరాబాద్, హన్మకొండ జిల్లాలు మినహా మిగతా అన్నింటా బెడ్స్ కొరత ఉన్నట్లు తేలింది.

కవితపై తప్పుడు వాంగ్మూలాలు

» సాక్షులపై ఒత్తిడి చేసి, చెప్పించారు

» వీడియో, ఆడియో ఆధారాలు ఇవ్వండి

» కోర్టులో కవిత తరఫు లాయర్ వాదన



న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సాక్షులను ఒత్తిడి చేసి, కవితపై తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేశారని ఆమె తరఫు న్యాయవాది మోహిత్‌రావు చెప్పారు. వాంగ్మూలాల నమోదు సమయంలోని వీడియోలను తమకు ఇవ్వాలని కోరారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్రపై మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టులో వాదనలు జరిగాయి. కవితను వర్చువల్ పద్ధతిలో కోర్టు ఎదుట హాజరు పరిచారు. "సెక్షన్ 50 పీఎంఎల్ఏలో దర్యాప్తు సంస్థ నమోదు చేసిన వాంగ్మూలాల్లో నిజం లేదు. సాక్షులపై ఒత్తిడి చేసి తప్పుడు వాంగ్మూలాలను నమోదు చేశారు. సాక్షులు, అప్రూవర్ల వాంగ్మూలాల నమోదు సమయంలో చిత్రీకరించిన వీడియో, ఆడియో ఆధారాలు మాకు ఇవ్వాలి. ఒత్తిడి చేసి, తీసుకున్న వాంగ్మూలాలు చెల్లవు. శరత్‌చంద్రారెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కవితపై ఈడీ ఆరోపణలు చేయడం సరికాదు. ఆయనతో కవిత ఆర్థిక లావాదేవీలు జరిపారని ఈడీ చెబుతోంది. వారిద్దరి మధ్య అనేక సంవత్సరాలుగా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. అవి కూడా చట్టబద్ధంగా బ్యాంకు ద్వారా జరిగినవే" అని మోహిత్ రావు వాదనలు వినిపించారు. అనంతరం జడ్జి కావేరి బవేజా తదుపరి విచారణను సెప్టెంబరు 2కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులోనే అరెస్టయి, తిహాడ్ జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగియడంతో వర్చువల్ పద్ధతిలో ఆయన్ని న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. కేజ్రీవాల్ కస్టడీని మరోసారి పొడిగించాలని ఈడీ తరఫున న్యాయవాది కోరారు. దర్యాప్తు సంస్థతో ఏకీభవించిన జడ్జి కావేరి బవేజా సెప్టెంబరు 2 వరకూ కస్టడీని పొడిగించారు.

ప్రాణత్యాగాల ఫలితం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారాలు రాష్ట్రానికే ఉన్నాయని, వాటిని అమలు చేయాలని చెప్పి సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. "30 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో మా న్యాయమైన పోరాటానికి మీడియా మద్దతిచ్చింది. జాతీయ అంశమైన ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేశాం. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా మాదిగజాతి గెలిచిందని స్పష్టంగా అర్థమైంది" అని మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ సభలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ప్రొఫెసర్ కాశీం, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజుతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ ప్రక్రియ సెప్టెంబరు రెండో వారంలోగా పూర్తవ్వాలి

సంబంధిత జిల్లాల కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను సెప్టెంబరు రెండో వారంలోగా పూర్తి చేయాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం ఆమె సచివాలయంలో ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం జిల్లా స్థాయిల్లో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి, భూముల మార్కెట్ విలువల ఆధారంగా పరిహారాన్ని చెల్లించాలన్నారు. భూసంబంధిత కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు.

ఎండీఎస్‌కు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోండి

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి: ఎండీఎస్(మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) కన్వీనర్ కోటా మొదటి విడత సీట్ల భర్తీలో భాగంగా వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాలని కాళోజీ విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించింది. నీట్ పీజీ ఎడీఎస్-2024లో అర్హత సాధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో ఉన్నవారే ఇందుకు అర్హులని పేర్కొంది. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

మెడికల్ కాలేజీల్లో భద్రత పెంచుకోండి: ఎన్ఎంసీ

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై హత్యాచారం ఘటన నేపథ్యంలో జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) కంటితుడుపు చర్యలు చేపట్టింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో భద్రత పెంచుకోవాలని సూచనలు జారీ చేసింది. అన్ని మెడికల్ కళాశాలలు, అనుబంధ ఆస్పత్రుల్లో సురక్షితమైన పని ప్రదేశపు వాతావరణం కల్పించాలని కోరింది. ఓపీడీ, క్యాజువాలిటీ, వసతిగృహాల్లో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. వైద్య విద్యార్థులపై ఎవరైనా హింసకు పాల్పడితే, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని కళాశాల యాజమాన్యాలను కోరింది.

నేరాల శాతంపై అసత్య ప్రచారం: డీజీపీ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 13: రాష్ట్రంలో నేరాల శాతం పెరిగిందంటూ కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని డీజీపీ జితేందర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి జిల్లా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసుల పనితీరు చాలా బాగుందని కొనియాడారు. రాష్ట్రంలో నేరాల సంఖ్య పెరిగిందని కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని, కానీ వాస్తవాలేమిటో ప్రజలకు తెలుసని అన్నారు. ముఖ్యంగా నేరాలు, రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయని, పోలీసులు తీసుకుంటున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు.

రూ.3000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ.3000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా దీన్ని సేకరించింది. 11 ఏళ్ల కాల పరిమితి, 7.26 శాతం వార్షిక వడ్డీ రేటుతో రూ.1000 కోట్లు, 14 ఏళ్ల కాల పరిమితి, 7.28 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 21 ఏళ్ల కాల పరిమితి, 7.28 శాతం వార్షిక వడ్డీ రేటుతో రూ.1000 కోట్ల చొప్పున ఈ రుణాన్ని తీసుకుంది. రాష్ట్రంతో కలిపి దేశంలోని ఏడు రాష్ట్రాలు మొత్తం రూ.15,950 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

122 మంది తెలంగాణ ఉద్యోగుల రిలీవ్

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్థానికత ఉండి ఏపీలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత రాష్ట్రానికి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను తెలంగాణకు రిలీవ్ చేస్తున్నట్టు జీవోలో పేర్కొంది. ప్రస్తుతం వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులను రిలీవ్ చేసే ముందు వారి నుంచి అంగీకారం తీసుకోవాలని స్పష్టం చేసింది. తెలంగాణకు రిలీవ్ అవుతున్న ఉద్యోగులు తమ క్యాడర్‌లోని చివరి ర్యాంక్‌లో మాత్రమే విధుల్లో చేరతారని ప్రభుత్వం స్పష్టం చేసింది.

గురుకుల విద్యార్థినికి సీఎం రేవంత్‌రెడ్డి అండ

- ప్రభుత్వ ఖర్చుతో నిమ్స్‌లో వైద్యం

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల భవనంపై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైన విద్యార్థిని కొయ్యడ కార్తీకకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలిచారు. ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందించాలని సీఎం కార్యాలయ అధికారులను ఆయన ఆదేశించారు. సీఎం సూచన మేరకు నిమ్స్‌లో న్యూరోసర్జన్ డాక్టర్ తిరుమల్ బృందం మంగళవారం కార్తీకకు ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న విద్యార్థిని కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు. మంత్రి సీతక్క కూడా బాలిక ఆరోగ్య పరిస్థితిపైన ఎప్పటికప్పుడు నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కార్తీక ఈ నెల 9న ప్రమాదవశాత్తు పాఠశాల మూడో అంతస్తు నుంచి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి.

మహిళల భద్రత కోసం త్వరలో స్పెషల్ డ్రైవ్

- ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు: మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల భద్రత కోసం త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళా మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత కోసం స్వల్పకాలిక ప్రణాళికలతోపాటు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. బంధువులు, పరిచయస్తులు, పరిసరాల్లో నివాసముండే వాళ్ల నుంచే మహిళలకు వేధింపులు ఎదురవడం బాధాకరమన్నారు. చాలామంది తమకు జరిగిన అన్యాయాలను చెప్పుకునేందుకు ముందుకు రావడం లేదనీ, వాళ్లలో ధైర్యం నింపేలా చర్యలు చేపడతామన్నారు. కాగా, ఈ నెలాఖరులోగా రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తవుతుందని, ఆ తర్వాత పంచాయతీలకు వీలైనంత మేర నిధులు కేటాయించేందుకే సర్కారు ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి సీతక్క అన్నారు. ఇటీవలే 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం నెలల తరబడి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకపోవడంతో పెండింగ్ పెరిగిపోయిందని.. ఆ పాలకులే ఇప్పుడు పంచాయతీలకు నిధులివ్వడం లేదని ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తున్నారని విమర్శించారు.

ఏపీ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో.. ఈడబ్ల్యూఎస్ కోటా జీవో సస్పెన్షన్

- కన్వీనర్ కోటాలో ఇది చెల్లదన్న హైకోర్టు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మెడికల్ కాలేజీలలో కన్వీనర్ కోటా కింద భర్తీ చేసే మొత్తం సీట్లలో 10 శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్(ఆర్థిక బలహీన వర్గాలు) కోటా కింద భర్తీ చేయాలంటూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో 94 అమలును హైకోర్టు సస్పెండ్ చేసింది. ప్రభుత్వ జీవో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. కాలేజీలకు కేటాయించిన సీట్లలోనే ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలని ఎన్ఎంసీ ఇచ్చిన పబ్లిక్ నోటీసు ఆధారంగానే ప్రభుత్వం జీవో 94 ఇచ్చిందని ఎస్‌జీపీ ప్రణతి చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. ప్రైవేటు కాలేజీల్లో ఈ కోటా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి ప్రయత్నిస్తోందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా సీట్లను పెంచేందుకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్ల పెంపు కోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేసుకొనేలా ప్రైవేటు కాలేజీల యాజమన్యాలపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వానికి సూచించింది.

సీతారామ ప్రాజెక్టు.. 2026 ఆగస్టు 15కల్లా పూర్తి

- రేపు సీఎం చేతుల మీదుగా 3 పంప్‌హౌస్‌లు ప్రారంభం
- రాజీవ్ లింక్ కెనాల్ కూడా: మంత్రి ఉత్తమ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణాన్ని 2026 ఆగస్టు 15వ తేదీకల్లా పూర్తిచేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. తమ హయాంలోనే ప్రాజెక్టు పనులు 90% వరకు పూర్తయ్యాయన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. వారి హయాంలో ప్రాజెక్టులో 39% పనులు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. రూ.18,286 కోట్ల అంచనా వ్యయం కలిగిన ఈ ప్రాజెక్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.7,436 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. అలాంటప్పుడు 90% పనులు పూర్తయ్యాయని ఎలా చెప్పుకొంటారని ప్రశ్నించారు. మంగళవారం జలసౌధలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న (గురువారం) సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడు పంప్‌హౌస్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు. వాటితో పాటు రాజీవ్ లింక్ కెనాల్ (ఏన్కూరు)ను కూడా ప్రారంభిస్తారని చెప్పారు. కాగా, పంప్ హౌస్‌ల ప్రారంభం తర్వాత సీఎం రేవంత్ వైరాలో బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడి నుంచే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ నిధులను విడుదల చేసి ప్రసంగిస్తారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

కమీషన్ల కోసమే రీడిజైనింగ్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే రూ.1,681 కోట్లతో రాజీవ్ దుమ్ముగూడెం, రూ.1,824 కోట్లతో ఇందిరాసాగర్ ఎత్తిపోతల పథకం చేపట్టారని ఉత్తమ్ కుమార్ విలేకరుల సమావేశంలో గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులకు రూ.1,958 కోట్లు వెచ్చించారని, మిగిలిన రూ.1500 కోట్లతో పనులు పూర్తి చేస్తే 4 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేదని చెప్పారు. అయితే కాంగ్రెస్ పార్టీకి పేరు రావొద్దని, కమీషన్ల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పక్కనపెట్టి రీడిజైనింగ్‌తో సీతారామ పథకాన్ని చేపట్టారని ఆయన ఆరోపించారు.

అప్పులను కడుతున్నాం: పొంగులేటి

ఖమ్మంలో 2014, 2018లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు మాత్రమే వచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. ఖమ్మం ప్రజలు బీఆర్ఎస్ మాటలు నమ్మరని, వచ్చే ఎన్నికల్లో ముక్కునేలకు రాసుకున్నా ఒక్క సీటు కూడా ఆ పార్టీకి రాదని చెప్పారు. "ఖమ్మం జిల్లాతో పెట్టుకోవద్దు. ఎంత తక్కువ గోక్కుంటే అంతమంచిది" అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన రూ.7.18 లక్షల కోట్ల అప్పును కాంగ్రెస్ ప్రభుత్వం కడుతోందని చెప్పారు.

కాంగ్రెస్‌లో పదవుల బొనాంజా

(మొదటిపేజీ తరువాయి)



అధ్యక్ష పదవులనూ భర్తీ చేసేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఈ నాలుగు పోస్టుల్లో రెడ్డి, మైనారిటీ వర్గాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించనున్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాల్లో టీపీసీసీ చీఫ్ పోస్టు దక్కిన వర్గాన్ని మినహాయించి.. మిగిలిన వర్గాలకు చెందిన ఇద్దరికి కార్యనిర్వాహక అధ్యక్ష పదవులు ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. టీపీసీసీ చీఫ్ రేసులో ప్రధానంగా ఉండి ఆ పోస్టు దక్కని వారికి కార్యనిర్వాహక అధ్యక్ష పదవులు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టీపీసీసీ కార్యవర్గంలో ప్రధానమైన మరో పదవి.. ప్రచార కమిటీ చైర్మన్. ఈ పదవికి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి పేరు ఖరారైనట్లు తెలుస్తోంది. పీసీసీ కార్యవర్గం నియామకాల్లో సామాజిక సమీకరణలనూ పరిగణనలోకి తీసుకుని మంత్రి వర్గ విస్తరణపైనా అధిష్ఠానం నిర్ణయాలు చేయనున్నట్లు తెలుస్తోంది.

1-2 మంత్రి పదవులు పెండింగ్‌లో!

మంత్రివర్గ విస్తరణలో భాగంగా మరో ఆరుగురిని తీసుకునే వెసులుబాటు ఉండగా.. ఈ దఫాలోనూ పూర్తిస్థాయి విస్తరణ జరిగే అవకాశం లేదని సమాచారం. ఒకటి లేదా రెండు మంత్రి పదవులను పెండింగ్‌లో పెట్టే చాన్స్ ఉందని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే.. నల్లగొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి వాకిటి శ్రీహరి, నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్ మంత్రిపదవులకు పోటీ పడుతున్నారు. అయితే వీరిలో సుదర్శన్ రెడ్డి, వాకిటి శ్రీహరి పేర్లు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీపీసీసీచీఫ్‌గా ఎస్టీని నియమిస్తే బాలూనాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది. బీసీ, ఎస్సీ వర్గాల నుంచి టీపీసీసీ చీఫ్‌ను ఎంపిక చేస్తే.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు బాలూనాయక్ కూడా మంత్రి పదవి రేసులో ఉంటారని చెబుతున్నారు. ఇక ఆదిలాబాద్‌లో వెలమ సామాజిక వర్గం నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్, గడ్డం వినోద్ పోటీ పడుతుండడం ఆసక్తికరంగా మారింది. మంత్రివర్గంలో ఇప్పటికే ఈ రెండు సామాజిక వర్గాలకూ ప్రాతినిధ్యం ఉండడంతో ఎవరికి పదవి దక్కుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక.. మంత్రి పదవుల్లో ఒకటి మైనారిటీలకు కేటాయించడం సంప్రదాయంగా వస్తూ ఉంది. మైనారిటీల నుంచి ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఎవరూ లేనందున దాన్ని పెండింగ్‌లో పెట్టేందుకు ఆస్కారం ఉందంటున్నారు. సామాజిక వర్గ సమీకరణల్లో చిక్కుముడి వీడకుంటే మరో మంత్రి పదవినీ పెండింగ్‌లో పెట్టే చాన్స్ ఉందని చెబుతున్నారు. మంత్రివర్గంలో చోటు దక్కని నేతలకు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు ఇస్తారని చెబుతున్నారు.

మున్నూరు కాపు నేతల పేర్లు..

బీసీ కమిషన్ చైర్మన్ పోస్టును మున్నూరుకాపు సామాజిక వర్గానికి కేటాయించే ఆలోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బీసీ కమిషన్ చైర్మన్ పోస్టు కీలకంగా మారింది. ఈ పదవికి మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు, గోపిశెట్టి నిరంజన్ పేర్లను ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే తన సేవలను పార్టీ కే వినియోగించుకోవాలని నిరంజన్ అభిప్రాయ పడినట్లు తెలుస్తోంది. అలాగే గతంలో పీసీసీ చీఫ్, ఎంపీ, రాష్ట్ర మంత్రి పదవులను నిర్వహించిన వి.హన్మంతరావు.. బీసీ కమిషన్ చైర్మన్ పదవిని స్వీకరిస్తారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక.. ప్రస్తుతం ఒక్కటిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విడదీసి రెండు కమిషన్లుగా చేయాలా.. ప్రస్తుతం ఉన్నట్లుగానే కొనసాగించాలా అన్నదానిపై ప్రభుత్వం ఇంకా స్పష్టతకు రాకపోవడంతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పోస్టుల భర్తీని పెండింగ్‌లో పెట్టే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా.. రైతు, విద్యా కమిషన్ చైర్మన్లుగా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళిని నియమించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన.. చేరుతున్న ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఇచ్చే ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారు. వీటిపైనా సీఎం ఢిల్లీ పర్యటనలో స్పష్టత రానున్నట్లు చెబుతున్నారు.



తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా యడవల్లి వెంకట స్వామి

న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులుగా యడవల్లి వెంకటస్వామి నియమితులయ్యారు. తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాలకు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులను కాంగ్రెస్ అధిష్ఠానం మంగళవారం ప్రకటించింది. ఈమేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామక ఉత్తర్వులు విడుదల చేశారు.

నేడు కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ షురూ

- కోకాపేటలో ప్రారంభించనున్న సీఎం
- కొరియా నుంచి రాగానే కార్యక్రమం



హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దిగ్గజ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్‌కు చెందిన మరో క్యాంపస్ హైదరాబాద్‌లో అందుబాటులోకి రానుంది. కోకాపేటలోని బహుళ అంతస్తుల జీఏఆర్ టవర్‌లో 10 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. దక్షిణ కొరియా పర్యటన నుంచి బుధవారం హైదరాబాద్ చేరుకోనున్న వీరు.. తర్వాత కాగ్నిజెంట్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కొత్త క్యాంపస్ ద్వారా 15 వేల కొత్త ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంపెనీ ఇప్పటికే ప్రకటించింది. ఉమ్మడి ఏపీలో 2002లో కేవలం 180 మంది ఉద్యోగులతో హైదరాబాద్‌లో తొలి కార్యాలయం ప్రారంభించింది కాగ్నిజెంట్. ప్రస్తుతం నాలుగుచోట్ల మొత్తం 18 వేల ఉద్యోగులున్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో మరింత ముందుకెళ్లాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఐదో క్యాంపస్ నెలకొల్పనున్నట్టు కాగ్నిజెంట్ గతంలో ప్రకటించింది. దావోస్ పర్యటనలో సీఎం రేవంత్‌తో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆసక్తి కనబరిచింది. కాగా, అమెరికా పర్యటనలో ఉన్న సీఎంతో ఈనెల 5న కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ సమావేశమై కొత్త క్యాంపస్‌ను ప్రకటించారు. ర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ సహా పలు అధునాతన సాంకేతికతలపై ఇక్కడ ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని తెలిపారు. మరోవైపు రెండేళ్లలో కాగ్నిజెంట్ రాష్ట్రంలోని 34 వివిధ విద్యా సంస్థల నుంచి 7,500 మందిని నియమించుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ.7,725 కోట్ల ఐటీ ఎగుమతులను నమోదు చేయగా.. ఐదేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.22.5 కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపట్టింది.

రాజీవ్ గాంధీ సేవలను దేశం మరువదు

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- శ్రీపెరంబదూర్ నుంచి ఢిల్లీ వెళుతున్న అమరజ్యోతి యాత్రకు స్వాగతం
- సంగారెడ్డిలో వాహనాలతో భారీ ర్యాలీ

సంగారెడ్డి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కొనియాడారు. తమిళనాడులోని శ్రీపెరంబదూర్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన రాజీవ్ గాంధీ అమరజ్యోతి యాత్ర మంగళవారం సంగారెడ్డికి చేరుకుంది. ఆర్.దొరై ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రకు జగ్గారెడ్డితో పాటు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకుంటున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని రాజీవ్ గాంధీ దేశంలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఐటీ వ్యవస్థ పటిష్ఠమైందంటే నాడు రాజీవ్ గాంధీ చొరవే కారణమన్నారు. టెక్నాలజీతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను రాజకీయాల్లో భాగస్వాములను చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



సంగారెడ్డిలో రాజీవ్‌గాంధీ అమరజ్యోతితో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

మంత్రి తుమ్మల కంటతడి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో మాట్లాడారు. "నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే మంత్రిగా ఉన్నానే తప్ప.. పబ్లిసిటీ కోసం పనిచేసేవాడిని కాదు. చీప్ పబ్లిసిటీలు నాకు అవసరం లేదు. ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించడమే నా లక్ష్యం" అని అన్నారు. ఈ నెల 15న జరిగే సీతారామ ఎత్తిపోతల స్విచ్చాన్ కార్యక్రమానికి బీఆర్ఎస్ వాళ్లు కూడా రావచ్చునని సూచించారు. "వైరా సభలో.. మీ ప్రభుత్వంలో మీరు సీతారామ ప్రాజెక్టును ఎలా వదిలేశారో చెప్పుకొనేందుకు అవకాశం కల్పిస్తాం" అని తుమ్మల వ్యాఖ్యానించారు.

8 వేల కోట్లు ఖర్చుపెట్టి అసంపూర్తిగా వదిలేశారు..

గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరానికి కూడా నీళ్లివ్వకుండా అసంపూర్తిగా వదిలేసిందని మంత్రి తుమ్మల చెప్పారు. కనీసం ఉన్న వనరులతోనైనా సాధ్యమైనంత వరకు నీరందించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తరలించి.. వైరా, లంకసాగర్ పరిధిలో లక్షా 25 వేల ఎకరాలకు ఈ ఏడాది నీరివ్వవచ్చని ఒప్పించానన్నారు. ముఖ్యమంత్రి రూ.90 కోట్లు మంజూరు చేయడంతో రెండు నెలల్లో పనులు పూర్తిచేయించి, కాలువలు తవ్వించి నీళ్లు వదలబోతున్నామని చెప్పారు. "గత ప్రభుత్వ హయాంలో మొదటి ఐదేళ్లలో సీతారామ ప్రాజెక్టు పనులు చేపట్టి.. అక్కడక్కడా కాలవలు తవ్వి.. మూడు పంపుహౌజ్‌లకు మోటార్లు పెట్టి వదిలేశారు. ఆ తర్వాత ఐదేళ్లలో ఈ పనులను పట్టించుకోకుండా డిజైన్ మార్చి అస్తవ్యస్తం చేశారు. అయినా రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టారు. ప్రజల సొమ్ము వృధా కాకూడదనే మేం సత్వరం ఎత్తిపోతలు పూర్తి చేయాలని భావించాం. ట్రయల్‌రన్ నిర్వహించకపోతే మోటార్లు పనిచేయవనే ఉద్దేశంతో వాటిని వినియోగంలోకి తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే తప్పుడు విమర్శలు చేయడం హరీశ్‌రావుకు తగదు" అని తుమ్మల అన్నారు.

నేను స్విచాన్ చేయలేదు..

మొదటి పంపుహౌజ్‌కు తాను స్విచాన్ చేయలేదని, నీటిపారుదల శాఖ నిపుణుడు పెంటారెడ్డితో చేయించానని మంత్రి తుమ్మల తెలిపారు. ఒక మనిషిలా గోదావరి జలాలను తలపై చల్లుకున్నానని చెప్పారు. తన రాజకీయ జీవిత లక్ష్యం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు గోదావరి జలాలను అందించడమేనని, అంతేతప్ప.. ఫ్లెక్సీల కోసం, ప్రకటనల కోసం, స్వార్థం కోసం ఏనాడూ ఏ పనీ చేయలేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువ కాలం మంత్రిగా పనిచేసే అవకాశం తనకు లభించిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోనూ మంత్రిగా.. అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎన్టీఆర్, వైఎస్ఆర్, చంద్రబాబు చేసిన అభివృద్ధి పనులు ఎక్కడైనా మిగిలిపోతే వాటిని పూర్తిచేశానే తప్ప.. గత ప్రభుత్వాలు చేశాయని వివక్ష చూపించలేదన్నారు. ప్రజాభిమానం ఉంటేనే గద్దెపై ఉంటామన్న విషయం గుర్తుంచుకోవాలని, బీఆర్ఎస్ నేతల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి బాధ ఇంకా కనిపిస్తోందని అన్నారు. వారి పాలనలో తప్పిదాలను తమ ప్రభుత్వానికి అంటగట్టవద్దన్నారు. గతంలో ఇష్టానుసారంగా గురుకులాలు పెట్టి సమస్యలు గాలికి వదిలేశారని, ఈ ఆరు నెలల్లోనే తమ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నట్టుగా విమర్శలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

రైతు బీమా పథకంలోకి 3 లక్షల మంది కొత్త రైతులు

- రేపటి నుంచి కొత్త ఏడాది ఇన్సూరెన్స్
- ప్రీమియంకు రూ.1,590 కోట్ల నిధులు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా పథకంలోకి కొత్తగా 3 లక్షల మంది అన్నదాతలు చేరారు. గత ఏడాది(2023-24) ఈ పథకంలో 41 లక్షల మంది రైతులు ఉండగా.. వారిలో 59 ఏళ్లు నిండిన వారు, భూములు పూర్తిగా అమ్ముకున్న వారు, చనిపోయిన రైతులు కలిపి 2 లక్షల మంది డిలీట్ అయ్యారు. దీంతో పాత రైతుల సంఖ్య 39 లక్షలకు తగ్గిపోయింది. వీరికి పాలసీ రెన్యూవల్ చేశారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొంది.. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు 3 లక్షల మంది రైతు బీమా కోసం నమోదు చేసుకున్నారు. దీంతో పథకంలో లబ్ధిదారుల సంఖ్య 42 లక్షలకు చేరింది. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకుని, రైతు బీమా పథకంలో లేని అన్నదాతలను నమోదు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి గత నెలలో సర్క్యులర్ జారీచేశారు. 2024-25 ఫార్మర్ గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో కొత్త రైతులను చేర్చటానికి ఆగస్టు 5 నాటికి గడువు ప్రకటించారు. తర్వాత మరో రెండు రోజులు పొడిగించి.. ఈనెల ఏడో తేదీకి ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,22,582 మంది కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకోగా.. వారిలో 3 లక్షల మంది బీమా కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం తుది జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఐసీకి సమర్పించింది. రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తోంది. గత ఏడాది ఒక్కో రైతుకు రూ.3,600 చొప్పున చెల్లించింది. ఈసారి కూడా కాస్త అటూఇటుగా అంతే మొత్తం కడుతోంది. దీనికోసం సర్కారు రూ.1,590 కోట్ల బడ్జెట్ కేటాయింపులు చేసింది. రైతు బీమా పథకంలో నమోదైన రైతులు ఏ కారణంతో చనిపోయినా.. వారి కుటుంబానికి రూ.5 లక్షలు అందిస్తారు. కాగా, ఈ పథకం 2018-19 నుంచి మన రాష్ట్రంలో ప్రారంభమైంది. ఆగస్టు 15 నుంచి ఏడో సంవత్సరం ప్రారంభం అవుతోంది.

బాన్సువాడలో ఉప ఎన్నిక ఖాయం

- పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారు
- బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కేటీఆర్
- గురుకులాల సమస్యలపై ప్రభుత్వం స్పందించడం సంతోషమేనని వ్యాఖ్య



హైదరాబాద్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం ఖాయమని, పార్టీ మారిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిశారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల కష్టంపై గెలిచి స్వార్థం కోసం పోచారం పార్టీ వీడటం కార్యకర్తలను బాధించిందని, కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేస్తే ఎంత పెద్దవారైనా వదిలిపెట్టేది లేదన్నారు. కాంగ్రెస్‌లో చేరిన పోచారంను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఆయన పార్టీ వీడినా.. అక్కడి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మాత్రం పార్టీ మారలేదన్నారు. బాన్సువాడ ఉప ఎన్నికలో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఓడిస్తామని చెప్పారు. కాగా, ఇప్పటివరకు మొద్దునిద్రపోయిన కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా గురుకులాల సమస్యలపై స్పందించడమే సంతోషమేనని, కనీస సౌకర్యాలు కల్పించి విద్యార్థుల బాధలు తీర్చాలని కేటీఆర్ పేర్కొన్నారు. కలుషిత ఆహారం కారణంగా 500 మందికి పైగా విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని, గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు.

గురుకులాల్లో మిగిలిన పోస్టులను భర్తీ చేయాలి

గురుకులాల్లో చేపట్టిన నియామకాల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన పోస్టులను మెరిట్ జాబితాలోని తదుపరి అభ్యర్థులతో భర్తీ చేయాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురుకుల అభ్యర్థులు పలువురు మంగళవారం నందినగర్‌లో కేటీఆర్‌ను కలిశారు. గురుకులాల్లో భారీగా ఏర్పడే ఖాళీలను నిరుద్యోగులు నష్టపోకుండా తదుపరి మెరిట్ ఉన్నవారిని ఎంపిక చేయాల్సిన అవసరం ఉందని గురుకుల అభ్యర్థులు తెలిపారు. దీనిపై స్పందించిన కేటీఆర్ గురుకులాల్లో భర్తీ కాకుండా మిగిలిపోయే పోస్టుల్లో తదుపరి మెరిట్ అభ్యర్థులకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించేలా ప్రతిపక్ష పార్టీగా నిరుద్యోగుల తరఫున పోరాటం చేస్తామని వెల్లడించారు.

అభిషేక్ బోయిన్‌పల్లి తాత్కాలిక బెయిల్ పొడిగింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో మనీలాండ రింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అభిషేక్ బోయిన్‌పల్లికి ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను మంగళ వారం సుప్రీంకోర్టు పొడిగించింది. భార్యకు అనారోగ్యం ఉందన్న కారణంతో గతంలో ఆయనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్ కాలపరిమితిని పెంచింది. విచారణ జరిపిన జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఈడీ తరఫున వాదనలు విని పించాల్సిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు అందుబాటులో లేక పోవడంతో కేసు తదుపరి విచారణను అక్టోబరు 14కు వాయిదా వేసింది.

వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జ్యోతిష్యుడు వేణుస్వామికి తెలం గాణ మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. సినీ నటుడు నాగచైతన్య, శోభిత ధూళిపాల పెళ్లిపై వేణుస్వామి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిలిం డిజిటల్ మీడియా అసోసియేషన్‌లు.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని, ఆయన వీడియోలను ప్రసారం చేసిన యూట్యూబ్ ఛానళ్లపై కూడా విచారణ చేయాలని డిమాండ్ చేశాయి. స్పందించిన మహిళా కమిషన్ 22న విచారణకు హాజరు కావాలని వేణుస్వామికి నోటీసులు ఇచ్చింది.

ఇసుక తవ్వకాలకు సుప్రీంకోర్టు అనుమతి

రాష్ట్రంలోని 25 రీచ్‌లలో ఇసుక తవ్వకాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) వ్యక్తం చేసిన అభ్యంతరాలపై మంగళవారం సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఈ విషయాన్ని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ తెలిపారు. ఈ కారణంగా ఇసుక తవ్వకాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఇసుక పూడికతీతకు సంబంధించి కొంతమంది ఎన్‌జీటీని ఆశ్రయించారు. దానిపై ఎన్‌జీటీ ఇచ్చిన ఉత్తర్వుల కారణంగా ఆయా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు నిలిచిపోయాయి. దాంతో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎన్‌జీటీ ఆంక్షలపై స్టే విధిస్తూ ఇసుక తవ్వకాలకు అనుమతించిందని ఛైర్మన్ వివరించారు.

వరంగల్‌కు ఇంటర్ ఆర్‌జేడీ కార్యాలయం!

వరంగల్‌లో ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ కార్యాలయాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం బోర్డు కార్యదర్శి ఆదేశాలను జారీ చేశారు. డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌లో పనిచేస్తున్న వరంగల్ ఆర్‌జేడీని తిరిగి అక్కడికి బదిలీ చేశారు. వరంగల్‌లోని ఇంటర్ ఆర్‌జేడీ కార్యాలయాన్ని కొన్నాళ్ల కిత్రం తాత్కాలికంగా హైదరాబాద్‌కు తరలించిన సంగతి తెలిసిందే.

అత్యున్నత పౌరశిక్షణా సంస్థగా నిమ్స్‌మీ

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మీ) అత్యుత్తమ పౌరశిక్షణా సంస్థగా గుర్తింపు సాధించింది. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని వసతులు, అందిస్తున్న శిక్షణలపై ఇటీవలే కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ అధ్యయనం చేసింది. ఇందులో అత్యుత్తమ శిక్షణా సంస్థగా నిమ్స్‌మీని గుర్తించింది. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా నిమ్స్‌మీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్ గ్లోరి స్వరూప ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. 1960లో నగరంలో ప్రారంభమైన నిమ్స్‌మీ ఆరు దశాబ్దాల్లో వేలాదిమంది వ్యాపారవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, నిరుద్యోగులకు శిక్షణ అందించిందని ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు.


డీఎస్సీ 'కీ' విడుదల

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ' విడుదయ్యింది. దానిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 20వ తేదీలోపు తెలియజేయాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలో 11,063 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

అర అడుగే తక్కువ!

589.50 అడుగులకు సాగర్ నీటి మట్టం

చురుగ్గా తుంగభద్ర స్టాప్‌లాగ్ పనులు



589.50 అడుగుల వద్ద నీటిమట్టం

హైదరాబాద్, గద్వాల, నాగార్జున సాగర్, ఆగస్టు 13: నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 589.50 అడుగుల (310.25 టీఎంసీలు)కు చేరింది. కుడి కాల్వ ద్వారా 7,086 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,629 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం నుంచి 29,232 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 68,453 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. కాగా, ఆల్మట్టికి 30,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్‌కు 15 వేల ఇన్‌ఫ్లో వస్తుండగా జల విద్యుత్ ఉత్పత్తితో 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల 8.83 టీఎంసీలకు చేరింది. 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేయడంతో పాటు జల విద్యుత్ ఉత్పత్తిని కూడా నిలిపివేశారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 97 వేల క్యూసెక్కులు విడిచి పెడుతున్నారు. శ్రీశైలంలో నీటి నిల్వ 881 అడుగుల (193.40 టీఎంసీలు)కు పెరిగింది. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల నుంచి 68,453 క్యూసెక్కులను సాగర్‌కు వదులుతున్నారు.

తుంగభద్ర 'స్టాప్‌లాగ్'లో 60 మంది

తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రాజెక్టు బోర్డు, ఏపీ, కర్ణాటక అధికారులు, 60 మంది నిపుణులు పాల్గొంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రాజెక్టు గేట్ల నిపుణుడు, సలహాదారు కన్నయ్యనాయుడి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. స్టాప్‌లాగ్‌ను ఐదు సెగ్మెంట్లుగా తయారు చేస్తున్నారు. ఒక్కోటి 60 అడుగులు వెడల్పు, 4 అడుగులు ఎత్తు, 13 టన్నుల బరువు చొప్పున మొత్తం 20 అడుగుల ఎత్తు, 65 టన్నుల బరువుంటుంది. వారాంతంలో భారీ వర్షాలు కురవొచ్చని.. 3-4 రోజుల్లోనే గేటు అమర్చాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య సూచించారు.

ఏసీబీ వలలో అదనపు కలెక్టర్

నిషేధిత జాబితా నుంచి 14 గుంటల భూమి తొలగించేందుకు రూ.8 లక్షల డిమాండ్

- ఆ డబ్బు తీసుకోవాల్సిందిగా సీనియర్ అసిస్టెంట్‌ను పురమాయించిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్
- డబ్బు తీసుకుంటుండగా తొలుత సీనియర్ అసిస్టెంట్‌ను, ఆపై భూపాల్ రెడ్డిని పట్టుకున్న ఏసీబీ అధికారులు

రంగారెడ్డి అర్బన్, అబ్దుల్లాపూర్‌మెట్, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించేందుకు లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి దొరికిపోయారు. లంచం డబ్బులు తీసుకోవాలంటూ జూనియర్ అధికారిని పురమాయించడం ద్వారా ఆ అధికారి అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తే.. ఏసీబీ అధికారులు అంతకుమించి చాకచక్యంగా వ్యవహరించి ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు భూపాల్‌రెడ్డితో పాటు కలెక్టరేట్ ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. హైదరాబాద్ నగర శివార్లలోని గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డికి చెందిన 14 గుంటల భూమి ధరణిలో నిషేధిత జాబితాలో ఉంది. దీన్ని ఆ జాబితా నుంచి తొలగించాలంటూ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ముత్యంరెడ్డి వినతి పత్రం ఇచ్చాడు. పని అవ్వకపోవడంతో ముత్యంరెడ్డి ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డిని కలవగా ఆయన పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ. 8 లక్షలకు ఒప్పందం కుదిరింది. అయితే ఈ లంచం వ్యవహారం గురించి ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి మదన్ మోహన్‌ను ముత్యంరెడ్డి కలిసి ఆ డబ్బు ఇచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు.. మదన్ మోహన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు మదన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దీన్ని ధ్రువీకరించుకునేందుకు తమ ముందే అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేయాలంటూ ఏసీబీ అధికారులు ఆయన్ను ఆదేశించారు. మదన్‌మెహన్ వెంటనే భూపాల్‌రెడ్డికి తన ఫోన్ నుంచి కాల్ చేశారు. గుర్రంగూడ భూమికి సంబంధించిన విషయంలో డబ్బు చేతికి అందిందని చెప్పగానే ఆ డబ్బు తీసుకుని పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్దకు రావాలని భూపాల్ రెడ్డి సూచించారు. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. మదన్‌మోహన్‌ను కారులో డబ్బుతో వెళ్లాలని ఆదేశించి.. ఆ వాహనాన్ని తమ కారులో అనుసరించారు. చెప్పిన చోటుకు వెళ్లి, అక్కడ రూ.8 లక్షలు అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి మదన్‌మోహన్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అక్కడి నుంచి భూపాల్‌రెడ్డి, మదన్‌మోహన్‌ను అర్ధరాత్రి కలెక్టరేట్‌కు తరలించారు. కాగా బాధితుడు ముత్యంరెడ్డి గతంలోనూ ఐదుగురు అధికారులను ఏసీబీకి పట్టించడం గమనార్హం. ఏబీసీ అధికారులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 10:30 వరకు కలెక్టరేట్‌లో రికార్డులను పరిశీలించారు. తట్టిఅన్నారం ఇందు అరణ్య హరితలోని అదనపు కలెక్టర్ విల్లాలో అధికారుల బృందం సోదాలు చేపట్టింది. ఈ మేరకు రూ.16 లక్షల నగదు, స్థిరాస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం భూపాల్‌రెడ్డి, మదన్‌మోన్ ను అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు.


అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని, 2-సెక్షన్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డి అరెస్ట్ చేసి కలెక్టరేట్ నుంచి ఏసీబీ కోర్టుకు తీసుకెళుతున్న అధికారులు

గతంలో మంత్రి ఓఎస్డీగా భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఏసీబీకి చిక్కిన భూపాల్‌రెడ్డి గతంలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి వద్ద ఓఎస్డీగా చేశారు. తరువాత భువనగిరి డివిజన్ పరిధిలోని బీబీనగర్, బొమ్మలరామారం, చౌటుప్పల్, యాదగిరిగుట్టలో తహసీల్దార్‌గా చేశారు. అనంతరం భువనగిరి ఆర్డీవోగా పనిచేశారు. అంతకు ముందు ఆయన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా, అనంతరం కలెక్టరేట్‌లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఈ సమయంలో గతంలోనూ ఆయన అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి షాద్‌నగర్‌లో వీఆర్వోగా పనిచేశారు.

'పర్యాటక' హోటళ్లు ప్రైవేట్‌కు!

(మొదటిపేజీ తరువాయి)

కొండగట్టు, కాళేశ్వరం, జెన్నారంలోని హరిత రెస్టారెంట్లు ఉన్నాయి. అలాగే పెంబర్తి, వైరా, జహీరాబాద్‌లలోని పర్యాటక స్థలాలు, అలంపూర్, రామప్ప, భద్రాచలం, లక్నవరం, బాసర, మెదక్ ఫోర్ట్, ఘనపూర్, నిజామాబాద్, కొత్తగూడెం, అలీసాగర్‌లోని హరితహోటళ్లు, రెస్టారెంట్లు.. గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియం, సిద్దిపేట కోమటిచెరువు ప్రాంతంలోని గేమింగ్ జోన్, సింగూర్‌లోని ఎకో టూరిజం పార్క్, ఝరాసంగం కాటేజీలు, శ్రీరంగపురం రెస్టారెంట్, మహబూబ్‌నగర్‌లోని మినీ శిల్పారామం, బంకెట్‌హాల్, షాపులు సైతం ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటు హైదరాబాద్ లంగర్‌హౌజ్ బాపూఘాట్ సమీపం సంగం ప్రాంతంలోని ఎకరంన్నరకు పైగా ఖాళీ స్థలాన్ని కూడా లీజుకు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే లీజుకిచ్చిన పర్యాటక సంస్థ ఆస్తులకు సంబంధించి రావాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోయాయి. సుమారు రూ.400 కోట్లకు పైగా పర్యాటక సంస్థకు లీజు బకాయిలు రావాల్సి ఉందని అంచనా. ఎప్పటికప్పుడు లీజు మొత్తాన్ని వసూలు చేయడానికి అవసరమైన యంత్రాంగం పర్యాటక సంస్థలో అందుబాటులో లేకపోవడంతో రూ.వందల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయినట్లు ఆరోపణలున్నాయి. రాజకీయ సిఫారసులతో పర్యాటక సంస్థ ఆస్తుల లీజు దక్కించుకున్న కొందరు బడా బాబులు రూ. కోట్ల బకాయిలు చెల్లించకుండా ముఖం చాటేశారు. దీంతో బకాయిలు వసూలు చేయలేక పర్యాటక సంస్థ లీజుదారులకు నోటీసులు జారీ చేసి వారి సమాధానం కోసం నిరీక్షిస్తోంది. ఈ క్రమంలోనే కొంత మంది లీజుదారులు కోర్టులను ఆశ్రయించారు. ఇక కొత్తగా లీజుకు ఇవ్వాలని చూస్తున్న 35 ఆస్తులకు సంబంధించి ఏటా కోట్లలోనే ఆదాయం సమకూరుతోంది. ఆ ఆదాయానికి తగ్గట్లుగానే లీజు వస్తుందా? అన్నది కూడా సర్కారు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే లీజు బకాయిలు, భవిష్యత్తులో అద్దెవసూళ్లకు సంబంధించిన అంశాలపై పకడ్బందీ విధానాన్ని అనుసరించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉద్యోగుల్లో ఆందోళన..

పర్యాటక సంస్థ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకొని ప్రైవేటుకు లీజుకిచ్చిన పక్షంలో ఆయా హోటళ్లు, రెస్టారెంట్లలో పని చేస్తున్న తమ పరిస్థితి ఏంటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పర్యాటక సంస్థలో సుమారు 650కి పైగా వివిధ స్థాయిలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 60 మంది వరకు రెగ్యులర్ కాగా.. మరో 180 మంది కాంట్రాక్టు, 400 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. ఈనేపథ్యంలోనే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొత్తగా లీజుకు తీసుకునే సంస్థలతో పనిచేసేలా చేస్తే.. వీరి ఉపాధికి ఢోకా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 14 ఆగస్టు 2024



ఎన్‌జీ రంగా వర్సిటీలో
పీజీ, పీహెచ్‌డీ ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు: అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ (హోంసైన్స్)

స్పెషలైజేషన్‌లు:

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు
- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్ లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

సీట్ల వివరాలు: పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.

అర్హత: పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 31
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి పీజీ, డిగ్రీ ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లామ్, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ: ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,50,000

ఎంసీఏ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,25,000

☆ **దరఖాస్తు ఫీజు:** రూ.2,000 ☆ **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600

☆ **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
☆ **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
☆ **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
☆ **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగరం ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
☆ **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org

జాబ్ కార్నర్
ఐఎంయూలో అసిస్టెంట్ ఉద్యోగాలు

ఖాళీలు: 27

చెన్నైలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
- **అసిస్టెంట్:** 15 పోస్టులు
- **అసిస్టెంట్(ఫైనాన్సింగ్):** 12 పోస్టులు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలో పరిజ్ఞానం ఉండాలి.
జీతం: నెలకు రూ.5,200 నుంచి రూ.20,000 వరకు
వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు
ఎంపిక: ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తదితరాల ఆధారంగా
దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.700, ఇతరులకు రూ.1000.
పని ప్రదేశం: చెన్నై, ముంబయి, కోల్‌కతా, విశాఖపట్నం, కొచ్చి
పరీక్ష కేంద్రాలు: న్యూఢిల్లీ, లఖ్‌నవూ, పట్నా, కోల్‌కతా, గువాహటీ, హైదరాబాద్, చెన్నై, కొచ్చిన్, బెంగళూరు, ముంబయి, భోపాల్, జైపూర్.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: https://www.imu.edu.in/imunew/



'క్యాట్' స్కోరింగ్ ఇలా!

ఇతర జాతీయ స్థాయి పోటీ పరీక్షలతో పోల్చితే కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) కఠినమైనదే. 21 ఐఐఎంలతోపాటు ఇతర ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో ఎంబీఏలో ప్రవేశం కోరుకునే వారందరూ తప్పనిసరిగా 'క్యాట్'లో మంచి స్కోరు సాధించాలి. ఇటీవల ఎన్టీఏ నిర్వహించిన పలు పరీక్షల పేపర్లు లీక్ అయిన సందర్భాలు ఉన్నప్పటికీ, 'క్యాట్' ఆదరణ ఏ మాత్రం చెక్కు చెదర లేదు. అందుకు దానికి వచ్చే దరఖాస్తులే నిదర్శనం.



వాస్తవానికి ఐఐఎంలలో ఎంబీఏలో ప్రవేశానికి 'క్యాట్'ని ఉద్దేశించినప్పటికీ... మెరుగైన స్కోరు ఉండి ఐఐఎంలలో సీటు రాని వారు దేశంలోని ఇతర ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో చేరేందుకు చాలా అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే దేశంలోని మెజార్టీ మేనేజ్‌మెంట్ విద్యాలయాలు క్యాట్ స్కోరు ఆధారంగా సీట్లు భర్తీ చేస్తున్నాయి.

- క్యాట్‌కు ప్రిపేర్ అయిన అభ్యర్థులు మ్యాట్, ఎక్స్ఏటీ, సీమ్యాట్ వంటి మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్షలను కూడా అటెంప్ట్ చేయగలరు. ఎందుకంటే ఈ పరీక్షల సిలబస్ కూడా దాదాపు క్యాట్‌తో సరిపోలి ఉంటుంది. అందువల్ల అభ్యర్థులు క్యాట్‌పై పట్టు సాధిస్తే ఇతర మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్షలు ఏమంత కష్టంగా అనిపించవు.

సెక్షన్ల వారీగా ప్రిపరేషన్

క్యాట్ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. అవి.. వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ. అభ్యర్థులు ప్రతీ సెక్షన్‌ను క్రమ పద్ధతిలో అధ్యయనం చేయాలి. దీనికంటే ముందు పరీక్ష విధానాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. అంటే సిలబస్, ప్యాటర్న్, టైమ్ అల్లోకేషన్, వెయిటేజీ, ప్రశ్నల కఠినత్వం వంటి వాటిపై సమగ్ర అవగాహనకు రావాలి. ఆ తరవాతే ప్రిపరేషన్‌ను ప్రారంభించాలి. కోచింగ్ సెంటర్‌కు వెళ్లాలా? సొంత ప్రిపరేషన్‌ను ఆరంభించాలా? అనేది తమ తమ సామర్థ్యాలను బట్టి అభ్యర్థులు నిర్ణయించుకోవాలి. సరిపడే మెటీరియల్‌ను సేకరించుకుని సొంత ప్రిపరేషన్‌తో ఐఐఎంలో సీటు సాధించిన వారు ఎందరో ఉన్నారు. అందువల్ల కోచింగ్ తప్పనిసరి ఏమీ కాదు.

- రెగ్యులర్ స్టడీస్‌తో పోల్చితే క్యాట్‌లో టాపిక్స్ కొంత మేర భిన్నంగా ఉంటాయి. అంతమాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదు. ఒకసారి క్యాట్ సరళిపై అవగాహన వస్తే.. ప్రిపరేషన్‌కు అవసరమైన మెటీరియల్‌ను సేకరించడం సులువే. మార్కెట్‌లో క్యాట్/మ్యాట్‌కు సంబంధించిన మెటీరియల్ లభిస్తోంది. సబ్జెక్టుల వారీగా ఎన్నో పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

వీటికి తోడు గత ప్రశ్న పత్రాలను సాధించడం ద్వారా ప్రిపరేషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.

- అన్ని విభాగాల్లోనూ పట్టు సాధించినప్పుడే క్యాట్‌లో మొత్తంగా మంచి స్కోరు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రిపరేషన్‌లో కష్టంగా అనిపించిన విభాగాలు లేదా ప్రశ్నలను వదిలివేయాలి. మిగతా వాటిపై దృష్టి కేంద్రీకరించాలి. కష్టంగా అనిపించిన వాటిని నిపుణులు లేదా తోటి అభ్యర్థులను అడిగి నివృత్తి చేసుకోవాలి. వాటికి అదనపు సమయాన్ని కేటాయించాలి లేదా ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ఏ పోటీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థి అయినా తప్పనిసరిగా తన బలాలు, బలహీనతలు గుర్తించగలగాలి.

డెయిలీ/వీక్లీ స్టడీ షెడ్యూల్‌ను రూపొందించుకోవాలి. దాన్ని కచ్చితంగా ఫాలో కావాలి. ప్రిపరేషన్ స్ట్రాటజీ మేరకు అధ్యయనం కొనసాగుతుందో లేదో తరచుగా చెక్ చేసుకుంటూ ఉండాలి. క్యాట్‌కు ప్రిపేర్ అవుతున్న తోటి అభ్యర్థులతో ఎప్పటికప్పుడు సిలబస్‌లోని టాపిక్‌లపై చర్చిస్తూ ఉండాలి. ఒకరితో చర్చించడం, వారి నుంచి మనకు తెలియని విషయాలు నేర్చుకోవడం మంచి ఫలితాలను ఇస్తుంది. ఒకవైపు ప్రిపరేషన్‌పై దృష్టి కేంద్రీకరిస్తూనే దానికి సమాంతరంగా మేథమెటికల్, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్‌ను పెంచుకునే ప్రయత్నం చేయాలి. మేథమెటికల్ స్కిల్స్ అంటే మరేమిటో కాదు... అవి ఫండమెంటల్స్ ఆఫ్ రేషియోస్, పర్సంటేజెస్, ఇంటరెస్ట్, ఇతర క్యాలిక్యులేషన్స్.

పరీక్ష రాయడం

ఇచ్చిన ప్రశ్నల్లో కోర్ ఇష్యూస్‌ని అర్థం చేసుకోవడం, గందరగోళానికి లోను కాకుండా ఉండటంతో పాటు అనవసర డేటా లేదా సమాచారాన్ని ఫిల్టర్ చేయడంలో మేథమెటికల్ క్రిటికల్ థింకింగ్ పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ రీజనింగ్ ప్రశ్నల్లో కొన్ని తికమక పెట్టేవిగా ఉంటాయి. కాబట్టి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలను రెండు విధాలుగా సాధించవచ్చు. మొదట..మీకు కరెక్టుగా అనిపించిన సమాధానాలను గుర్తిస్తూ... తెలియని వాటిని ఎలిమినేట్ చేస్తూ వెళ్లడం. తరవాత సమయం ఉంటే తెలియని వాటిని ప్రయత్నించడం. ఏదేమైనప్పటికీ తెలియని వాటికి ఊహిస్తూ సమాధానాలను గుర్తించడం కంటే ఎలిమినేట్ చేయడమే ఉత్తమం. ఇక క్యాట్ పరీక్షలో మరో ప్రధాన అంశం వేగం. చాలా మంది అభ్యర్థులు మొత్తం ప్రశ్న పత్రాన్ని అటెంప్ట్ చేయడంలో విఫలమవుతున్నారు. ఎందుకంటే వారు కఠినమైన ప్రశ్నలు సాధించడంలో మునిగిపోయి టైం మేనేజ్‌మెంట్‌ను పట్టించుకోరు. కాబట్టి పరీక్షలో ప్రతీ సెకను విలువైనదనే విషయాన్ని అభ్యర్థులు గమనంలో పెట్టుకోవాలి. సమాధానాన్ని గుర్తిస్తూ ఒక ప్రశ్న నుంచి మరో ప్రశ్నకు వేగంగా షిఫ్ట్ అవ్వాలి. కచ్చితత్వంతో పాటు వేగంపై పట్టు సాధించాలంటే వీలైనన్ని మాక్ టెస్టులను సాధించాలి. ఇందుకోసం పెయిడ్ లేదా ఫ్రీ మాక్‌టెస్టులు ఎన్నో నేడు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటున్నాయి. గత పరీక్షలపై విశ్లేషణలు పరిశీలించడం, క్యాట్‌లో విజయం సాధించిన అభ్యర్థుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడం క్యాట్ విజయానికి సోపానాలు.

లిటిల్స్



ఎవరెక్కువ తినాలి?

ఒక ఊరిలో రాము, గోవిందు, రఘు అనే ముగ్గురు మిత్రులు ఉండేవారు. వారు ముగ్గురూ పనిమీద పొరుగూరికి ప్రయాణం అయ్యారు. దారి మధ్యలో వారికి బాగా ఆకలి వేసింది. చుట్టూ చూస్తే, వారికి ఎక్కడినుంచో తియ్యని వాసన వచ్చింది. వెతికి చూడగా అది బాగా పండిన ఒక పనస పండు దగ్గరలో ఉన్న చెట్టుకు కాసి ఉంది. రాము త్వరగా వెళ్లి, ఆ పనస పండును కోసాడు. రఘు దాన్ని వలిచి తొనలు వేరు చేసాడు ఈలోగా ఆ ముగ్గురిలో ఎవరు ఎక్కువ తినాలనే వాదన మొదలైంది పండును ముందుగా చూసి, చెట్టునుండి కోసింది నేను కాబట్టి నేనే ఎక్కువ తినాలి అన్నాడు రాము. దాన్ని పొట్టు ఒలిచి తొనలు వేరు చేసింది నేను కాబట్టి నేనే ఎక్కువ తినాలన్నాడు రఘు. మన ముగ్గురిలో నేనే పెద్ద వాడిని కాబట్టి నేనే ఎక్కువ తింటాను అన్నాడు గోవిందు. అలా కాసేపు వాదులాడుకున్నాక అలసటవల్ల ముగ్గురూ అదే చెట్టు కింద నిద్రపోయారు. కొంత సేపటికి మేలుకుని చూసేసరికి పండు కనిపించలేదు. రాము, రఘు ఇద్దరూ ఆ పండును ఇంకా నిద్రపోతూ ఉన్న గోవిందు తినేసి ఉంటాడని అనుకున్నారు. ఇద్దరూ గోవిందును పండు ఏదని అడిగారు. దానికి గోవిందు 'నిద్రలో కలలో నాకు దేవుడు కనిపించి, పండు తినమని చెప్పాడు. అందుకే పండు మొత్తం నేనే తినేసాను' అని చెప్పాడు. ఇద్దరూ గోవిందును చాలా తిట్టారు. 'ఎంత దేవుడు కలలో కనపడి చెబితే మాత్రం మాకు రెండు తొనలైనా ఉంచకుండా మొత్తం తింటావా నువ్వు అసలు మా మిత్రుడివేనా?' అని దెబ్బలాడారు రాము, రఘు. మెల్లగా చెట్టు చాటునుండి దాచిన పండు తీసుకుని వచ్చి వారికి ఇస్తూ, ఇలా అన్నాడు గోవిందు 'అసలు మీరు మిత్ర ధర్మం పాటించారా చెప్పండి ఉన్న పనస తొనలు ముగ్గురం సమానంగా పంచుకుని తినాలే కానీ ఒకరు ఎక్కువ తినడం, మరొకరు తక్కువ తినడం ఏమిటి? మీరు ఇలా చిన్న పిల్లల లాగా గొడవ పడుతుంటే చిరాకు వేసి, నేనే పండు దాచేసాను. నిద్ర లేచాక అందరం సమానంగా పంచుకుని తిందామని' అన్నాడు. ఆ మాటలకు సిగ్గుపడ్డ రాము, రఘు మరెప్పుడూ తమలో తాము గొడవలు పడకూడదని అనుకున్నారు.

దారి కనుక్కోండి





7 తేడాలు గుర్తించండి



ఎన్ని కుక్కలు, పిల్లులు ఉన్నాయి



సరైన నీడ కనుక్కోండి



డైలీ సుడోకు - 383

5					3
	4	2			5
4		3		5	
	5		3		4
1			5	3	
2					1

సుడోకు - 382 సమాధానం

1	6	4	3	2	5
5	2	3	1	6	4
3	1	6	5	4	2
4	5	2	6	3	1
6	4	1	2	5	3
2	3	5	4	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.